www.flashindianews.com

# ఫ్లాష్ ఇండియా

తెలుగు దినపత్రిక

FLASH INDIA TELUGU DAILY

RNI NO. APTEL/2010/33229

విలేకరులు కావలెను

17 సం|| లుగా వెలువడుతున్న "ఫ్లాష్ ఇండియా" తెలుగు దిన పత్రికలో పనిచేయుటకు తెలంగాణ రాష్ట్రంలోని జిల్లాలు, నియోజకవర్గాల వారీగా విలేకరులు కావలెను..

సెల్ నెంబర్: 9951494039

సంపుటి : 17 | సంచిక :79 | శుక్రవారం 24.04.2026 | ఎడిటర్ : కొమరాజు శ్రీనివాసులు | పేజీలు :08 | వెల : రూ 2/-


# బెంగాల్‌లో మార్పు తథ్యం

## 'ఝాల్ మురీ'తో టీఎంసీకి చురకలు

### మే 4న ఫలితాల రోజు బెంగాల్‌లో బీజేపీ విజయోత్సవాలు

- గతంలో ఎక్కువ ఓటింగ్ జరిగిన ప్రాంతాల్లో బీజేపీ గెలిచిందని చెప్పారు
- మే 4న ఫలితాల రోజు బెంగాల్‌లో బీజేపీ విజయోత్సవాలు జరుగుతాయని ధీమా
- బెంగాల్ ప్రత్యేక వంటకం ఝాల్ మురీ గురించి సరదాగా వ్యాఖ్యలు
- గత 50 ఏళ్లలో హింస తక్కువగా జరిగిన ఎన్నికలు ఇవే
- బెంగాల్ ప్రజలు మార్పు కోరుకుంటున్నారు అని తెలిపారు
- అందుకే రికార్డు స్థాయిలో ఓటింగ్ జరుగుతోందని చెప్పారు

02



**పశ్చిమ బెంగాల్ :**

పశ్చిమ బెంగాల్ అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ సరళిపై ప్రధాని నరేంద్ర మోడీ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. బెంగాల్‌లోని నదియా లో ఏర్పాటు చేసిన ఎన్నికల ప్రచార సభలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా ఈ రోజు రికార్డు స్థాయిలో నమోదవుతున్న పోలింగ్ శాతం బీజేపీ విజయానికి సంకేతమని ఆయన ధీమా వ్యక్తం చేశారు. గతంలో ఎక్కడైతే భారీగా ఓటింగ్ జరిగిందో, అక్కడ బీజేపీ ఘన విజయం సాధించిందని ఆయన గుర్తు చేశారు. మే 4వ తేదీన (ఫలితాల రోజు) బెంగాల్ వ్యాప్తంగా బీజేపీ విజయోత్సవాలు జరుగుతాయని, ఆ రోజు మిఠాయిలతో పాటు బెంగాల్ ప్రత్యేక వంటకం 'ఝాల్ మురీ' కూడా పంచుతామని చమత్కరించారు.

**'ఝాల్ మురీ' రాజకీయం..**

ఇటీవల ప్రధాని మోడీ ఒక రోడ్డు పక్కన బండి వద్ద 'ఝాల్ మురీ' తిన్న ఫోటోలు వైరల్ అయిన సంగతి తెలిసిందే.



# పలు డిపోల వద్ద ఉద్రిక్తత

## ఆందోళన పంథా మారుస్తాం: ఈదురు వెంకన్న

- జనగామ డిపో వద్ద పోలీసుల జోక్యంతో ఉద్రిక్తత
- ధర్నాకు అనుమతి లేదంటూ టెంట్లు తొలగించారు
- పోలీసుల తీరుపై కార్మికులు ఆగ్రహం వ్యక్తం చేశారు
- ప్రభుత్వం స్పందించకపోతే ఆందోళన మరింత ఉధృతం చేస్తామని హెచ్చరిక
- నోటీసులు ఇచ్చిన 14 రోజుల తర్వాతే సమ్మె ప్రారంభించామని తెలిపారు
- ప్రభుత్వం పిలిస్తే ఎప్పుడైనా చర్చలకు సిద్ధమని చెప్పారు

02



## మీ వెనుక కేసీఆర్ ఉన్నారు..

ప్రభుత్వాన్ని కూల్చే శక్తి ఆర్టీసీ కార్మికులకు ఉంది: తలసాని శ్రీనివాస్ 03

## బీజేపీ ఫుల్ సపోర్ట్ ఆర్టీసీ కార్మికులకే

కేసీఆర్‌పై చర్యలు తీసుకునే దమ్ములేకే మాపై విమర్శలు: కిషన్ రెడ్డి 02




# తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం

## స్పెషల్ లీవ్ పిటిషన్ దాఖలుకు సిద్ధం

- యూనియన్ నేతలతో చర్చలు జరపాలని మంత్రి వర్గం నిర్ణయం
- పీఆర్సీ కావొచ్చు.. విలీనం కావొచ్చు.. ఇది అధికారుల కమిటీ చెప్పాల్సి ఉంది
- కేబినెట్ లో ఆర్టీసీ సమ్మె గురించి చర్చించాం
- తెలంగాణ రాష్ట్రం సాధించడంలో మీది పెద్ద పాత్ర..
- ఇది మీ ప్రభుత్వం.. సమస్యలు పరిష్కరిస్తాం
- కార్మికులు.. మీ కుటుంబాలకు అన్యాయం చేయొద్దు
- క్షణికావేశంతో ఫ్యామిలీలను రోడ్డున పడేయొద్దు
- కార్మికులు ఎలాంటి తొందరపాటు నిర్ణయాలు తీసుకోవద్దు
- చర్చలకు రావాలని విజ్ఞప్తి చేస్తున్నాం
- సమ్మెపై ప్రభుత్వం సానుకూల వైఖరి చూపుతోంది
- కార్మికులతో చర్చల ద్వారా పరిష్కారం లక్ష్యం
- కార్మికులు ఆందోళనలో శాంతంగా ఉండాలని సూచన
- ఎలాంటి తీవ్ర నిర్ణయాలు తీసుకోవద్దని విజ్ఞప్తి
- ప్రాణాలు తీసుకోవడం సమస్యకు పరిష్కారం కాదని హెచ్చరిక

02

### కార్మికులు ఎవరూ తొందర పడొద్దు..

**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :**

కాళేశ్వరం ప్రాజెక్టు తీర్పు నేపథ్యంలో తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఈ అంశంపై సుప్రీంకోర్టును ఆశ్రయించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. కాళేశ్వరం తీర్పును సవాలు చేస్తూ స్పెషల్ లీవ్ పిటిషన్ దాఖలు చేయాలని టీజీ సర్కార్ నిర్ణయించింది. ఇప్పటికే న్యాయ విభాగంతో చర్చలు పూర్తయ్యాయని, తదుపరి చర్యలకు సిద్ధమవుతున్నట్లు అధికార వర్గాలు తెలిపాయి. ప్రాజెక్టుకు సంబంధించిన వివిధ అంశాలపై న్యాయస్థానంలో పూర్తి వివరాలు సమర్పించాలని ప్రభుత్వం భావిస్తోంది. ఈ పరిణామం రాష్ట్ర రాజకీయాల్లోనూ, పాలనా వర్గాల్లోనూ చర్చనీయాంశంగా మారింది.కాగా, కాళేశ్వరం ప్రాజెక్టులో అవకతవకలపై విచారణ కోసం రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్‌పై దాఖలైన పిటిషన్లపై తెలంగాణ హైకోర్టు సంచలన తీర్పు వెల్లడించిన సంగతి తెలిసిందే. కమిషన్ సమర్పించిన నివేదిక ఆధారంగా బీఆర్ఎస్ అధ్యక్షుడు, మాజీ సీఎం కేసీఆర్, మాజీ మంత్రి హరీశ్ రావు, ఐఏఎస్ అధికారి స్మితా సబర్వాల్, మాజీ ఐఏఎస్ ఎస్కే జోషిపై ఎలాంటి చర్యలు తీసుకోరాదని ప్రభుత్వాన్ని ఆదేశించింది. అంతేకాకుండా, జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ విచారణలో పలు నిబంధనలు పాటించలేదని హైకోర్టు అభిప్రాయపడింది. ఈ నేపథ్యంలో కమిషన్ నివేదిక ఆధారంగా ముందస్తు చర్యలు చేపట్టరాదని స్పష్టం చేసింది.



## రణరంగంగా బెంగాల్..

- పశ్చిమ బెంగాల్ ఎన్నికల్లో హింస సాధారణంగా మారింది
- తాజా శాసనసభ ఎన్నికల మొదటి దశ పోలింగ్‌లో భారీ హింస
- ఓటర్లు ఎక్కువగా రావడంతో పాటు అనేక ప్రాంతాల్లో అశాంతి
- మాల్దాలో ఈవీఎం పనిచేయకపోవడంతో ప్రజలు ఆగ్రహం
- పోలింగ్ కేంద్రాల వద్ద తీవ్ర ఉద్రిక్తత
- ఎన్నికల అధికారిని కొంతసేపు బందీగా పెట్టిన ఘటన జరిగింది
- టీఎంసీ రెండు వర్గాల మధ్య ఘర్షణతో పార్టీ కార్యాలయం ధ్వంసం
- ముర్షిదాబాద్, కూచ్ బెహార్, సిలిగురి, మాల్దా ప్రాంతాల్లో తీవ్ర ఉద్రిక్తత

03

# ఒకే వేదికపైకి అధికార యంత్రాంగం..

## క్షేత్రస్థాయిలో సమస్యలకు చెక్ పెట్టేలా మంత్రి పొంగులేటి వ్యూహం!

- అన్ని శాఖల అధికారులు ఒకే వేదికపై అందుబాటులో ఉంటారు
- జిల్లా కలెక్టర్ నుండి స్థానిక అధికారుల వరకు పాల్గొంటారు
- ప్రతి సమస్యకు తక్షణ పరిష్కారం లక్ష్యం
- ఫిర్యాదులను పర్యవేక్షించేందుకు ప్రత్యేక వ్యవస్థ ఏర్పాటు
- ప్రజలు సమస్యల కోసం రోజులు తిరగకూడదని లక్ష్యం
- అధికారులు పూర్తి సమాచారంతో ప్రజల వద్దకు రావాలని ఆదేశాలు

03

**ప్రభుత్వం అంటే ప్రజల కోసం.. ప్రజల వద్దకే పాలన**




# వలసలపై ట్రంప్ విద్వేషం..

## భారత్ ను 'నరకం'తో పోల్చిన అమెరికా అధ్యక్షుడు

- భారతీయ-అమెరికన్ సమాజం నుంచి తీవ్ర నిరసనలు
- భారత్‌ను "నరకం"తో పోల్చడంపై నెటిజన్లు విమర్శలు
- ట్రంప్ వ్యాఖ్యలు అంతర్జాతీయంగా వివాదం రేపాయి
- వలసలు, టెక్ రంగం, పౌరసత్వ విధానంపై ఆయన అభిప్రాయాలు చర్చకు దారి తీశాయి
- భారత్, చైనా దేశాలపై ఒకే విధంగా విమర్శలు
- విదేశీయులు అమెరికాకు వచ్చి పిల్లలకు జన్మనిస్తున్నారని ఆరోపణ
- పౌరసత్వం తర్వాత కుటుంబాలను అమెరికాకు తీసుకొస్తున్నారని వ్యాఖ్య
- అమెరికాలో ఇంగ్లీష్ మాట్లాడేవారు తగ్గుతున్నారని అన్నారు
- భారతీయ టెక్ నిపుణుల ఆధిపత్యంపై అసంతృప్తి

02



## రూ. 17 కోట్ల విలువైన డ్రగ్స్ సీజ్..

**మౌలాలి,ఫ్లాష్ ఇండియా:** నార్కోటిక్స్ కంట్రోల్ బ్యూరో భారీ ఆపరేషన్ నిర్వహించింది. హైదరాబాద్ మౌలాలిలో డ్రగ్ తయారీ కేంద్రంపై సోదాలు నిర్వహించింది. రూ.17 కోట్ల విలువైన డ్రగ్స్ సీజ్ చేయడంతో పాటు ముగ్గురు నిందితులను అరెస్ట్ చేసింది. 69.600 కిలోల అల్ప్రజోలామ్‌ను స్వాధీనం చేసుకుంది. ఎఫెడ్రిన్ డ్రగ్ తయారీ ముడి పదార్థాలను కూడా స్వాధీనం చేసుకుంది. ఈ సోదాల్లో రెండు ప్లాస్టిక్ డ్రమ్ములలో భారీగా డ్రగ్ మెటీరియల్ నిల్వ చేసినట్లు అధికారులు గుర్తించారు. రెండు డ్రమ్ముల నుండి మొత్తం 69.600 కిలోల ఆల్ప్రజోలామ్‌ను గుర్తించారు. ఆల్ప్రజోలామ్‌తో పాటు, ఆల్ప్రజోలామ్ తయారీకి ఉపయోగించే ముడి పదార్థాలు, ఎఫెడ్రిన్ కోసం వాడే రసాయనాలను కూడా స్వాధీనం చేసుకున్నారు. ఒక కెమిస్ట్, మెటీరియల్ సప్లై చేసే వ్యక్తి, మెటీరియల్ తరలించే వ్యక్తిని అరెస్ట్ చేశారు. ఈ ఆల్ప్రజోలామ్‌ను వేసవిలో అధిక డిమాండ్ ఉండే తెలంగాణలోని కల్లు దుకాణాలకు విక్రయించనున్నట్లు గుర్తించారు. ఈ ముగ్గురి నిందితులపై NDPS యాక్ట్ ప్రకారం కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.అయితే.. అల్ప్రజోలామ్ వంటి మత్తు బిళ్ళలను కల్లులో కలపడం తీవ్రమైన నేరం. కల్లులో నిషా పెంచడానికి కొందరు అక్రమంగా ఈ బిళ్ళలను కలుపుతుంటారు. ఇలా కల్లును కల్తీ చేయడం ద్వారా అనేక రోగాలు వచ్చే అవకాశం ఉంది. వాస్తవానికి.. అల్ప్రజోలామ్ ఒక సెడెటివ్ డ్రగ్ (నిద్ర కోసం వాడే మందు). దీనిని ఆల్కహాల్‌తో కలిపి తీసుకున్నప్పుడు మెదడు, శ్వాస వ్యవస్థపై తీవ్ర ప్రభావం పడుతుంది. ఈ కలయిక వల్ల శ్వాస ఆగిపోవడం లేదా గుండెపోటు వచ్చే అవకాశం ఉంది. మోతాదు ఎక్కువైతే మనిషి కోమాలోకి వెళ్లవచ్చు లేదా మరణించవచ్చు.

# వలసలపై ట్రంప్ విద్వేషం..

## భారత్ ను 'నరకం'తో పోల్చిన అమెరికా అధ్యక్షుడు

**అమెరికా:** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ భారత్ పై మరోసారి విద్వేషపూరితమైన వ్యాఖ్యలు చేశారు. వలసల విధానం పై ఎక్స్ వేదికగా స్పందిస్తూ.. భారత్‌ను 'నరకం'తో పోల్చాడు. తన 'ట్రూత్ సోషల్' ఖాతాలో ప్రముఖ రేడియో హోస్ట్ మైఖేల్ సావేజ్‌కు చెందిన ఒక వివాదాస్పద వీడియోను రీ-షేర్ చేశారు. ఈ వీడియోలో భారత్, చైనా వంటి దేశాలను 'నరకం' అని సంబోధించడమే కాకుండా, భారతీయ వలసదారుల పట్ల తీవ్ర అభ్యంతరకర వ్యాఖ్యలు చేయడం ఇప్పుడు అంతర్జాతీయంగా కలకలం రేపుతోంది.అమెరికా రాజ్యాంగంలోని 14వ సవరణ ద్వారా లభించే 'బర్త్‌రైట్ సిటిజన్‌షిప్' (పుట్టుకతో వచ్చే పౌరసత్వం) గురించి ప్రస్తావిస్తూ.. విదేశీయులు గర్భవతులుగా ఉన్నప్పుడు అమెరికాకు వచ్చి పిల్లలకు జన్మనిస్తున్నారని ఆయన ఆరోపించారు. ఆ పిల్లలకు పౌరసత్వం వచ్చిన తర్వాత, వారు తమ కుటుంబం మొత్తాన్ని "చైనా, భారత్, మరేదైనా నరకం నుంచి" అమెరికాకు తీసుకొస్తున్నారని ట్రంప్ షేర్ చేసిన వీడియోలో పేర్కొన్నారు. దీనిని 'చైన్ మైగ్రేషన్' గా అభివర్ణిస్తూ ఆయన విమర్శలు గుప్పించారు.

**టెక్ రంగంలో భారతీయుల ఆధిపత్యం**

కాలిఫోర్నియాలోని సిలికాన్ వ్యాలీ టెక్ కంపెనీల్లో భారతీయులు, చైనీయులు అధికంగా ఉండటంపై కూడా ట్రంప్ అసహనం వ్యక్తం చేశారు. "ఒకప్పుడు నేను భారతీయులకు పెద్ద మద్దతుదారుడిని, కానీ ఇక్కడ ఏం జరుగుతుందో చూశాక నా కళ్లు తెరుచుకున్నాయి. టెక్ కంపెనీల్లో వైట్ అమెరికన్లకు ఉద్యోగాలు దొరకడం లేదు. అక్కడ అంతా భారతీయులు, చైనీయుల నెట్‌వర్క్ నడుస్తోంది" అని ఆరోపించారు.

**రాజ్యాంగ సవరణకు డిమాండ్..**

అమెరికాలో పుట్టినంత మాత్రాన పౌరసత్వం ఇచ్చే విధానాన్ని రద్దు చేయాలని ట్రంప్ మొదటి నుంచి వాదిస్తున్నారు. ఈ అంశంపై ప్రస్తుతం అమెరికా సుప్రీంకోర్టులో విచారణ జరుగుతోంది. ఈ నేపథ్యంలో వలసదారులు అమెరికా పట్ల విధేయత చూపడం లేదని, ఇక్కడ ఇంగ్లీష్ మాట్లాడే వారే కరువవుతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఈ వ్యాఖ్యలపై భారతీయ-అమెరికన్ సమాజం నుంచి తీవ్ర నిరసన వ్యక్తమవుతోంది. ప్రపంచంలోనే అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న భారత్‌ను నరకంతో పోల్చడం ట్రంప్ అజ్ఞానానికి నిదర్శనమని నెటిజన్లు మండిపడుతున్నారు. అమెరికా ఆర్థిక వ్యవస్థలో కీలక పాత్ర పోషిస్తున్న భారతీయ టెక్ నిపుణులను కించపరచడం రెండు దేశాల సంబంధాలపై ప్రభావం చూపే అవకాశం ఉందని విశ్లేషకులు భావిస్తున్నారు.

# తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం

**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా:** కాళేశ్వరం ప్రాజెక్టు తీర్పు నేపథ్యంలో తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఈ అంశంపై సుప్రీంకోర్టును ఆశ్రయించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. కాళేశ్వరం తీర్పును సవాలు చేస్తూ స్పెషల్ లీవ్ పిటిషన్ దాఖలు చేయాలని టీజీ సర్కార్ నిర్ణయించింది. ఇప్పటికే న్యాయ విభాగంతో చర్చలు పూర్తయ్యాయని, తదుపరి చర్యలకు సిద్ధమవుతున్నట్లు అధికార వర్గాలు తెలిపాయి. ప్రాజెక్టుకు సంబంధించిన వివిధ అంశాలపై న్యాయస్థానంలో పూర్తి వివరాలు సమర్పించాలని ప్రభుత్వం భావిస్తోంది. ఈ పరిణామం రాష్ట్ర రాజకీయాల్లోనూ, పాలనా వర్గాల్లోనూ చర్చనీయాంశంగా మారింది.కాగా, కాళేశ్వరం ప్రాజెక్టులో అవకతవకలపై విచారణ కోసం రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్‌పై దాఖలైన పిటిషన్లపై తెలంగాణ హైకోర్టు సంచలన తీర్పు వెల్లడించిన సంగతి తెలిసిందే. కమిషన్ సమర్పించిన నివేదిక ఆధారంగా బీఆర్ఎస్ అధ్యక్షుడు, మాజీ సీఎం కేసీఆర్, మాజీ మంత్రి హరీశ్ రావు, ఐఏఎస్ అధికారి స్మితా సబర్వాల్, మాజీ ఐఏఎస్ ఎస్కే జోషిపై ఎలాంటి చర్యలు తీసుకోరాదని ప్రభుత్వాన్ని ఆదేశించింది. అంతేకాకుండా, జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ విచారణలో పలు నిబంధనలు పాటించలేదని హైకోర్టు అభిప్రాయపడింది. ఈ నేపథ్యంలో కమిషన్ నివేదిక ఆధారంగా ముందస్తు చర్యలు చేపట్టరాదని స్పష్టం చేసింది.

**ఎలాంటి తొందర పాటు నిర్ణయాలు తీసుకోవద్దు**

ఆర్టీసీ కార్మికులు చేపట్టిన సమ్మె నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కీలక ప్రకటన చేశారు. వాళ కేబినెట్ భేటీలో ఆర్టీసీ సమ్మెపై చర్చ జరిగింది. ఆర్టీసీ కార్మికులు ఎలాంటి తొందర పాటు నిర్ణయాలు తీసుకోవద్దని ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. ప్రాణాలు తీసుకోవడం వల్ల సమస్య పరిష్కారం కాదని. .కార్మికుల సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం చిత్తశుద్ధితో దృష్టి పెట్టిందని సీఎం ప్రకటించారు. ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క నేతృత్వంలోని మంత్రుల బృందం రేపు ఆర్టీసీ కార్మిక సంఘాల నాయకులను చర్చలకు ఆహ్వానించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశించారు. కార్మికుల సమస్యలపై ప్రభుత్వం సానుకూలంగా ఉందని సీఎం స్పష్టం చేశారు.

**దయచేసి ప్రాణాలు తీసుకోకండి.. కార్మికుల సంక్షేమమే మాకు ముఖ్యం :మంత్రులు పొన్నం, శ్రీధర్**

ఆర్టీసీ కార్మికుల డిమాండ్లపై ప్రభుత్వం సానుకూలంగా ఉన్నట్లు సీఎం రేవంత్ రెడ్డి మంత్రివర్గ సమావేశంలో తెలిపారని.. రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ స్పష్టం చేశారు. సుదీర్ఘ కేబినెట్ సమావేశం తర్వాత ఆయన మీడియాతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆర్టీసీ కార్మికులకు కీలక విజ్ఞప్తి చేశారు. కార్మికులు తొందరపాటు నిర్ణయాలు తీసుకోవద్దని విజ్ఞప్తి చేశారు. ఆర్టీసీ కార్మికుల సమస్యల పరిష్కారానికి సంబంధించి పూర్తిగా సానుకూలంగా ఉన్నామని వివరించారు. ఉద్యోగ భద్రతపై ఎలాంటి అపోహలు వద్దని, ఒక్క ఉద్యోగిని కూడా ప్రభుత్వం తొలగించదని స్పష్టం చేశారు. కార్మికుల సంక్షేమం, ప్రయాణికుల సౌకర్యం, సంస్థ పరిరక్షణ ప్రకారమే పనిచేస్తున్నామని, కేబినెట్ లో మంత్రులంతా కార్మికులకు అనుకూలంగా చర్చించారన్నారు.ఆర్టీసీలో పనిచేసే ప్రతీ కార్మికుడికి మంత్రి శ్రీధర్ బాబు కూడా కీలక విజ్ఞప్తి చేశారు. కార్మికుల సమస్యలు, ధర్నాపై కేబినెట్ లో కీలకంగా చర్చించామని తెలిపారు. కార్మికులు సంయమనంతో ఉండాలని విజ్ఞప్తి చేశారు. సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం తప్పకుండా చర్చలు చేపడుతుందన్నారు. అంతవరకూ ఎలాంటి తొందరపాటు చర్యలకు పాల్పడవద్దని, ఎవ్వరూ ప్రాణాలు తీసుకోవద్దని కోరారు. ఇలాంటి ఆలోచనలు చేయవద్దన్నారు. కష్టపడి రాష్ట్రాన్ని సాధించుకున్నది ఇలా ఆత్మహత్యలు చేసుకునేందుకు కాదన్న విషయం గుర్తుంచుకోవాలని, క్షణికావేశంతో కుటుంబాలకు అన్యాయం చేయవద్దన్నారు. ప్రజాపాలన ప్రభుత్వంపై నమ్మకం ఉంచాలని కోరారు.

## యూరియా యాప్‌పై హైకోర్టుకు రైతులు..

**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** రాష్ట్రంలో యూరియా విక్రయాల కోసం ప్రభుత్వం తీసుకువచ్చిన 'ఫర్టిలైజర్ బుకింగ్ యాప్' పై తెలంగాణ హైకోర్టు ప్రభుత్వానికి కీలక ఆదేశాలు జారీ చేసింది. ఈ యాప్ ఏర్పాటు, విధివిధానాలపై కౌంటర్ దాఖలు చేయాలని వ్యవసాయ శాఖను ఆదేశించింది. యూరియా కోసం యాప్ తీసుకురావడాన్ని సవాల్ చేస్తూ నల్గొండ రైతులు హైకోర్టును ఆశ్రయించారు. ఈ పిటిషన్ పై ఇవాళ న్యాయస్థానం విచారణ జరిపింది. ఈ యాప్ రైతులకు ఇబ్బందికరంగా మారిందని దీనిని వ్యతిరేకిస్తూ రైతులు ధర్నా చేస్తున్నారని పిటిషనర్ల తరపు న్యాయవాది వాదించారు.

**పారదర్శకత కోసమే..**

అయితే ప్రభుత్వం తరపు న్యాయవాది వదన వినిపిస్తూ యూరియా సరఫరాలో పారదర్శకత కోసంమే ఈ యాప్ తెచ్చామని కోర్టుకు విన్నవించారు. యూరియాపై ప్రభుత్వం భారీగా సబ్సిడీ ఇస్తోందని, అర్హులైన రైతులకు మాత్రమే యూరియా చేరాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని కోర్టకు వివరించారు. షాపుల వద్ద కంటే యాప్ ద్వారానే ఎక్కువ యూరియా సరఫరా చేస్తున్నామని కోర్టుకు వివరించగా.. ప్రతి రైతుకు సాంకేతిక అవగాహన ఉండదు కదా అని ప్రభుత్వం తరపున న్యాయవాదనికి హైకోర్టు ప్రశ్నించింది. ఈ యాప్ పై కౌంటర్ దాఖలు చేయాలని ఆదేశిస్తూ తదుపరి విచారణ వాయిదా వేసింది.

# తుగ్లక్ పాలనలో తెలంగాణ?



**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** రాష్ట్రంలో తుగ్లక్ పరిపాలన నడుస్తున్నదని.. రేవంత్‌రెడ్డికి పరిపాలన చేత కాదని.. అన్ని వర్గాల వారు ప్రభుత్వంపై కోపంతో ఉన్నారని బీఆర్ఎస్ఎల్పీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ తలసాని శ్రీనివాస్ అన్నారు. గురువారం తెలంగాణ భవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. రేవంత్‌రెడ్డి అలా చేస్తుంటే తెలంగాణలో ఉండే నిజమైన కాంగ్రెస్ నాయకులకు సోయి లేదా అని ఆయన ప్రశ్నించారు. కాళేశ్వరం కేసు హైకోర్టు ఇచ్చిన తీర్పు ప్రభుత్వానికి చెంపపెట్టు లాంటిదన్నారు. మేధా పర్వతం లాంటి కేసీఆర్‌పై ఉమ్మేస్తే తిరిగి కాంగ్రెస్ నాయకులపైనే పడిందని ఎద్దేవా చేశారు. రాష్ట్ర ప్రజానీకాన్ని ఒక తాటిపైకి తెచ్చి తెలంగాణ సాధించిన గొప్ప నాయకుడు కేసీఆర్ అని తెలిపారు. రైతులు సంతోషంగా ఉండాలని ప్రపంచంలోనే అతిపెద్ద లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు కాళేశ్వరం నిర్మించారన్నారు. సుంకిశాల వాల్, పెద్ద వాగు, వట్టెం మునిగిపోయిందని.. ఎస్ఎల్‌బీసీ కుంగిపోయి 8 మంది చనిపోయారని.. దీనిపై ఎందుకు విచారణ చేయలేదని నిలదీశారు. కాళేశ్వరం ప్రాజెక్టులో ఒక బ్యారేజ్ మేడిగడ్డ, అందులో రెండు పిల్లర్లు మాత్రమే కుంగిపోయాయని తెలిపారు. 8 బీ, 8సీ ద్వారా నోటీసులు ఇవ్వకుండా కాళేశ్వరం కేసు విషయంలో విచారణ చేశారని పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టోలో ఆర్టీసీ కార్మికులను ప్రభుత్వంలో విలీనం చేస్తామని హామీ ఇచ్చిందని.. రెండేళ్లకు పైగా అవుతున్నా హామీలు ఎందుకు అమలు చేయడం లేదని ప్రశ్నించారు. ఆర్టీసీ కార్మికులకు టెంట్ సామాన్లు ఇవ్వరాదని నోటీసులు ఇవ్వడం ఎంతవరకు కరెక్ట్ అని.. దీనిపై రాష్ట్ర డీజీపీ సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. మేడిగడ్డలో రెండు పిల్లర్లు కుంగిపోతే రాహుల్ గాంధీ, రేవంత్ రెడ్డి ఇద్దరు కలిసి లక్ష కోట్ల అవినీతి అంటూ తమపై దుష్ప్రచారం చేశారని ఆరోపించారు. ఢిల్లీ వెళ్లిన రేవంత్ రెడ్డి ఎన్డీయే కూటమి నేతలతో బ్రేక్ ఫాస్ట్ చేశారని అన్నారు. కాళేశ్వరం కేసు విషయంలో హైకోర్టు తీర్పు ప్రభుత్వానికి చెంపపెట్టులాంటిదని, ఇప్పటికైనా బుద్ధి తెచ్చుకొని పరిపాలన చేయాలని సూచించారు. సమావేశంలో ఎమ్మెల్యే ముఠాగోపాల్, బీఆర్ఎస్ ఖైరతాబాద్ ఇన్‌చార్జ్ మన్నె గోవర్ధన్‌రెడ్డి, కార్పొరేషన్ మాజీ చైర్మన్ వాసుదేవరెడ్డి, బీసీ కమిషన్ మాజీ సభ్యుడు కె.కిశోర్‌గౌడ్ పాల్గొన్నారు.

## ఆర్యవైశ్యులకు గుడ్ న్యూస్..




**వనస్థలిపురం,ఫ్లాష్ ఇండియా :** ఆర్యవైశ్యులకు తెలంగాణ ప్రభుత్వం గుడ్ న్యూస్ చెప్పింది. వాసవి మాత జయంతిని అధికారిక పండుగా ప్రకటిస్తూ రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. సీఎం రేవంత్ రెడ్డి ఈ నిర్ణయం తీసుకోవడం పై ఆర్యవైశ్య సమాజం హర్షం వ్యక్తం చేస్తోంది. ప్రతి సంవత్సరం వాసవి మాత జయంతిని రాష్ట్ర వ్యాప్తంగా అధికారికంగా నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా తెలంగాణలోని ఆర్యవైశ్యుల తరపున సీఎం రేవంత్ రెడ్డికి టీపీసీసీ జనరల్ సెక్రెటరీ, ఐవీఎఫ్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు ఉప్పల శ్రీనివాస్ గుప్త కృతజ్ఞతలు తెలిపారు. ఆర్యవైశ్యుల ఆత్మగౌరవాన్ని మరింత పెంపొందించేదిగా ఉందని.. సమాజంలో ఐక్యతను పెంపొందిస్తుందని పేర్కొన్నారు.

# బెంగాల్‌లో మార్పు తథ్యం

**పశ్చిమ బెంగాల్ :** పశ్చిమ బెంగాల్ అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ సరళిపై ప్రధాని నరేంద్ర మోడీ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. బెంగాల్‌లోని నదియా లో ఏర్పాటు చేసిన ఎన్నికల ప్రచార సభలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా ఈ రోజు రికార్డు స్థాయిలో నమోదవుతున్న పోలింగ్ శాతం బీజేపీ విజయానికి సంకేతమని ఆయన ధీమా వ్యక్తం చేశారు. గతంలో ఎక్కడైతే భారీగా ఓటింగ్ జరిగిందో, అక్కడ బీజేపీ ఘన విజయం సాధించిందని ఆయన గుర్తు చేశారు. మే 4వ తేదీన (ఫలితాల రోజు) బెంగాల్ వ్యాప్తంగా బీజేపీ విజయోత్సవాలు జరుగుతాయని, ఆ రోజు మిఠాయిలతో పాటు బెంగాల్ ప్రత్యేక వంటకం 'ఝాల్ మురీ' కూడా పంచుతామని చమత్కరించారు.

**'ఝాల్ మురీ' రాజకీయం..**

ఇటీవల ప్రధాని మోడీ ఒక రోడ్డు పక్కన బండి వద్ద 'ఝాల్ మురీ' తిన్న ఫోటోలు వైరల్ అయిన సంగతి తెలిసిందే. దీనిపై ప్రధాని స్పందిస్తూ.. "ఝాల్ మురీ నేను తిన్నాను కానీ, దాని కారం (మంట) మాత్రం టీఎంసీకి తగిలింది" అంటూ చురకలు అంటించారు. ఝాల్ మురీ పేరు వింటేనే కొంతమందికి షాక్ తగులుతోందని సందర్భంగా ప్రధాని మోడీ ఎద్దేవా చేశారు.

**ఎన్నికల సంఘానికి అభినందనలు..**

గత 50 ఏళ్లలో హింస అతి తక్కువగా జరిగిన ఎన్నికలు ఇవేనని ప్రధాని ప్రశంసించారు. ఒకప్పుడు బెంగాల్‌లో ప్రతి వారం ఎవరో ఒకరిని ఉరితీసి, దానిని ఆత్మహత్యగా చిత్రీకరించే అరాచక పాలన ఉండేదని ఆరోపించారు.

బెంగాల్ గడ్డపై ప్రజాస్వామ్య గౌరవాన్ని మళ్ళీ పునరుద్ధరించినందుకు ఎన్నికల కమిషన్‌ను ఆయన అభినందించారు. ప్రభుత్వ ఉద్యోగులు కూడా నిష్పక్షపాతంగా పని చేస్తున్నారని కొనియాడారు.

బెంగాల్ ప్రజలు మార్పు కోరుకుంటున్నారని, అందుకే ఓటర్లు పాత రికార్డులను చెరిపివేస్తూ పోలింగ్ కేంద్రాలకు పోటెత్తుతున్నారని ప్రధాని మోడీ పేర్కొన్నారు.

## బీజేపీ ఫుల్ సపోర్ట్ ఆర్టీసీ కార్మికులకే



**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** రాష్ట్రంలో ఆర్టీసీ కార్మికులు చేపట్టిన సమ్మెకు బీజేపీ పూర్తి మద్దతును ఇస్తుందని కేంద్రమంత్రి కిషన్ రెడ్డి తెలిపారు. గురువారం సికింద్రాబాద్ పరిధిలోని సీతాఫల్ మండిలో పర్యటించిన ఆయన.. స్థానికంగా ఉన్న అంగన్వాడీ కేంద్రాన్ని పరిశీలించి అభివృద్ధి పనులపై సమీక్షించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ఆర్టీసీ కార్మికుల్ని ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించడంలో ఇంతవరకూ ఒక్క అడుగు కూడా పడలేదని ఆరోపించారు. ఆర్టీసీ కార్మికుల డిమాండ్లను పరిష్కరించాల్సిన బాధ్యత ప్రభుత్వంపైనే ఉందని గుర్తుచేశారు. చర్చల ద్వారా సమస్యను కొలిక్కి తెచ్చి సమ్మెను విరమింపజేయాలని ఆయన డిమాండ్ చేశారు.ఇక..స్థానికంగా జరుగుతున్న వివిధ అభివృద్ధి పనులను పరిశీలించి, వాటిని త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. రాష్ట్రవ్యాప్తంగా 5,000కు పైగా అంగన్వాడీలను 'సాక్షం అంగన్వాడీలు'గా అప్‌గ్రేడ్ చేస్తున్నామని, వీటిలో ఎల్ఈడీ స్క్రీన్లు, వాటర్ ఫిల్టర్లు వంటి ఆధునిక వసతులు కల్పిస్తున్నామని ఈ సందర్భంగా ఆయన గుర్తుచేశారు.మరోవైపు రాష్ట్రవ్యాప్తంగా రెండోరోజు ఆర్టీసీ కార్మికుల సమ్మె కొనసాగుతోంది. రాణిగంజ్ డిపోల ముందు కార్మికులు ధర్నా చేపట్టగా.. BRTU, BRSV నాయకులు పాల్గొని వారికి మద్దతు తెలిపారు. డిపోల నుంచి వెళ్తున్న ప్రైవేటు బస్సుల్ని అడ్డుకున్నారు.

# బీఆర్ఎస్ నాయకులు చెప్పేవన్నీ అబద్ధాలే



**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** కాళేశ్వరం అంశంలో హైకోర్టు తీర్పుపై మాజీ మంత్రులు కేటీఆర్, హరీశ్ రావు ఎందుకు సంబరాలు చేసుకుంటున్నారని ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి ప్రశ్నించారు. త్వరలోనే సంబరాల రాంబాబులను లోపలేస్తామని హెచ్చరించారు. గురువారం మీడియాతో మాట్లాడుతూ... తన సొంత బ్రాండ్ కోసమే కేసీఆర్ కాళేశ్వరం కట్టారని.. తెలంగాణ సొమ్మును నాశనం చేశారని ఆరోపించారు. బ్రాండ్ కోసమే కేసీఆర్ తట్టెడు అబద్ధాలు, పిట్ట కథలు చెప్పారని మండిపడ్డారు. రెండు సంవత్సరాలకే కాళేశ్వరం ఎందుకు కుంగిపోయిందని ఎంపీ ప్రశ్నించారు.'24 గంటల్లో సినిమా చూపిస్తామన్న బీజేపీ ఎక్కడికి పోయింది? సీబీఐ విచారణ ఎందుకు ఆలస్యం అవుతోంది? బీజేపీ నాయకులు వెంటనే సీబీఐతో విచారణ చేయించండి' అని డిమాండ్ చేశారు. మానిపోయిన గాయానికి మళ్లీ మందు పెట్టేందుకు కేసీఆర్ బయటకు వచ్చారని వ్యాఖ్యానించారు. కేటీఆర్, హరీశ్.. ప్రజలను పక్కదోవ పట్టిస్తున్నారని విమర్శించారు. హైకోర్టు తీర్పుపై బీఆర్ఎస్ నాయకులు అబద్ధాలు చెబుతున్నారన్నారు. కాళేశ్వరం కేసులో హైకోర్టు ఎవరికీ క్లీన్ చిట్ ఇవ్వలేదని ఎంపీ తెలిపారు. కాళేశ్వరంలో దోపిడీ చేసిన వాళ్లను వదిలిపెట్టేది లేదని హెచ్చరించారు. సెంటిమెంట్ డైలాగులతో ప్రజలను మళ్లీ మోసం చేస్తున్నారని అన్నారు.కాళేశ్వరం ప్రాజెక్ట్‌లో మేడిగడ్డ గుండెకాయ అన్నారని.. మేడిగడ్డ కుంగిపోయాక కాళేశ్వరం కూలిపోయినట్టే కదా అని ఎంపీ అడిగారు. మేడిగడ్డలో నీళ్లు నింపితే ప్రమాదమని ఎన్‌డీఎస్ఏ చెప్పిందన్నారు. బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడే కాళేశ్వరం కూలిపోయిందన్నారు. నాణ్యత పాటించకుండా ప్రాజెక్ట్ కట్టి.. కూలిపోగానే కాంగ్రెస్‌పై కేసులు పెట్టారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కమిషన్ ఏర్పాటును కోర్టు తప్పు పట్టలేదని తెలిపారు. ముందస్తు నోటీసులు ఇవ్వకుండా విచారణకు రమ్మన్న అంశంపై మాత్రమే కోర్టు అభ్యంతరం తెలిపిందన్నారు. కాళేశ్వరం ప్రాజెక్ట్‌కు అప్పు పుట్టకపోతే కార్పొరేషన్ ఏర్పాటు చేసి అప్పు తెచ్చారని చామల కిరణ్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు.

## విగ్రహ ప్రతిష్ట మహోత్సవంలో పాల్గొన్న మంత్రి

**కూసుమంచి,ఫ్లాష్ ఇండియా :** మండలంలోని లింగారం తండా గ్రామంలో నూతనంగా నిర్మించిన శ్రీ అభయ ఆంజనేయ స్వామి, ధ్వజస్తంభం, నవగ్రహాలు, జంట నాగులు, నాభిశీల, స్థిర విగ్రహం యంత్ర ప్రతిష్ట మహోత్సవ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన ప్రత్యేక పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఎదులాపురం మున్సిపల్ చైర్ పర్సన్ పోకబత్తిని.అనిత సర్పంచ్ బానోత్.పుష్ప, 



మరియు స్థానిక నాయకులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ఫ్లాష్ ఇండియా దినపత్రిక బుక్ చేసుకోవాలి అనుకుంటున్నారా లేదా మీ వ్యాపార ప్రకటనల కోసం మమ్మల్ని సంప్రదించండి 7730032999 flashindiadaily@gmail.com

# మీ వెనుక కేసీఆర్ ఉన్నారు..



**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** మీరు ధైర్యంగా పోరాటం చేయండి.. మీ వెనుక కేసీఆర్ ఉన్నారని ఆర్టీసీ కార్మికులకు మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. రెండో రోజు ఆర్టీసీ సమ్మెలో భాగంగా మహాధర్న కార్యక్రమానికి సంఘీభావం తెలిపిన ఆయన రాణిగంజ్ డిపో వద్ద మాట్లాడారు. ఆ నాడు కేసీఆర్ సకల జనులను ఏకం చేశారు. అందులో ఆర్టీసీ కార్మికులు ప్రధాన పాత్ర పోషించారని గుర్తు చేశారు. తెలంగాణ సాధనలో ఆర్టీసీ కార్మికుల కృషి మర్చిపోలేనిదన్నారు. ఆ విషయం ప్రభుత్వం గుర్తుపెట్టుకోవాలని సూచించారు. అవసరమైతే ప్రభుత్వాన్ని కూల్చి శక్తి ఆర్టీసీ కార్మికులకు ఉందన్నారు. గతంలో కేసీఆర్ కేబినెట్ ఆర్టీసీ కార్మికులను ప్రభుత్వ ఉద్యోగులుగా తీసుకోవాలని నిర్ణయం తీసుకుందన్నారు. అంతలోనే ప్రభుత్వం మారిందన్నారు. ఆర్టీసీకి ఎంతో ప్రాముఖ్యత ఉందని గుర్తు చేశారు. రెండు రోజులుగా ఆర్టీసీ సమ్మె చేస్తుంటే.. ప్రజలు అల్లాడి పోతున్నారని గుర్తు చేశారు. ప్రతిపక్ష నేతలు వెనుకుండి సమ్మె చేయిస్తున్నారని ఓ మంత్రి అంటున్నారు. అసలు మీరు ఇచ్చిన హామీలు తీరస్తే.. సమ్మె ఎందుకు చేస్తారని ప్రశ్నించారు. సమ్మె చేసే ఉద్యోగులను ఆర్టీసీ ఎండీ బెదిరిస్తున్నారని.. ముందు నీ ఉద్యోగం ఉంటుందో లేదో చూసుకోవాలని ఘాటు వ్యాఖ్యలు చేశారు. వచ్చేది మా ప్రభుత్వమే అని ధీమా వ్యక్తం చేశారు.“అందరం కలిసి సెక్రటేరియట్ ముట్టడికి వెళ్దాం. ప్రభుత్వం మెడలు వంచి హామీలు సాదిద్ధం. పీఆర్సీ ఇస్తామని చెప్పి అధికారంలోకి వచ్చారు. ఎలక్ట్రికల్ బస్సులకు ప్రైవేట్ డ్రైవర్లను పెట్టి నడిపిస్తున్నారు. ఆర్టీసీ బస్సు నడిపిన డ్రైవర్లకు ఎలక్ట్రికల్ బస్సు నడపడం రాదా? ఆర్టీసీ కార్మికులకు కూడా విజ్ఞప్తి చేస్తున్నాను. మీరు ధైర్యంగా పోరాటం చేయండి. మీ వెనుక కేసీఆర్ ఉన్నారు. మీ వెనుక మా పార్టీ మొత్తం ఉంది. 29 డిమాండ్స్ తీర్చేందుకు సిద్ధంగా ఉన్నామని అంటున్నారు. మరి ఆ 29 డిమాండ్స్ ఏంటో మీడియా సాక్షిగా విడుదల చేయాలి. మీ కాబినెట్ తరువాత వెంటనే ఆర్టీసీ జేఏసీని చర్చలకు పిలవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్న. హామీల విషయంలో పూర్తి స్పష్టత ఇవ్వాలి. తూతు మంత్రంగా ఒప్పుకోవద్దని జేఏసీ సంఘాల నాయకులకు కూడా విజ్ఞప్తి చేస్తున్నా. మీరు కొట్లాడితే.. మీతో పాటు ముందు వరసలో మేము ఉంటాము..” మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ వ్యాఖ్యానించారు.

# అరవింద్ కేజ్రీవాల్‌కు ఢిల్లీ హైకోర్టు షాక్..



**ఢిల్లీ :** ఆమ్ ఆద్మీ పార్టీ అధినేత, ఢిల్లీ మాజీ సీఎం అరవింద్ కేజ్రీవాల్ మరోసారి చిక్కుల్లో పడ్డారు. కోర్టు విచారణకు సంబంధించిన వీడియోను సోషల్ మీడియాలో షేర్ చేసినందుకు గాను ఢిల్లీ హైకోర్టు ఆయనకు నోటీసులు జారీ చేసింది. ఆయనపై కోర్టు ధిక్కరణ చర్యలు ఎందుకు చేపట్టకూడదో వివరణ ఇవ్వాలని ధర్మాసనం ఆదేశించింది. వివరాల్లోకి వెళితే.. జస్టిస్ ఎస్కే శర్మ నేతృత్వంలోని ధర్మాసనం ఎదుట ఓ న్యాయవాది వాదనలు వినిపిస్తున్న వీడియోను కేజ్రీవాల్ తన సోషల్ మీడియా ఖాతాలో పోస్ట్ చేశారు. సాధారణంగా న్యాయస్థానంలో విచారణల వీడియోలను అనుమతి లేకుండా బహిరంగంగా పంచుకోవడం కోర్టు నిబంధనల ఉల్లంఘన కిందకు వస్తుంది. దీనిని తీవ్రంగా పరిగణించిన హైకోర్టు, కేజ్రీవాల్ తీరుపై ఆగ్రహం వ్యక్తం చేసింది. ఈ ఉదంతంపై విచారణ చేపట్టిన ధర్మాసనం కీలక వ్యాఖ్యలు చేసింది. వివాదాస్పద వీడియోను సోషల్ మీడియా ప్లాట్‌ఫారమ్‌ల నుంచి తక్షణమే తొలగించాలని కేజ్రీవాల్‌ను ఆదేశించింది. కోర్టు గౌరవానికి భంగం కలిగించేలా వ్యవహరించినందుకు గాను, కోర్టు ధిక్కరణ చర్యలు ఎందుకు తీసుకోకూడదో స్పష్టం చేస్తూ నోటీసులకు సమాధానం ఇవ్వాలని పేర్కొంది.

**రాజకీయ వర్గాల్లో చర్చ..**

కేజ్రీవాల్ ఇప్పటికే పలు కేసుల్లో ఇప్పటికే న్యాయపోరాటం చేస్తుండగా, ఇప్పుడు నేరుగా హైకోర్టు నుంచే ధిక్కరణ నోటీసులు రావడం రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశమైంది. కోర్టు నిబంధనల పట్ల అవగాహన ఉన్న ఓ మాజీ ముఖ్యమంత్రి ఇలాంటి పోస్ట్ చేయడంపై న్యాయ నిపుణులు సైతం ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు.

# ప్రభుత్వానికి రైతాంగ సంక్షేమ ఆలోచన లేదు..

**రాజన్న సిరిసిల్ల,ఫ్లాష్ ఇండియా :** కుట్రపూరితంగా అపోహలు సృష్టించి తయారుచేసిన పీసీ ఘోష్ నివేదికకు వ్యతిరేకంగా రాష్ట్ర హైకోర్టు ఇచ్చిన తీర్పు రేవంత్ సర్కారుకు చెంపపెట్టని బిఆర్ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జీవన్ రెడ్డి అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని తెలంగాణ భవన్ లో ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో ఆయన హాట్ కామెంట్స్ చేశారు. మహారాష్ట్ర ప్రభుత్వంతో విస్తృత చర్చలు నిర్వహించిన తరువాతే కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణం జరిగిందని, అందులో భాగంగానే గోదావరి జలాలను కూడా వాడుకునేందుకు మేడిగడ్డ వద్ద బ్యారేజీని గత ప్రభుత్వం నిర్మించినట్లు తెలిపారు. కాళేశ్వరం ప్రాజెక్ట్ అంటే కేవలం మేడిగడ్డ కాదని, అందులో వంద కాంపోనెంట్స్ ఉన్నాయని, ప్రపంచస్థాయి పబ్లిక్ లిమిటెడ్ కంపెనీ ఎల్ అండ్ టి మేడిగడ్డ బ్యారేజీని నిర్మించిందని గుర్తు చేశారు. అధికారంలోకి వచ్చి మూడేళ్లు గడుస్తున్నా తుమ్మిడి హెట్టి బ్యారేజీని పెంచకపోవడం రేవంత్ ప్రభుత్వం వైఫల్యం తో పాటు అసమర్థత స్పష్టం చేశారు. కేసీఆర్ ను దోషిగా చూపించాలనే కుట్ర తప్పితే, ప్రభుత్వానికి రైతాంగ సంక్షేమ ఆలోచన లేదని, రేవంతు కళ్ళు మూసుకుంటే కేసీఆరే కళ్ళల్లోకి వస్తాడని ఎద్దేవా చేశారు. ప్రతిపక్షాలు ఎంత బలంగా ఉంటే పాలకపక్షం అంత సమర్థవంతంగా పనిచేస్తుందని, ఇప్పటికైనా రేవంత్ కళ్ళు తెరిచి మేడిగడ్డ బ్యారేజీని ఉపయోగంలోకి తీసుకురావాలన్నారు. ప్రభుత్వం హైడ్రా పేరుతో ధనవంతుల ఆక్రమణలు వదిలి, పేద వారి ఇండ్లు కూలుస్తున్నారని విమర్శించారు. రాష్ట్రంలోనే సిరిసిల్లాను అగ్రగామిగా నిలబెట్టేందుకు కేటీఆర్ కృషి చేశారని, భవిష్యత్తు తెలంగాణ కేసీఆర్ చేతుల్లోనే ఉందన్నారు. సమావేశంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య, రాష్ట్ర నాయకులు కొండూరు రవీందర్రావు, గూడూరి ప్రవీణ్, జిల్లా మాజీ జడ్పీ చైర్పర్సన్ అరుణ, మున్సిపల్ చైర్ పర్సన్ జిందం కళా చక్రపాణితో పాటు పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



మేడిగడ్డను ఇకనైనా వినియోగంలోకి తేవాలి: బీఆర్ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జీవన్ రెడ్డి

తెలంగాణ రాష్ట్ర భవిష్యత్తు, అభివృద్ధి కేవలం కేసీఆర్ చేతుల్లోనే ఉందని బీఆర్ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి.జీవన్ రెడ్డి అన్నారు. ఇవాళ ఆయన జగిత్యాలలో మీడియాతో మాట్లాడుతూ.. ప్రస్తుత రేవంత్ రెడ్డి ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాల వల్ల రాష్ట్రంలో బలహీన వర్గాలు విద్యకు దూరమవుతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఇక కాళేశ్వరం ప్రాజెక్టు విషయంలో తెలంగాణ హైకోర్టు ఇచ్చిన తీర్పు రేవంత్ రెడ్డి ప్రభుత్వానికి చెంపపెట్టు అని కామెంట్ చేశారు. ఇప్పటికైనా రాజకీయ కక్షలు పక్కన పెట్టి, ప్రజల ప్రయోజనాల దృష్ట్యా మేడిగడ్డను వెంటనే వినియోగంలోకి తీసుకురావాలని జీవన్ రెడ్డి డిమాండ్ చేశారు.రేవంత్ రెడ్డి కళ్లు మూసుకున్నా ఆయన కలలో కేసీఆర్ వస్తున్నారని.. ఆ భయంతోనే అభివృద్ధిని విస్మరిస్తున్నారని జీవన్ రెడ్డి సెటైర్లు వేశారు. అదేవిధంగా సిరిసిల్ల నియోజకవర్గాన్ని రాష్ట్రంలోనే అగ్రగామిగా నిలిపేందుకు మాజీ మంత్రి కేటీఆర్ ఎంతో కృషి చేశారని ఆయన కొనియాడారు. విద్య, వైద్యం, మౌలిక సదుపాయాల కల్పనలో కేటీఆర్ చేసిన పోరాటాన్ని రాష్ట్ర ప్రజలెవరూ విస్మరించలేదని పేర్కొన్నారు. ఆయన నాయకత్వంలోనే మళ్లీ తెలంగాణ ఉజ్వల భవిష్యత్తు వైపు అడుగులు వేస్తుందని ధీమా జీవన్ రెడ్డి అన్నారు.

# ఆర్టీసీ సమ్మె వేళ జగ్గారెడ్డి సంచలన పోస్ట్



**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** ఏదైనా ముక్కుసూటిగా చెప్పే తత్వం ఉన్న తెలంగాణ కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి మరోసారి ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ఓ మాట.. అధికారంలోకి వచ్చాక మరో మాట ఉండకూడదన్నారు. కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ ఎవరైనా, అది రాష్ట్రమైనా కేంద్రంలో అయిన.. అపోజిషన్‌లో ఉన్నప్పుడు ఒక మాట, అధికారంలో ఉన్నప్పుడు మరో మాట ఎవరు మాట్లాడినా తప్పేనన్నారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ప్రశ్నించడం, డిమాండ్ చేయడం ప్రతిపక్షం నుండి తిరిగి అధికారంలోకి వచ్చినప్పుడు వాటిని విస్మరించకూడదని ఇది ఏ పార్టీ చేసినా తప్పేనన్నారు. ఈ మేరకు ఇవాళ సోషల్ మీడియా వేదికగా ఓ ప్రకటన విడుదల చేశారు.

**ఎవరిని ఉద్దేశించి..**

జగ్గారెడ్డి చేసిన ఈ వ్యాఖ్యలు ఇప్పుడు తెలంగాణ రాజకీయాల్లో ఆసక్తిగా మారాయి. ఇంతకు జగ్గారెడ్డి ఎవరిని ఉద్దేశించి ఈ మాటలు అన్నారనే చర్చ జరుగుతోంది. అయితే ప్రస్తుతం రాష్ట్రంలో ఆర్టీసీ సమ్మె కొనసాగుతోంది. ప్రతిపక్షంలో ఉండగా తాము అధికారంలోకి వస్తే ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేస్తామని కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టోలో హామీ ఇచ్చింది. ఈ నేపథ్యంలోనే జగ్గారెడ్డి వ్యాఖ్యలు ఆర్టీసీ సమ్మెను ఉద్దేశించే అనే చర్చ జరుగుతోంది. నిజానికి జగ్గారెడ్డి ఉద్దేశం, టార్గెట్ ఎవరో తెలియనప్పటికీ ఆర్టీసీ సమ్మె సమయంలో ఈ మాట చెప్ప దమ్ము జగ్గారెడ్డికి మాత్రమే సొంతం నెటిజన్లు కామెంట్స్ చేస్తున్నారు.

# రాహుల్ గాంధీతో పీసీసీ చీఫ్



**ఢిల్లీ :** ఏఐసీసీ అగ్రనేత, లోక్ సభలోప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీతో టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ భేటీ అయ్యారు. ఇవాళ ఢిల్లీలోని 10 జన్‌పథ్‌లో జరిగిన ఈ మీటింగ్‌లో రాష్ట్రంలోని తాజా పరిణామాలు, అభివృద్ధి, సంక్షేమ పథకాలపై రాహుల్ గాంధీకి మహేశ్ కుమార్ గౌడ్ వివరించారు. దాదాపు 15 నిమిషాల పాటు జరిగిన సమావేశంలో తాజా రాజకీయ అంశాలపై ఇరువురు నేతలు చర్చించారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో పార్టీ పరంగా జరుగుతున్న ఆర్గనైజేషన్ కార్యక్రమాలను రాహుల్ కు వివరించారు. డీసీసీ అధ్యక్షుల నియామకాలు, జిల్లా కమిటీలు, మండల కమిటీలు, బిఎల్‌లోల నియామకాలు, అనుబంధ సంఘాల నియామకాలు తదితర అంశాలపై సమావేశంలో రాహుల్ గాంధీకి వివరించారు.

**హైదరాబాద్‌లో నిర్వహించండి:**

ఇచ్చిన మాట ప్రకారం రాష్ట్రంలో సమగ్ర కులగణన జరిపి అధికారిక సమాచారాన్ని ప్రకటించినట్టుగా రాహుల్ గాంధీకి మహేశ్ కుమార్ గౌడ్ వివరించారు. మహిళ రిజర్వేషన్ల బిల్లులో బీసి రిజర్వేషన్ల అంశాన్ని కూడా జోడించాలని ఈ సందర్భంగ రాహుల్‌కు విజ్ఞప్తి చేశారు. రాబోయే ఏఐసీసీ జాతీయ ఓబీసీ సలహా మండలి సమావేశాన్ని హైదరాబాద్‌లో నిర్వహించాలని కోరగా ఇందుకు రాహుల్ సానుకూలంగా స్పందించారు. అంతకు ముందు మాజీ రాజ్యసభ సభ్యులు వి. హనుమంతరావు, రాజ్యసభ ఎంపీ అనిల్ యాదవ్ కూడా రాహుల్ గాంధీ గాంధీ గారితో సమావేశం అయ్యారు..

# రణరంగంగా బెంగాల్..

**వెస్ట్ బెంగాల్ :** వెస్ట్ బెంగాల్ ఎన్నికల్లో హింస కామన్‌గా మారిపోయింది. తాజాగా జరుగుతున్న శాసనసభ ఎన్నికల్లో మరోసారి హింస చెలరేగింది. మొదటి దశ పోలింగ్ ఒక్కసారిగా హింసాత్మకంగా మారింది. ఓటర్లు భారీ సంఖ్యలో పోలింగ్ బూత్‌లకు తరలివస్తుండగా, రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో తీవ్రమైన దహనకాండ, హింస, విధ్వంస ఘటనలు చోటుచేసుకుంటున్నాయి. ముర్షిదాబాద్ , కూచ్ బెహార్, సిలిగురి మరియుమాల్దాలో తీవ్ర అశాంతి నెలకొంది. ముర్షిదాబాద్‌లో అల్లరిమూకలు కర్రలు, ఇటుకలతో హుమాయున్ కబీర్ కారుపై దాడి చేశాయి. ముర్షిదాబాద్‌లోని నవోడాలో ఏజేయూపీ అధినేత, రెజినగర్ అభ్యర్థి హుమాయున్ కబీర్ కాన్వాయ్‌పై దుండగులు ఇటుకలు, కర్రలతో దాడి చేశారు. ఈ ఘటనతో అక్కడ ఒక్కసారిగా భయాందోళనలు చెలరేగాయి. టీఎంసీ, ఏజేయూపీ కార్యకర్తల మధ్య రక్తపాత ఘర్షణ జరిగింది. కబీర్ పోలీసు అధికారులతోనూ స్థానికులు తీవ్ర వాగ్వాదానికి దిగారు. ఈ దాడిపై ఉన్నత స్థాయి విచారణ జరపాలని అభ్యర్థి కబీర్ డిమాండ్ చేశారు.మరోవైపు.. ఓటింగ్ జరుగుతున్న సమయంలో కూచ్ బెహార్‌లోని తుఫాన్‌గంజ్ ప్రాంతంలో పెద్ద సంఖ్యలో జనం గుమిగూడారు. అక్కడ సైతం పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. పరిస్థితి అదుపు తప్పుతుండటంతో భారీగా మోహరించిన కేంద్ర సాయుధ పోలీసు దళం సిబ్బంది రంగంలోకి దిగారు. భద్రతా బలగాలు లాఠీఛార్జ్ చేసి గుంపును చెదరగొట్టి పరిస్థితిని అదుపులోకి తెచ్చాయి. కొందరు సంఘ విద్రోహ శక్తులు ఓటర్లను భయపెట్టేందుకు ప్రయత్నించడంతో సిబ్బంది బలప్రయోగం చేయాల్సి వచ్చిందని ఆరోపణలు ఉన్నాయి. ఇక, దక్షిణ దినాజ్‌పూర్‌లోని కుమార్‌గంజ్ అసెంబ్లీ నియోజకవర్గంలో ఓ కలవరపరిచే సంఘటన వెలుగులోకి వచ్చింది. బీజేపీ అభ్యర్థి సువేందు సర్కార్‌పై తృణమూల్ కాంగ్రెస్ (టీఎంసీ) మద్దతుదారులు దాడి చేశారు. ఓ బూత్ వద్ద బూత్ జామింగ్ జరుగుతోందని బీజేపీ సర్కార్‌కు తెలిపినట్లు సమాచారం. ఆయన తన బృందంతో అక్కడికి చేరుకోగా.. ముందుగానే సిద్ధంగా ఉన్న టీఎంసీ కార్యకర్తలు కర్రలతో దాడి చేశారు. పిడిగుద్దులతో అభ్యర్థిపై దాడికి తెగబడ్డారు. పోలీసుల సమక్షంలోనే టీఎంసీ గూండాలు తనను కొట్టారని సర్కార్ ఆరోపించారు.మాల్దాలోని మోతాబరి అసెంబ్లీ నియోజకవర్గంలోనూ

ఘర్షణలు చోటు చేసుకున్నాయి. బలుచారా హైస్కూల్ పోలింగ్ కేంద్రంలో ఓ ఈవీఎం పనిచేయకపోవడంతో స్థానికులు తీవ్ర ఆగ్రహానికి గురయ్యారు. ఎన్నికల సంఘం అధికారి రాకలో జాప్యం జరగడంతో ఆగ్రహించిన ఓటర్లు, ఆ అధికారిని చుట్టుముట్టి బందీగా పట్టుకున్నారు. పలువురు ఓటర్లు ఆ అధికారి చేయి పట్టుకుని లాగుతూ, పెనుగులాడుతున్న దృశ్యాలు కనిపించాయి. ఇక.. మాల్దా జిల్లాలోని హరిశ్చంద్రపూర్ అసెంబ్లీ నియోజకవర్గంలో తృణమూల్ కాంగ్రెస్ రెండు వర్గాల మధ్య ఘర్షణ జరగడంతో గందరగోళం చెలరేగింది. ఈ వివాదం ముదిరి, మాజీ రాష్ట్ర మంత్రి తాజ్‌మల్ హుస్సేన్ స్వగ్రామమైన బాంగ్రువాలోని (బూత్ నెం. 200, 201) టీఎంసీ ఎన్నికల శిబిర కార్యాలయాన్ని ధ్వంసం చేసే స్థాయికి చేరింది.సిలిగురి నియోజకవర్గ బీజేపీ అభ్యర్థి శంకర్ ఘోష్, టీఎంసీ మద్దతుదారుల మధ్య జరిగిన వాగ్వాదం పెద్ద ఘర్షణకు దారితీసింది. ఈ పోలింగ్ కేంద్రం వెలుపల ఇరు పార్టీల కార్యకర్తలు ఒకరిపై ఒకరు ఆరోపణలు చేసుకుంటూ గొడవకు దిగడంతో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. పోలీసులు, కేంద్ర బలగాలు వెంటనే జోక్యం చేసుకుని పరిస్థితిని అదుపులోకి తెచ్చే ప్రయత్నం చేశాయి. పశ్చిమ బెంగాల్‌లో కేవలం సిలిగురిలోనే కాకుండా ముర్షిదాబాద్, మాల్దా వంటి ప్రాంతాల్లో కూడా చెదురుమదురు హింసాత్మక ఘటనలు నమోదయ్యాయి.

ముర్షిదాబాద్‌లో క్రూడ్ బాంబు దాడులు జరిగినట్లు సమాచారం అందగా, కుమార్‌గంజ్ బీజేపీ అభ్యర్థి సువేందు సర్కార్‌పై టీఎంసీ మద్దతుదారులు దాడి చేశారని బీజేపీ ఆరోపించింది. తొలి విడత పోలింగ్ జరుగుతున్న ఈ సమయంలో ఇరు పార్టీల మధ్య నెలకొన్న రాజకీయ వైరం పోలింగ్ కేంద్రాల వద్ద ఉద్రిక్తతలకు కారణమవుతోంది.

# ఒకే వేదికపైకి అధికార యంత్రాంగం..



**ఖమ్మం,ఫ్లాష్ ఇండియా :** “ప్రభుత్వం అంటే ప్రజల కోసం.. ప్రజల వద్దకే పాలన” అనే ఇందిరమ్మ రాజ్యం ఆశయాన్ని నిజం చేస్తూ పాలేరు నియోజకవర్గంలో సరికొత్త ప్రజా పాలన శకానికి తెలంగాణ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి శ్రీకారం చుట్టారు. సామాన్యులు తమ చిన్న చిన్న సమస్యల కోసం ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ కాళ్లు అరిగేలా తిరిగే పని లేకుండా, అధికారులందరినీ ప్రజల ముంగిట నిలబెట్టేలా క్షేత్రస్థాయిలో ‘ప్రజా దర్బార్’ కార్యక్రమాన్ని రూపొందించారు.

**అధికారులంతా ఒకే చోట..**

ఈ ప్రజా దర్బార్‌లో జిల్లా కలెక్టర్ మొదలుకొని నియోజకవర్గంలోని అన్ని శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు ఒకే వేదికపైకి రానున్నారు. రెవెన్యూ, భూ సమస్యలు, ఇందిరమ్మ ఇళ్ల విజ్ఞప్తులు, కొత్త రేషన్ కార్డులు, స్థానిక మౌలిక సదుపాయాల వరకు.. ఏ రకమైన సమస్యకైనా తక్షణ పరిష్కారమే ధ్యేయంగా మంత్రి ఈ వేదికను తీర్చిదిద్దారు. ప్రతి ఫిర్యాదును స్వయంగా పర్యవేక్షించేలా ఒక ప్రత్యేక వ్యవస్థను ఏర్పాటు చేయడం విశేషం.

**రాయిగూడెం, సుబ్లేడుల్లో తొలి అడుగు**

ఈ నెల 25వ తేదీ శనివారం రెండు ప్రధాన కేంద్రాల్లో ఈ కార్యక్రమం నిర్వహించనున్నారు. నేలకొండపల్లి మండలం రాయిగూడెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉదయం 8:00 గంటల నుండి మధ్యాహ్నం 12:00 గంటల వరకు తొలి దర్బార్ జరుగుతుంది. ఈ కేంద్రానికి రాయిగూడెం, అజయ్‌తండా, చెరవుమాదారం, మంగాపురం తండా, అప్పలనరసింహపురం, బుద్ధారం, కట్టుకాచారం, కొంగర, రాజారాంపేట, భైరవునిపల్లి గ్రామ పంచాయతీల ప్రజలు తమ సమస్యలతో హాజరుకావచ్చు.మధ్యాహ్నం 3:30 నుండి తిరుమలాయపాలెం మండలం సుబ్లేడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్నం 3:30 గంటల నుంచి రాత్రి 7:30 వరకు రెండో వేదిక సిద్ధమైంది. ఈ కేంద్రానికి సుబ్లేడు, లక్ష్మీదేవిపల్లి తండా, రఘునాథపాలెం, హస్నాబాద్, ఇస్లావత్ తండా, మహమ్మదాపురం, మేకల తండా, మేడిదపల్లి, చంద్రు తండా, జోగులపాడు, పాతర్లపాడు, గోల్ తండా, జల్లెపల్లి గ్రామ పంచాయతీల ప్రజలు తరలిరానున్నారు. “తన నియోజకవర్గంలో ఏ ఒక్క పౌరుడు సమస్యల పరిష్కారం కోసం కార్యాలయాల చుట్టూ రోజుల తరబడి తిరగకూడదనే ఆకాంక్షతోనే ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టాను” అని మంత్రి పొంగులేటి పేర్కొన్నారు. అధికారులందరూ పూర్తి సమాచారంతో క్షేత్రస్థాయికి రావాలని ఆయన ఇప్పటికే ఆదేశాలు జారీ చేశారు.

# రికార్డుస్థాయిలో పోలింగ్

**ఢిల్లీ :** తమిళనాడు, పశ్చిమ బెంగాల్ రాష్ట్రాల్లో గురువారం (ఏప్రిల్ 23, 2026) జరిగిన అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ భారీ స్థాయిలో నమోదైంది. తమిళనాడులో మొత్తం 234 నియోజకవర్గాలకు ఒకే విడతలో పోలింగ్ జరగ్గా, బెంగాల్‌లో సగానికి పైగా స్థానాలకు నేడు పోలింగ్ నిర్వహించారు. సాయంత్రం 5 గంటల సమయానికి తమిళనాడులో 82.24 శాతం, బెంగాల్‌లో 3.6 కోట్ల మంది ఓటర్లకు గాను ఏకంగా 90 శాతం పోలింగ్ నమోదై రికార్డు సృష్టించింది.గురువారం పశ్చిమ బెంగాల్ లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల తొలి విడత పోలింగ్ ఉత్కంఠ భరితంగా సాగింది. అధికార తృణమూల్ కాంగ్రెస్ , బీజేపీ కార్యకర్తల మధ్య పలు చోట్ల చెదురుమొదురు ఘర్షణలు చోటుచేసుకున్నప్పటికీ, ఓటర్లు భారీగా తరలివచ్చారు. ముర్షిదాబాద్‌లో హుమాయున్ కబీర్‌కు చెందిన ఏజేయూపీ , తృణమూల్ మద్దతుదారుల మధ్య ఘర్షణలు జరగ్గా, దక్షిణ దినాజ్‌పూర్ జిల్లాలో ఒక బీజేపీ అభ్యర్థిపై దాడి జరిగినట్లు ఆరోపణలు వచ్చాయి.మరోవైపు, తమిళనాడులో మొత్తం 234 నియోజకవర్గాలకు ఒకే విడతలో ప్రశాంతంగా పోలింగ్ సాగింది. అధికార డీఎంకే , ఏఐఏడీఎంకే-బీజేపీ కూటమి, నటుడు విజయ్ నేతృత్వంలోని టీవీకే పార్టీల మధ్య ముక్కోణపు పోటీ నెలకొంది. బెంగాల్‌లో టీఎంసీ, బీజేపీ మధ్యే ప్రధాన పోరు ఉండగా, నామినేషన్ల సమయంలో లక్షలాది మంది ఓటర్ల పేర్ల తొలగింపు అంశంపై మమతా బెనర్జీ నేతృత్వంలోని టీఎంసీ.. కేంద్ర ప్రభుత్వంపై, ఎన్నికల కమిషన్‌పై తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించింది.


**జంగిల్ రాజ్ పాలనకు అంతం..**

ముర్షిదాబాద్‌లో హుమాయున్ కబీర్ కాన్వాయ్‌ను టీఎంసీ మద్దతుదారులు అడ్డుకోవడంతో ఉద్రిక్తత నెలకొంది. పరిస్థితిని అదుపు చేసేందుకు పోలీసులు లాఠీచార్జ్ చేయాల్సి వచ్చింది. అలాగే కుమార్‌గంజ్ బీజేపీ అభ్యర్థి సువేందు సర్కార్‌పై టీఎంసీ కార్యకర్తలు భౌతిక దాడికి పాల్పడ్డారని ఆరోపణలు వచ్చాయి. కొన్ని చోట్ల ఈవీఎంలపై బీజేపీ గుర్తుపై సిరా పూయడంతో పోలింగ్‌కు స్వల్ప అంతరాయం కలిగింది. ఇదే సమయంలో నాడియాలో జరిగిన ఎన్నికల ర్యాలీలో ప్రధాని మోదీ మాట్లాడుతూ.. బెంగాల్‌లో 15 ఏళ్ల టీఎంసీ ‘జంగిల్ రాజ్’ పాలన అంతం కాబోతోందని, భారీ పోలింగ్ బీజేపీ విజయాన్ని సూచిస్తోందని ధీమా వ్యక్తం చేశారు.

**వారి గెలుపు ఓటములపైనే దృష్టి**

తమిళనాడు రాజకీయాల్లో ఈసారి ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ తన పరిపాలనకు ఈ ఎన్నికలను ఒక రెఫరెండంగా భావిస్తుండగా, ఎడప్పాడి పళనిస్వామి నేతృత్వంలోని ఏఐఏడీఎంకే తిరిగి పుంజుకోవాలని చూస్తోంది. అయితే.. అందరి దృష్టి స్టార్ హీరో విజయ్ పైన ఉంది. ఆయన తిరుచిరాపల్లి ఈస్ట్, పెరంబూర్ నుండి పోటీ చేస్తూ తన రాజకీయ అరంగేట్రం చేస్తున్నారు. నందిగ్రామ్‌లో సువేందు అధికారి, కోలత్తూర్‌లో ఎంకే స్టాలిన్, ఎడప్పాడిలో పళనిస్వామి వంటి దిగ్గజాల గెలుపోటములు ఈ ఎన్నికల్లో కీలకంగా మారనున్నాయి.

# టీ కాంగ్రెస్ మరో బిగ్ స్కెచ్!



**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** తెలంగాణ రాజకీయాల్లో ఓబీసీ అంశం గత కొంత కాలంగా ప్రధాన అంశంగా మారింది. ఓబీసీలను ప్రసన్నం చేసుకునేందుకు ప్రధాన పార్టీలు విశ్వప్రయత్నాలు చేస్తున్నాయి. ఈ క్రమంలో రాష్ట్రంలో కులగణన చేపట్టి ఆ లెక్కలను ప్రభుత్వం విడుదల చేసిన నేపథ్యంలో అధికార కాంగ్రెస్ ఈ అంశంలో మరో కీలక ప్రణాళిక రచిస్తున్నట్లు తెలుస్తోంది. రాబోయే ఏఐసీసీ జాతీయ ఓబీసీ సలహా మండలి సమావేశాన్ని హైదరాబాద్‌లో నిర్వహించేలా రాష్ట్ర కాంగ్రెస్ ప్రణాళిక రచిస్తోంది. ఈ మేరకు ఇవాళ ఢిల్లీలో ఏఐసీసీ అగ్రనేత రాహుల్ గాంధీతో భేటీ అయిన పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ రాబోయే ఏఐసీసీ జాతీయ ఓబీసీ సలహా మండలి సమావేశాన్ని హైదరాబాద్‌లో నిర్వహించాలని కోరగా ఇందుకు రాహుల్ సానుకూలంగా స్పందించినట్లు వెల్లడించారు. ఇచ్చిన మాట ప్రకారం రాష్ట్రంలో సమగ్ర కులగణన జరిపి అధికారిక సమాచారాన్ని ప్రకటించినట్టుగా రాహుల్ గాంధీకి మహేశ్ కుమార్ గౌడ్ వివరించారు. మహిళ రిజర్వేషన్ల బిల్లులో బీసి రిజర్వేషన్ల అంశాన్ని కూడా జోడించాలని ఈ సందర్భంగ రాహుల్‌కు విజ్ఞప్తి చేశారు.

**తాజా పరిణామాలపై కీలక చర్చ:**

ఇవాళ ఢిల్లీలోని 10 జన్‌పథ్‌లో జరిగిన రాహుల్ ను కలిసిన మహేశ్ కుమార్ గౌడ్.. ఈ సందర్భంగా రాష్ట్రంలోని తాజా రాజకీయ పరిణామాలు, అభివృద్ధి, సంక్షేమ పథకాలపై రాహుల్ గాంధీకి వివరించారు. దాదాపు 15 నిమిషాల పాటు జరిగిన సమావేశంలో పలు అంశాలపై ఇరువురు నేతలు చర్చించారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో పార్టీ పరంగా జరుగుతున్న ఆర్గనైజేషన్ కార్యక్రమాలను రాహుల్ కు వివరించారు. డీసీసీ అధ్యక్షుల నియామకాలు, జిల్లా కమిటీలు, మండల కమిటీలు, బిఎల్‌లోల నియామకాలు, అనుబంధ సంఘాల నియామకాలు తదితర అంశాలపై సమావేశంలో రాహుల్ గాంధీకి వివరించారు.

సంపాదకీయం

# ఇది కుట్రపూరిత డీలిమిటేషన్!

భిన్నత్వంలో ఏకత్వ సంస్కృతి వారసత్వంతో ప్రపంచవ్యాప్తంగా భారతదేశం కీర్తించబడుతుంటే కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం ఒంటెద్దు పోకడలతో సమాఖ్య స్ఫూర్తికి భిన్నంగా రాష్ట్రాల మధ్య, దేశ ప్రజల మధ్య చిచ్చు పెడుతోంది. ఇంతకాలం అధికారాన్ని అడ్డం పెట్టుకొని స్వయం ప్రతిపత్తి గల ఎన్నికల కమిషన్, ఐటీ, ఈడీ సంస్థలను దుర్వినియోగపరచిన నరేంద్ర మోదీ సర్కారు ఇప్పుడు మరో అడుగు ముందుకేసి మహిళలకు 33శాతం రిజర్వేషన్ బిల్లును అడ్డుపెట్టుకొని అశాస్త్రీయంగా నియోజకవర్గాల పునర్విభజన చేసేందుకు సిద్ధమైంది. దేశంలో మహిళా రిజర్వేషన్ల బిల్లును కాంగ్రెస్‌తో సహా ఏ ఇతర పార్టీలూ వ్యతిరేకించడం లేదు. అయితే ఈ బిల్లును అడ్డం పెట్టుకొని దేశవ్యాప్తంగా లోక్‌సభ, అసెంబ్లీ నియోజకవర్గాల పునర్విభజన పేరిట బీజేపీ కుట్రలకు తెరదీసింది. ఈ నేపథ్యంలో కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ వీటిపై సమగ్రంగా చర్చించి స్పష్టమైన వైఖరిని ప్రకటించింది. మహిళల సాధికారతకు కట్టుబడిన కాంగ్రెస్ పార్టీ డీలిమిటేషన్ విషయంలో మాత్రం దేశ సమగ్రతను, సమతౌల్యాన్ని కాపాడాలని కోరుతోంది. 2024 లోక్‌సభ ఎన్నికల ముందు 2023లో మహిళా రిజర్వేషన్ చట్టాన్ని చేసి చేతులు దులుపుకుంది బీజేపీ. మహిళా రిజర్వేషన్లను 2024 ఎన్నికల నుంచే అమలు చేయాలని కాంగ్రెస్ కోరినప్పటికీ పెడచెవిన పెట్టింది. 2026 జనగణన తర్వాత నియోజకవర్గాల పునర్విభజన చేసి అనంతరం మహిళా రిజర్వేషన్లు అమలు చేస్తామని కప్పదాటు వైఖరిని ప్రదర్శించింది. 2021లో చేయాల్సిన జనగణనను కోవిడ్ కారణంగా వాయిదా వేసిన కేంద్ర ప్రభుత్వం ఇప్పటివరకూ తాత్సారం చేసింది. ఇప్పుడు హడావిడిగా జనాభా లెక్కలు తేలకముందే 50శాతం పెంపుతో నియోజకవర్గాల పునర్విభజన చేస్తున్నట్టు ప్రకటించింది. ఇందులో కుట్ర దాగి ఉంది. అది బయటపడకుండా మహిళా రిజర్వేషన్లకు లింకు పెట్టి పొలిటికల్ గేమ్ ప్రారంభించింది. ఉత్తరాది హిందీ బెల్ట్ పార్టీగా గుర్తింపు పొందిన బీజేపీ ప్రభుత్వం 50శాతం సీట్ల పెంపు ప్రతిపాదనతో డీలిమిటేషన్ చేసి దక్షిణాది రాష్ట్రాలకు తీవ్ర అన్యాయం చేసేందుకు ప్రణాళికలు రూపొందించింది. దేశంలో లోక్‌సభ స్థానాలను 543 నుంచి 850కు పెంచాలని నిర్ణయించింది. ఉదాహరణకు ప్రస్తుతం 20 లోక్‌సభ స్థానాలున్న కేరళకు, 80 స్థానాలున్న ఉత్తరప్రదేశ్‌కు మధ్య సీట్ల వ్యత్యాసం 60 లోక్‌సభ స్థానాలు. ప్రస్తుతం ప్రతిపాదించినట్టు యాభై శాతం ప్రకారమైతే కేరళకు 30, యూపీకి 120 సీట్లు వస్తాయి. అంటే రెండు రాష్ట్రాల మధ్య వ్యత్యాసం 90 స్థానాలుగా ఉంటుంది. మొత్తం మీద దక్షిణాదిలో 130 నుంచి 195 స్థానాలయితే, ఉత్తరాదిలో 413 నుంచి 621 స్థానాలవుతాయి. రెండు ప్రాంతాల మధ్య అంతరం భారీ స్థాయిలో ఉండి, దేశంలో ఉత్తరాది ప్రాంతాల ఆధిపత్యం పెరుగుతుంది. ఇప్పటికే దక్షిణాదిపై చిన్న చూపుతో ఉన్న బీజేపీ మరింత వివక్ష చూపించే అవకాశాలు పెరుగుతాయి. కేవలం దక్షిణాది ప్రాంతాలే గాక, దేశంలోని చిన్న రాష్ట్రాలన్నీ ఈ నిర్ణయంతో తీవ్రంగా నష్టపోతాయి. ఉత్తరాది రాష్ట్రాల్లో అధిక స్థానాలు గెలిచి అన్ని రాష్ట్రాలపై పెత్తనం చలాయించేందుకు నియోజకవర్గాల డీలిమిటేషన్‌ను బీజేపీ అస్త్రంగా చేసుకుంటుంది. దేశంలో పదేళ్లకోసారి జనాభా ఆధారంగా నియోజకవర్గాల పునర్విభజన చేయాలని స్వాతంత్ర్యానంతరం పునర్విభజన కమిషన్ల ఏర్పాటు ప్రతిపాదనలు తీసుకొచ్చారు. అందుకు తగ్గట్టు 1951, 1962, 1972లో కమిషన్లు ఏర్పాటు చేసి లోక్‌సభ స్థానాలను 494 నుంచి 522కు, అనంతరం 543కు పెంచారు. ఇదే సమయంలో జనాభా నియంత్రణ కోసం 1970లో నాటి కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక కార్యక్రమాలను రూపొందించడంలో దేశంలో జనాభా కట్టడి ఫలితాలిచ్చినా, ప్రాంతాల మధ్య సమతుల్యం దెబ్బతిన్నది. యూపీ, బిహార్ వంటి ఉత్తరాది రాష్ట్రాల్లో జనాభా కట్టడి విఫలమవగా, దక్షిణాది రాష్ట్రాలన్నీ జనాభా నియంత్రణలో సఫలమైనాయి. అయితే ఇప్పుడు అదే అంశం దక్షిణాది రాష్ట్రాలకు శాపంగా మారడం విచారకరం. జనాభాపరంగా ఉత్తరాది రాష్ట్రాల సీట్లు పెరిగి, దక్షిణాది రాష్ట్రాలకు తీవ్ర అన్యాయం జరిగే అవకాశాలుండడంతో-- నాటి ప్రధాని ఇందిరాగాంధీ ముందు చూపుతో 1976లో 42వ రాజ్యాంగ సవరణతోను, తర్వాత వాజపేయి ప్రభుత్వం 2002లో 84వ రాజ్యాంగ సవరణతోను జనాభా ప్రాతిపదికన నియోజకవర్గాల పెంపును అడ్డుకున్నారు. కేవలం భౌగోళిక సరిహద్దుల మార్పుతోనే నియోజకవర్గాల పునర్విభజన చేశారు. జనాభా ప్రాతిపదికన నియోజకవర్గాల పునర్విభజనతో దేశంలో సమతుల్యం దెబ్బతింటుందని గుర్తించిన ఇందిరాగాంధీ, వాజపేయి ప్రతిపాదనలను ఇప్పుడు మోదీ ప్రభుత్వం బుట్టదాఖలు చేస్తోంది. రాజకీయ సమానత్వం లేకుండా తొందరపాటు నిర్ణయంతో సంఖ్యాపరంగా దేశంలో నియోజకవర్గాల డీలిమిటేషన్ చేయాలన్న ప్రతిపాదన రాజ్యాంగ విరుద్ధం. దేశంలోని అన్ని రాష్ట్రాలతో, రాజకీయ పార్టీలతో, మేధావులతో, ప్రజాసంఘాలతో చర్చించకుండా హడావిడిగా గందరగోళంగా ఇంతటి కీలక నిర్ణయం తీసుకోవడం దురదృష్టకరం. మహిళా రిజర్వేషన్ల బిల్లు కోసం ఏప్రిల్ 16 నుంచి ప్రత్యేక సమావేశాలు నిర్వహిస్తున్నట్టు భారీగా ప్రచారం చేస్తున్న నరేంద్రమోదీ ప్రభుత్వం ఇదే ముసుగులో డీలిమిటేషన్ కుట్రకు పాల్పడుతోంది. ఒకపక్క కొన్ని రాష్ట్రాల్లో అసెంబ్లీ ఎన్నికలు జరుగుతుంటే ఈ రెండు బిల్లులను తీసుకురావడం రాజ్యాంగ విరుద్ధం. కనీసం ఎన్నికలు ముగిసేవరకైనా వాయిదా వేయాలని కోరుతున్నా మోదీ ప్రభుత్వం మొండి వైఖరితో ముందుకెళ్లడంలో మోసపూరిత కుట్రలు దాగున్నాయి. మహిళలకు 33శాతం రిజర్వేషన్లపై కూడా బీజేపీది మొసలికన్నీరే. 2024 ఎన్నికల నుంచి అమలు చేయమని కోరితే పట్టించుకోలేదు. మహిళా రిజర్వేషన్లలో కాంగ్రెస్ పార్టీ పాత్ర చరిత్రాత్మకమైనది. 1990లోనే రాజీవ్‌గాంధీ ప్రభుత్వం పంచాయతీరాజ్ వ్యవస్థలో మహిళలకు 33శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ రాజ్యాంగ సవరణ చేసింది. పీవీ నరసింహారావు ప్రభుత్వం 73, 74 రాజ్యాంగ సవరణలు చేయడంతో ప్రస్తుతం గ్రామీణ, పట్టణ స్థానిక సంస్థల్లో 14 లక్షలకు పైగా మహిళా ప్రతినిధులు ఎన్నికై సేవలందిస్తున్నారు. 2010లో మన్మోహన్‌సింగ్ ప్రభుత్వ హయాంలో మహిళా రిజర్వేషన్ బిల్లును రాజ్యసభ ఆమోదించడం చరిత్రాత్మకం. కాబట్టి, బిల్లు ప్రస్తుతం ఈ దశకు చేరుకుందంటే ఆ ఘనత కాంగ్రెస్ పార్టీదే. అయితే డీలిమిటేషన్‌పై బీజేపీ కుట్రలను కాంగ్రెస్ పార్టీ బట్టబయలు చేస్తుంటే మహిళా బిల్లును వ్యతిరేకిస్తున్నట్టు తప్పుడు ప్రచారం చేస్తున్నారు. మహిళా రిజర్వేషన్ల బిల్లు, నియోజకవర్గాల పునర్విభజన అంశాలు రెండూ వేర్వేరని కాంగ్రెస్ చెబుతున్న వాస్తవాలను ప్రజలు గ్రహించి బీజేపీకి తగిన సమయంలో తగిన బుద్ధి చెప్పడం ఖాయం. కాంగ్రెస్ పార్టీ మహిళా సాధికారిత కోసం మహిళలకు 33శాతం రిజర్వేషన్ల బిల్లుపై సంపూర్ణంగా మద్దతు ఇస్తున్నది. అదే సమయంలో దేశంలో ప్రాంతాల మధ్య సమతుల్యత దెబ్బతినకుండా, అన్ని రాష్ట్రాలు సమాన స్థాయిలో అభివృద్ధి చెందేలా, పారదర్శకంగా నియోజకవర్గాల డీలిమిటేషన్ జరగాలని కోరుతున్నది. ఈ అంశంలో బీజేపీ నియంతృత్వ వైఖరిని అడ్డుకునేందుకు పోరాటానికి సిద్ధమవుతున్న కాంగ్రెస్‌తో ప్రజాస్వామ్యవాదులందరూ కలిసి రావాలి.



# ద్రోహానికి మరో పేరు కాంగ్రెస్



భారత తొలి ప్రధాని పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ ఒక సందర్భంలో ఇలా అన్నారు. "చరిత్రలో అరుదుగా వచ్చే కీలక రాజ్యాంగ మలుపును మనం సద్వినియోగం చేసుకుంటామా? లేదా జర్మన్ తత్త్వవేత్త హేగెల్ హెచ్చరించినట్టు పాఠాలు నేర్చుకోకుండా మళ్లీ మళ్లీ వదిలేస్తామా?" నెహ్రూ వారసత్వం గురించి ఘనంగా చెప్పుకొనే కాంగ్రెస్, కనీసం ఆయన మాటలను కూడా అర్థం చేసుకోలేని దుస్థితిలో ఉంది. ఇటీవల మోదీ ప్రభుత్వం పార్లమెంటులో ప్రవేశపెట్టిన చరిత్రాత్మక మహిళా రిజర్వేషన్ బిల్లును వ్యతిరేకించి చరిత్ర నుంచి తాము పాఠాలు నేర్చుకోమని చెప్పకనే చెప్పింది. దేశహితం కన్నా దిగజారుడు రాజకీయాలే ప్రధానం అనుకొని నాలుగు విధాలుగా దేశాన్ని నష్టపర్చింది. మహిళా రిజర్వేషన్ చట్టాన్ని అడ్డుకొని నారీ లోకానికి తీరని అన్యాయం చేయడమే కాకుండా, డీలిమిటేషన్‌ను వ్యతిరేకించి దక్షిణాది రాష్ట్రాల ప్రయోజనాలను దెబ్బతీసింది, చట్టసభల్లో ఎస్సీ--ఎస్టీల అవకాశాలకూ గండికొట్టింది. పార్లమెంటరీ ప్రజాస్వామ్యంలో అధికారంలో ఉన్న పార్టీ తమ అధికారాన్ని నిలబెట్టుకునేందుకు ప్రయత్నించడం సహజం. దేశానికే తొలి ప్రాధాన్యం విధానానికి పెద్దపీట వేస్తున్న మోదీ ప్రభుత్వం రాజకీయ ప్రయోజనాలను పక్కనపెట్టి భారతదేశ సమగ్రత కాపాడేందుకు, ఎస్సీ--ఎస్టీ వర్గాలతో పాటు మహిళల ప్రాతినిధ్యం పెంచేందుకు డీలిమిటేషన్ చట్టంతో ఒక చరిత్రాత్మక మార్పునకు శ్రీకారం చుడితే, దానిని కాంగ్రెస్ కుట్రపూరితంగా అడ్డుకొని పైశాచిక ఆనందం పొందుతోంది. భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 81 ప్రకారం, ఒక రాష్ట్రంలో ఎన్ని లోక్‌సభ నియోజకవర్గాలు ఉండాలనే దానికి జనాభాను ప్రాతిపదికగా తీసుకోవాలి. ఈ ప్రాతిపదిక దేశంలోని అన్ని రాష్ట్రాలకు ఒకే విధంగా ఉండాలి. 1971లో 42వ రాజ్యాంగ సవరణ ప్రకారం.. దేశంలో లోక్‌సభ నియోజకవర్గాలు 550 దాటకూడదని, ఇందులో రాష్ట్రాలకు 530, కేంద్రపాలిత ప్రాంతాలకు 20 అని నిర్ణయించారు. చివరకు 543 సీట్లకు ఖరారు చేశారు. తదనంతరం దేశం జనాభా నియంత్రణకు అధిక ప్రాధాన్యమిచ్చింది. ఇందులో రాష్ట్రాల మధ్య తీవ్రమైన వ్యత్యాసాలున్నాయి. ముఖ్యంగా దక్షిణాది రాష్ట్రాలు జనాభా నియంత్రణను మెరుగ్గా అమలు చేశాయి. అయితే, జనాభా ప్రాతిపదికన నియోజకవర్గాల పునర్విభజన చేపడితే, జనాభా నియంత్రణను పక్కాగా అమలు చేసిన రాష్ట్రాలు నష్టపోతాయని భావించి, 25 ఏళ్ల వరకు ఒకసారి, దానిని మరో 25 ఏళ్లకు పొడిగిస్తూ మరోసారి, మొత్తం 50 ఏళ్ల వరకు నియోజకవర్గాల సంఖ్యను స్థిరపరిచారు. 1971లో దాదాపు 55 కోట్లుగా ఉన్న భారతదేశ జనాభా.. ఇప్పుడు 145 కోట్లు దాటింది. ప్రజలకు మెరుగైన సేవలు అందించాలంటే జనాభా ప్రాతిపదికన నియోజకవర్గాల పునర్విభజనతో వాటి సంఖ్యను పెంచాల్సిన అనివార్య పరిస్థితులు ఏర్పడ్డాయి. ఈ నేపథ్యంలో సమాఖ్య స్ఫూర్తి, సమన్యాయానికి పెద్దపీట వేస్తూ, దూరదృష్టితో అన్ని రాష్ట్రాలకూ సమ ప్రయోజనం చేకూరేలా మోదీ ప్రభుత్వం 50శాతం పెంపు ప్రతిపాదన తీసుకొచ్చింది. దీనిని అర్థం చేసుకోలేని కాంగ్రెస్, కేవలం ప్రధాని మోదీపైన, బీజేపీపై అక్కసుతో గుడ్డిగా వ్యతిరేకించి, దక్షిణాది రాష్ట్రాలకు అన్యాయం చేసింది. ప్రస్తుతం దక్షిణాది రాష్ట్రాల్లో ఒక నియోజకవర్గంలో సగటున 14--15 లక్షల జనాభా ఉంది. అదే బిహార్, ఉత్తరప్రదేశ్ లాంటి రాష్ట్రాల్లో సగటున 20--25 లక్షల జనాభా ఉంది. ఆర్టికల్ 81 ప్రకారం దేశంలోని అన్ని రాష్ట్రాల నియోజకవర్గాల పునర్విభజనకు ఒకే జనాభా ప్రాతిపదిక ఉండాలి. 2011 జనాభా ప్రాతిపదికన నియోజకవర్గాల పునర్విభజన చేపడితే దక్షిణాది రాష్ట్రాల వాటా 132 నుంచి 110--120కు తగ్గుతుంది, అదే సమయంలో ఉత్తరాది రాష్ట్రాల వాటా 216 నుంచి 240--250కు పెరుగుతుంది. 2026 జనాభా ప్రాతిపదికన నియోజకవర్గాల పునర్విభజన చేపడితే బీజేపీకి బలమున్నదని చెప్పే హిందీ రాష్ట్రాల్లోనే నియోజకవర్గాల సంఖ్య పెరుగుతుంది. ఉదాహరణకు ఉత్తరప్రదేశ్‌ను తీసుకుంటే ప్రస్తుతం 80 లోక్‌సభ స్థానాలున్నాయి. అదే 2011 జనాభా ప్రాతిపదికన పునర్విభజన చేపడితే యూపీలో వాటి సంఖ్య 132కు పెరుగుతుంది. అదే తమిళనాడును తీసుకుంటే ప్రస్తుతం ఉన్న 39 స్థానాల నుంచి 35కు పడిపోతాయి. మోదీ ప్రభుత్వం ప్రతిపాదించిన 50శాతం పెంపు ప్రకారం యూపీ సీట్లు 80 నుంచి 120, తమిళనాడు సీట్లు 39 నుంచి 59కి పెరుగుతాయి. అప్పుడు అన్ని రాష్ట్రాలకు ప్రయోజనం చేకూరుతుంది. ఒకవిధంగా తమ జనాభాకు తగ్గ ప్రాతినిధ్యం లేదని ఉత్తరాది రాష్ట్రాలే 50శాతం పెంపు ప్రతిపాదనను వ్యతిరేకించాలి, కానీ తర్కం లేని కాంగ్రెస్, దక్షిణాది రాష్ట్రాలకు ద్రోహం చేసింది. దాదాపు 50 ఏళ్లుగా నలుగుతున్న మహిళా రిజర్వేషన్లను సాకారం చేస్తూ మోదీ ప్రభుత్వం నారీశక్తి వందన్ అధినియం, 2023 చట్టాన్ని తీసుకొచ్చింది. నియోజకవర్గాల పునర్విభజన అనంతరం మహిళలకు లోక్‌సభలో, రాష్ట్రాల అసెంబ్లీల్లో 33శాతం రిజర్వేషన్ అమల్లోకి వస్తుంది. అయితే, ప్రజల నుంచి వచ్చిన అభ్యర్థనల మేరకు జనగణనలో కులగణన కూడా చేపట్టాలని నిర్ణయించారు. ఈ ప్రక్రియ అంతా పూర్తయి, నియోజకవర్గాల పునర్విభజన జరిగి, 33 శాతం మహిళా రిజర్వేషన్లు అమల్లోకి రావడం జాప్యమయ్యే అవకాశం ఉంది. రానున్న 2029 ఎన్నికల్లో మహిళలకు రిజర్వేషన్లు కల్పించాలన్న సత్సంకల్పంతో మోదీ ప్రభుత్వం 131 రాజ్యాంగ సవరణ బిల్లును ప్రవేశపెట్టింది. లోక్‌సభ స్థానాలను పెంచుతూ, నియోజకవర్గాల పునర్విభజన నిబంధనలను సవరించడం ఈ బిల్లు ఉద్దేశ్యం. రాజ్యాంగ సవరణ కాబట్టి... బిల్లు పాస్ కావడానికి 2/3 వంతుల మెజారిటీ అవసరమైన నేపథ్యంలో మహిళలు అధికార స్థానంలో ఉండడాన్ని జీర్ణించుకోలేని కాంగ్రెస్ దక్షిణాది రాష్ట్రాలకు అన్యాయం జరుగుతుందంటూ ఈ బిల్లు వీగిపోయేలా చేసింది. ప్రస్తుతం లోక్‌సభలో 74 మంది ఎంపీలతో మహిళల ప్రాతినిధ్యం 14 శాతానికే పరిమితమైంది. ఈ బిల్లు పాస్ అయివుంటే, లోక్‌సభ నియోజకవర్గాల సంఖ్య 850కు పెరిగి, అందులో 33శాతం రిజర్వేషన్లు అమలై 280 స్థానాలను మహిళలకు కేటాయిస్తే, వీరికి ప్రస్తుతం జనరల్ స్థానాల్లో గెలిచిన 14 శాతాన్ని కలుపుకొంటే, 350కి పైగా సీట్లతో మహిళా సభ్యుల సంఖ్య దాదాపు 47శాతం వరకు పెరిగే అవకాశం ఉంది. లోక్‌సభ మాత్రమే కాదు, రాష్ట్రాల అసెంబ్లీల్లోనూ మహిళలకు రిజర్వేషన్లు అమలై, దేశంలో మహిళా ఎమ్మెల్యేల సంఖ్య గణనీయంగా పెరిగేది. అంతేకాదు, ప్రస్తుతం లోక్‌సభలో 84 ఎస్సీ స్థానాలు, 47 ఎస్టీ స్థానాలున్నాయి. నియోజకవర్గాల సంఖ్య 850కు పెరిగితే ఎస్సీ స్థానాలు 132, ఎస్టీ స్థానాలు 72కు మారేవి. రాష్ట్రాల అసెంబ్లీల్లోనూ ఎస్సీ--ఎస్టీ నియోజకవర్గాల సంఖ్య పెరిగి వారి ప్రాతినిధ్యం పెరుగుతుంది. ప్రజలను తప్పుదోవ పట్టించిన కాంగ్రెస్, నిర్హేతుక కారణాలతో మహిళల ప్రయోజనాలను కాలరాయడమే కాదు, ఎస్సీ--ఎస్టీల అవకాశాలనూ దెబ్బతీసింది. ప్రధాని మోదీని, బీజేపీ ప్రభుత్వాన్ని వ్యతిరేకించాలన్న ఏకైక లక్ష్యం పెట్టుకున్న కాంగ్రెస్, దక్షిణ భారత మహిళల, ఎస్సీ--ఎస్టీల ప్రయోజనాలను తాకట్టుపెడుతోంది. ప్రజోపయోగ విధానాలనూ వ్యతిరేకిస్తే, ఇప్పటికే మూడు పర్యాయాలు అధికారానికి దూరమైన కాంగ్రెస్, మరో 30 పర్యాయాలైనా అధికారంలోకి రావడం కల్ల!

# అధికారుల పెత్తనంతో అస్తవ్యస్తం!




ఎస్సీ గురుకులాల్లో వరుసగా కార్యదర్శులు మారుతుండటంతో ఆ సంస్థలో డిప్యూటేషన్ పద్ధతిలో పని చేస్తున్న అధికారుల పెత్తనం కొనసాగుతున్నదని ప్రచారం జరుగుతున్నది. కీలకమైన నిర్ణయాలు అన్ని వారు కనుసన్నల్లోనే జరుగుతున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. అడ్మిషన్ల ప్రక్రియ మొదలుకుని అడ్మిస్ట్రేషన్ వరకు సదరు అధికారుల ఆదేశాల మేరకు నడుస్తున్నట్లు తెలుస్తున్నది. కొన్నిసార్లు కొత్తగా వచ్చిన సెక్రెటరీలకు తప్పుడు ఫీడ్ బ్యాక్ ఇచ్చి బురిడీ కొట్టిస్తున్నట్టు చర్చ జరుగుతున్నది.

**రెండున్నరేళ్లలో నలుగురు సెక్రెటరీలు**

కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన రెండున్నరేళ్లలో ఇప్పటికే నలుగురు సెక్రెటరీలు మారారు. దీంతో కొత్తగా బాధ్యతలు తీసుకున్న సెక్రెటరీ ఎంత కాలం పనిచేస్తారో తెలియని పరిస్థితి నెలకొన్నది. ఇలాంటి పరిస్థితుల్లో సంస్థలో పని చేస్తున్న కిందిస్థాయి అధికారుల చేతుల్లోకి కీలకమైన ఫైల్స్ వెళ్తుండగా.. వారు తమకు అనుకూలంగా నిర్ణయాలు తీసుకుంటున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. అంతేకాకుండా సదరు అధికారులు కొన్ని సార్లు సెక్రెటరీలకు సైతం తప్పుడు సమాచారం ఇచ్చి బురిడీ కొట్టిస్తున్నట్లు చర్చ జరుగుతున్నది. అయితే తప్పును గమనించి సమస్యను పరిష్కరించేందుకు సెక్రెటరీలు నడుం బిగించేలోపు ప్రభుత్వం వారిని అక్కడి నుంచి తప్పిస్తున్నట్లు పేరెంట్స్, విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎస్సీ గురుకులాల్లో పనిచేయాలని చిత్తశుద్ధి, తపన ఉన్న అధికారులను సెక్రెటరీలుగా నియమించాలని, హెడ్ ఆఫీసులో కొనసాగుతున్న అక్రమాలకు చెక్ పెట్టాలని డిమాండ్ చేస-్తున్నారు.

**డిప్యూటేషన్ అధికారులదే హవా**

విద్యార్థులకు ప్రయోజనం కలిగించే అంశాలను పక్కన పెట్టి తమకు లబ్ధి చేకూరే అంశాలపైనే అధికారులు ఎక్కువ ఫోకస్ పెడుతున్నట్లు ఫిర్యాదులు ఉన్నాయి. డిప్యూటేషన్ పద్ధతిలో వచ్చిన ఓ ఆఫీసర్ కు అడ్మిస్ట్రేషన్, ఫైనాన్స్ విభాగాల బాధ్యతలు అప్పగించడంపై విమర్శలు వస్తున్నాయి. ఫైనాన్స్ అంశాల్లో ఎలాంటి అనుభవంలేని సదరు ఆఫీసర్ కు ఆ విభాగం బాధ్యతలు అప్పగించడంపై అభ్యంతరాలు వ్యక్తమవుతున్నాయి. ఈ మధ్య సోషల్ మీడియా వింగ్‌లో కొందరిని నియమించారని, అందుకు ప్రభుత్వం నుంచి అనుమతి తీసుకోలేదనే ఆరోపణలు ఉన్నాయి. ఎలాంటి నోటిఫికేషన్ ఇవ్వకుండానే విద్యార్థులకు క్రీడల్లో శిక్షణ ఇప్పించేందుకు ఒక అథ్లెట్ కు ప్రతి నెల రూ. లక్షన్నర జీతంతో నియమించారని ప్రచారం జరుగుతున్నది. టీచింగ్ స్టాఫ్ కు సంబంధించిన ఫైల్స్ క్లియరెన్స్ కోసం పెద్ద ఎత్తున డబ్బులు వసూలు చేస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి.

**ప్రతియేటా వేలాది సీట్లు ఖాళీ**

సుమారు పదిహేనేళ్లుగా అడ్మిషన్ వింగ్ బాధ్యతలు ఒకే ఆఫీసర్ కనుసన్నల్లో నడుస్తుండడంతో ఆ విభాగంలో జరిగే తప్పిదాలను ప్రశ్నించేవారు లేకుండాపోయారనే టాక్ ఉంది. నాలుగైదు ఏళ్లుగా నిర్ణీత సమయంలో అడ్మిషన్లు పూర్తి చేయకపోవడంతో ప్రతి ఏటా ఇంటర్ కాలేజీల్లో వేలాది సీట్లు ఖాళీగా ఉంటున్నాయని ఆరోపణలు ఉన్నాయి. టెన్త్ రిజల్ట్స్ వచ్చిన వెంటనే ఇంటర్ కాలేజీల్లో అడ్మిషన్ల ప్రక్రియ మొదలు పెట్టాలి. కానీ ఆ విధంగా చేయకుండా.. కాలయాపన చేస్తుండటంతో స్టూడెంట్స్ ప్రైవేటు కాలేజీల్లోకి వెళ్తున్నారనే టాక్ ఉంది.

**కీలక టైమ్‌లో సెలవుల్లో సెక్రెటరీ**

ప్రస్తుతం గురుకులాల్లో అడ్మిషన్ల ప్రక్రియ నడుస్తున్నది. ఈ ఏడాది నుంచి సెంట్రలైజ్డ్ ప్రొక్యూర్ మెంట్ ద్వారా పిల్లలకు కావాల్సిన కిట్స్, షూ, డ్రెస్సులు, గ్రాసరీస్ ను కొనుగోలు చేసేందుకు ప్రభుత్వం కసరత్తు చేస్తున్నది. ఈ కీలక ప్రక్రియకు ఎస్సీ గురుకులాల సొసైటీని నోడల్ ఏజెన్సీగా నియమించింది. కానీ రెగ్యులర్ సెక్రెటరీ విజయేంద్ర సెలవుపై వెళ్లడంపై విమర్శలు వస్తున్నాయి. గురుకులాల్లో నిబద్ధతతో పనిచేస్తారనే ఉద్దేశ్యంతో ఆమెకు బాధ్యతలు అప్పగించారు. కానీ కీలక సమయంలో ఆమె సెలవుపై వెళ్లడంతో విజయేంద్రకు ఎస్సీ గురుకులాల్లో పనిచేయాలనే ఇంట్రెస్ట్ అసలు ఉందా? లేదా? అనే చర్చ జరుగుతున్నది.

**పైరవీలతో హెడ్ ఆఫీసులో తిష్ట**

ఎస్సీ గురుకులాల్లో రూల్స్ గిల్స్ జన్తా నహీ.. వీళ్లు చెప్పిందే వేదం.. చేసిందే రూల్స్‌గా చలామణి అవుతున్నారు. 'నీకు నేను..నాకు నువ్వు' అన్న చందంగా ఇద్దరు జాయింట్ సెక్రటరీలు ఆడిందే ఆట.. పాడిందే పాటగా నడుస్తున్నది. అర్హతలేకున్నా పైరవీలతో పోస్టింగ్ తెచ్చుకుని అక్కడ తిష్ట వేశారు. వీరుద్దరు ఒక్కటిగా ఏర్పడి, కొత్తగా వచ్చిన ప్రతి సెక్రటరీని తప్పుదోవ పట్టించడంతోపాటు అక్రమాలకు పాల్పడుతున్నారనే ఆరోపణలు ఉన్నాయి. రూల్ ఆఫ్ రిజర్వేషన్స్ సైతం అమలు కావడంలేదు. దీనిపై విచారణ జరిపించాలని పలువురు ఉద్యోగులు కోరుతున్నారు. టీచింగ్ ఫ్యాకల్టీగా ఎంపికైన వ్యక్తులు తమకు ఉన్న పలుకుబడితో డిప్యూటేషన్ పద్ధతిలో హెడ్ ఆఫీసులో తిష్టవేస్తున్నట్లు ఫిర్యాదులు ఉన్నాయి.

సంపాదకీయం పేజీలో రచనలు పంపవలసిన వాట్సప్ నంబర్ ,మెయిల్ ఐడి 9951512539 flashindia999@gmail.com

# ఐసీడీఎస్ కార్యాలయాలు అవినీతిమయం

- ఐసీడీఎస్ కార్యాలయాలు అవినీతిమయం
- నాడు కరీంనగర్ నేడు రామగుండంలో
- అధికారుల పై అక్రమ ఆరోపణలు
- ఫిర్యాదుల పై ఉన్నతాధికారుల మౌనం
- విచారణ పేరిట కాలయాపణ
- జిల్లా వ్యాప్తంగా తీవ్ర విమర్శలు

**కరీంనగర్,ఫ్లాష్ ఇండియా :** ఐసీడీఎస్ కార్యాలయాలు అధికారుల అక్రమ వసూళ్ల వ్యవహారాలతో అవినీతి మయంగా మారిపోతుండగా క్రింది స్థాయి ఉద్యోగులు ఎవరికి చెప్పుకున్నా చర్యలు కానరాక అధికారులకు మామూళ్లు ఇచ్చుకోలేక వారి గుప్పిట్లో పడి నలిగిపోతున్నారు. గతంలో అధికారుల అవినీతి అక్రమాల పై కరీంనగర్ ఐసీడీఎస్ సిబ్బంది ఆధారాలతో ఫిర్యాదులు చేయగా విచారణ పేరిట ఏళ్లు గడచినా చర్యలు లేకపోవడం తాజాగా పెద్దపల్లి జిల్లా రామగుండం ఐసీడీఎస్ అధికారులు అదేబాటలో నడుస్తూ అక్రమ వసూళ్లకు పాల్పడటం తో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఐసీడీఎస్ శాఖలో ఏం జరుగుతుంది అనే చర్చ జోరందుకుంది .

**నాడు కరీంనగర్ ఐసీడీఎస్ అధికారులపై అక్రమాల ఆరోపణలు**

గతంలో కరీంనగర్ ఐసీడీఎస్‌లో పనిచేస్తున్న ఉద్యోగులపై అవినీతి అక్రమ వసూళ్లపై ఆరోపణలు, ఫిర్యాదులు వెల్లు వెత్తగా విచారణ పేరిట అధికారులు కాలయాపణ చేయడం తో పై స్థాయిలో అధికారులకు పెద్దమొత్తంలో డబ్బులు ముట్టజెప్పి చర్యలు తీసుకోకుండా జాగ్రత్తలు తీసుకున్నారనే విమర్శలు వ్యక్తవ-వుతున్నాయి. తాజాగా ఆధారాలు ఉన్న అక్రమ అధికారులపై చర్యలు ఎందుకు తీసుకోవడం లేదంటూ ఏసీబీ అధికారులకు అజ్ఞాత వ్యక్తులు ఫిర్యాదు చేయడంతో రంగంలోకి దిగిన అధికారులు తూ తూ మంత్రంగా విచారణ చేపట్టి తప్పుడు ఆరోపణలు అంటూ కొట్టిపడేయటం లక్షల్లో చేతులు మారాయనే విమర్శలు వ్యక్తం అవుతున్నాయి

**రామగుండంలో అధికారుల అక్రమాలపై ఫిర్యాదులు**

కరీంనగర్ ఐసీడీఎస్ లో అక్రమాల పై ఫిర్యాదులు వెల్లువెత్తినా చర్యలు లేకపోవడం ఇప్పుడు పెద్దపల్లి జిల్లా రామగుండంలో అధికారుల వేధింపులు, అక్రమ వసూళ్లతో నలిగిపోయిన క్రింది స్థాయి ఉద్యోగులు కలెక్టర్ కు ఫిర్యాదు చేయడం తో అసలు ఐసీడీఎస్‌లో ఏం జరుగుతుంది అనే చర్చ ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా జోరందుకుంది. అయితే రామగుండంలో ప్రమోషన్ల కోసం బదిలీ కావాలన్నా లక్షల్లో వసూల్ చేయడం అందుకు కింది స్థాయి ఉద్యోగుల యూపీఐల ద్వారా నగదును స్వీకరించడం వివాదస్పదంగా మారి ఇప్పుడు ఆ శాఖలో అక్రమ వసూళ్లు కలకలం సృష్టిస్తున్నాయి.

**ప్రతి పనికి ఓ రేటు**

ప్రమోషన్లు మొదలుకుని బదిలీలు చివరకు సెలవు మంజూరు చేయడం కోసం కూడా డబ్బులు వసూల్ చేయడం పై తీవ్రవిమర్శలు వ్యక్తమవుతున్నాయి. అయితే బాధితుల పిర్యాదుపై ఉన్నతాధికారులు స్పందించకపోవడం తో అక్రమ ఆరోపణలు ఎదుర్కొంటున్న అధికారులు తమ రాజకీయపలుకుబడిని ఉపయోగించి అధికారులపై ఒత్తిడి పెంచుతున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

**ఇక్కడా అంతా మామూళ్లే**

ఐసీడీఎస్ కార్యాలయం అంటేనే అవినీతి అక్రమాలకు కేరాఫ్ అడ్రస్ గా నిలుస్తుంది అనే విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. ఈ శాఖలో టెండర్లలో అవినీతికి పాల్పడ్డా, నిధులు దారిమళ్లించినా ఉద్యోగులకు సెలవు మంజూరు చేయడానికైనా ,బదిలీ కావాలన్న ప్రమోషన్, పొందాలన్నా ప్రత్యేక రేటు ఫిక్స్ చేసి డబ్బులు లాగడం ఆరోపణలు రాగానే పై స్థాయి అధికారులను ప్రసన్నం చేసుకునేందుకు సైతం ప్రత్యేక రేటు ఫిక్స్ చేసినట్లు సమాచారం. ఈ నేపథ్యంలోనే ఆ శాఖలో అధికారులు సమన్వయంతో పనిచేస్తూ ముందుకుసాగుతున్నారని ఎవరైనా ప్రశ్నించినా డబ్బులు ఇచ్చేందుకు నిరాకరించినా పైనుంచి క్రింది వరకు ఆధికారుల వేదింపులు తప్పవనే అబిప్రాయాలు ఆ శాఖ ఉద్యోగుల్లో వినిపిస్తున్నాయి.

**అక్రమాల పై అధికారుల నో రెస్పాన్స్**

ఐసీడీఎస్ లో గత కొద్దిరోజులుగా జరుగుతున్న అక్రమాలపై వివరణ కోరేందుకు ఆర్జేడీ (రీజనల్ జాయింట్ డైరెక్టర్ )కార్యాలయం వరంగల్ జిల్లా కేంద్రం లో ఉండటం చేత ఆర్జే డీ శ్రీ ఝాన్సీలక్ష్మిని ఫోన్ ద్వారా సంప్రదించేందుకు ప్రయత్నం చేసినప్పటికి సదరు అధికారిణి ఫోన్‌కు స్పందించడం లేదు.

# ఏపీ శాశ్వత రాజధానిగా అమరావతి..

**ఆంధ్రప్రదేశ్ :** ఆంధ్రప్రదేశ్ ఏకైక, శాశ్వత రాజధానిగా 'అమరావతి' ని గుర్తిస్తూ తాజాగా ప్రభుత్వం అధికారికంగా రాష్ట్రానికి సంబంధించి కొత్త మ్యాప్‌ను విడుదల చేసింది. భారత పార్లమెంట్ ఆమోదించిన చట్టబద్ధతతో అమరావతికి ఈ హోదా దక్కింది. ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ సవరణ బిల్లు-2026కు భారత పార్లమెంట్ ఆమోదముద్ర వేసిన విషయం తెలిసిందే. దేశ చరిత్రలో ఒక రాష్ట్ర రాజధానిని ఖరారు చేస్తూ పార్లమెంట్‌లో చట్టం రావడం ఇదే మొదటిసారి. ఈ బిల్లు ప్రకారం, జూన్ 2, 2024 నుంచి అమరావతిని ఆంధ్రప్రదేశ్ రాజధానిగా గుర్తిస్తూ శాశ్వత చట్టబద్ధత కల్పించారు. దీంతో గతంలో ఉన్న మూడు రాజధానుల అంశానికి పూర్తిగా ముగింపు పలికినట్లయింది.


**28 జిల్లాలతో సరికొత్త ఆంధ్రప్రదేశ్..**

తాజాగా విడుదల చేసిన అధికారిక మ్యాప్‌లో ఆంధ్రప్రదేశ్ జిల్లాల పునర్వ్యవస్థీకరణ ను కూడా స్పష్టంగా పొందుపరిచారు. రాష్ట్రంలో కొత్తగా మార్కాపురం, పోలవరం జిల్లాలను ఏర్పాటు చేయడంతో మొత్తం జిల్లాల సంఖ్య 28కి చేరింది. ఈ మ్యాప్‌లో అమరావతిని రాజధానిగా గుర్తించడంతో పాటు, కొత్త జిల్లాల సరిహద్దులను కూడా అధికారికంగా నిర్ధారించారు. కేంద్ర ప్రభుత్వం కూడా భారత అధికారిక పటంలో ఆంధ్రప్రదేశ్ రాజధానిగా అమరావతిని అప్‌డేట్ చేసింది. సర్వే ఆఫ్ ఇండియా మార్గదర్శకాల ప్రకారం విడుదలైన ఈ మ్యాప్ ఇప్పుడు దేశవ్యాప్తంగా అధికారిక పరిపాలన అవసరాలకు అందుబాటులోకి రానుంది. ఈ పరిణామంపై అమరావతి రైతులు, రాష్ట్ర ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

# ఖర్గే రాజకీయాల నుంచి తప్పుకుంటేే బెటర్..




**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే పై తెలంగాణ బీజేపీ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు రామచందర్ రావు ఘాటు వ్యాఖ్యలు చేశారు. ప్రధాని మోడీపై వివాదస్పద వ్యాఖ్యల నేపథ్యంలో ఖర్గేకు కేంద్ర ఎన్నికల సంఘం నోటీసులు జారీ చేసింది. ఈ క్రమంలోనే ఆయన నోటీసులపై రామచందర్ రావు స్పందిస్తూ.. ఖర్గే ఇక రాజకీయాల నుంచి రిటైర్ అవ్వడం మంచిదని సలహా ఇచ్చారు. ఖర్గే తన సొంత ఆలోచనతో మాట్లాడటం లేదని, కేవలం రాహుల్ గాంధీ కనుసన్నల్లోనే వ్యవహరిస్తున్నారని రామచందర్ రావు ఆరోపించారు. ఖర్గే చేసే ప్రతి ప్రకటనకు కాంగ్రెస్ పార్టీ, రాహుల్ గాంధీ పూర్తి బాధ్యత వహించాలని అన్నారు. ఈసీ కేవలం నోటీసులతో సరిపెట్టడం భావ్యం కాదని.. దేశ ప్రజలే కాంగ్రెస్‌కు, ఖర్గేకు తగిన బుద్ధి చెప్పాలని రామచందర్ రావు పేర్కొన్నారు. నేడు పశ్చిమ బెంగాల్ తొలి దశ ఎన్నికలు, అలాగే తమిళనాడు అసెంబ్లీ ఎన్నికలు జరుగుతున్నాయని రామచందర్ రావు అన్నారు. పశ్చిమ బెంగాల్‌లో ఓటర్లు భయం వీడి భారీ సంఖ్యలో తరలివచ్చి ఓటు వేయాలని పిలుపునిచ్చారు. అక్కడ ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎన్నికల సంఘం పటిష్టమైన చర్యలు తీసుకుందని ఆశిస్తున్నట్లుగా తెలిపారు. మే 4న వెలువడే ఫలితాలు రెండు రాష్ట్రాల్లోనూ రాజకీయ మార్పును తీసుకువస్తా-యని, బీజేపీకి అనుకూలంగా ఫలితాలు వస్తా-యని రామచందర్ రావు ధీమా వ్యక్తం చేశారు.



# బుక్స్ కొనాలని ప్రైవేటు స్కూళ్ల ఒత్తిడి..

**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** 2026-27 విద్యా సంవత్సరం ప్రారంభం కాకముందే అప్పుడే ప్రైవేటు పాఠశాలల్లో పుస్తకాల దందా మొదలైంది. ప్రభుత్వం నిర్ణయించిన నిబంధనలకు విరుద్ధంగా, ప్రైవేట్ పబ్లిషర్స్ పుస్తకాలను అధిక ధరలకు కొనాలని తల్లిదండ్రులపై యాజమాన్యాలు ఒత్తిడి చేస్తున్నాయి. ఈ వ్యవహారంపై తల్లిదండ్రుల నుంచి పెద్ద ఎత్తున ఫిర్యాదులు రావడంతో జాతీయ మానవ హక్కుల కమిషన్ (ఎన్‌హెచ్‌ఆర్సీ) తీవ్రంగా స్పందించింది.

**రాష్ట్ర ప్రభుత్వాలకు ఎన్‌హెచ్‌ఆర్సీ నోటీసులు..**

ప్రైవేటు పాఠశాలల ఏకపక్ష నిర్ణయాలు, తల్లిదండ్రులపై మోపుతున్న ఆర్థిక భారంపై మానవ హక్కుల కమిషన్‌కు ఫిర్యాదుల వెల్లువ పెరిగింది. దీనిని సుమోటోగా స్వీకరించిన కమిషన్, అన్ని రాష్ట్ర ప్రభుత్వాలతో పాటు కేంద్రపాలిత ప్రాంతాలకు నోటీసులు జారీ చేసింది. ప్రైవేట్ పాఠశాలలు కేవలం తమకు కమీషన్లు వచ్చే పబ్లికేషన్లనే విద్యార్థులు కొనాలని బలవంతం చేయడంపై వివరణ కోరింది. జాతీయ స్కూల్ బ్యాగ్ విధానం ప్రకారం.. విద్యార్థులపై పుస్తకాల భారం తగ్గించాలని, అనవసరమైన ప్రైవేట్ పబ్లికేషన్స్ పుస్తకాలను రుద్దకూడదని నిబంధనలు ఉన్నాయి. ఈ నిబంధనలను చాలా పాఠశాలలు తుంగలో తొక్కుతున్నాయని కమిషన్ అభిప్రాయపడింది. ప్రభుత్వం నిర్దేశించిన పాఠ్యపుస్తకాలనే అమలు చేయాలని ఆదేశించింది. స్కూల్ బ్యాగ్ బరువు తగ్గించేలా చర్యలు తీసుకోవాలని సూచించింది. పాఠశాల ఆవరణలోనే లేదా నిర్ణీత దుకాణాల్లోనే పుస్తకాలు కొనాలనే నిబంధనలు పెట్టకూడదని స్పష్టం చేసింది.

**నివేదిక ఇవ్వాలని ఆదేశం..**

ప్రైవేటు పాఠశాలల తీరుపై పూర్తిస్థాయిలో విచారణ జరిపి, తీసుకున్న చర్యలపై నివేదిక అందించాలని రాష్ట్ర ప్రభుత్వాల విద్యాశాఖ కార్యదర్శులను కమిషన్ ఆదేశించింది. విద్యా హక్కు చట్టం, మానవ హక్కుల ఉల్లంఘన జరగకుండా చూడాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉందని గుర్తు చేసింది. తల్లిదండ్రుల జేబులకు చిల్లు పెడుతున్న ఈ బుక్స్ మాఫియాపై ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకుంటుందో వేచి చూడాల్సిందే మరి.

# పెట్రోల్, డీజిల్ ధరలను పెంచబోం..




**ఢిల్లీ :** దేశ వ్యాప్తంగా పెట్రోల్ , డీజిల్ ధరలు పెరగనున్నాయంటూ గత కొద్ది రోజులుగా సోషల్ మీడియా లో వస్తున్న వార్తలపై కేంద్ర పెట్రోలియం, సహజ వాయువు మంత్రిత్వ శాఖ స్పష్టత ఇచ్చింది. ఈ వార్తలను పూర్తిగా ఖండిస్తూ, సామాన్యులపై ఇంధన భారాన్ని మోపే ప్రతిపాదన ఏదీ ప్రభుత్వం వద్ద లేదని స్పష్టం చేసింది. ఇంధన ధరల పెంపుపై వస్తున్న వార్తలు కేవలం పుకార్లు మాత్రమేనని మంత్రిత్వ శాఖ పేర్కొంది. 'పెట్రోల్, డీజిల్ ధరలను పెంచే ఆలోచన గానీ, ప్రతిపాదన గానీ ప్రస్తుతానికి ప్రభుత్వం దగ్గర లేదు. ప్రజలు ఇలాంటి తప్పుడు ప్రచారాలను నమ్మవద్దు' అని అధికారికంగా వెల్లడించింది.


**ఏకైక దేశం భారత్..**

అంతర్జాతీయంగా ముడిచమురు ధరలు విపరీతంగా పెరుగుతున్నప్పటికీ, గత నాలుగేళ్లుగా దేశీయంగా పెట్రోల్, డీజిల్ ధరలను పెంచకుండా నియంత్రించిన ఏకైక దేశం భారత్ అని మంత్రిత్వ శాఖ గర్వంగా ప్రకటించింది. రష్యా-ఉక్రెయిన్ యుద్ధం, ఇతర భౌగోళిక ఉద్రిక్తతల వల్ల ప్రపంచవ్యాప్తంగా ఇంధన ధరలు ఆకాశాన్ని తాకుతున్నా, భారత ప్రభుత్వం పౌరులపై భారం పడకుండా పన్నుల తగ్గింపు, ఇతర చర్యల ద్వారా ధరలను స్థిరంగా ఉంచగలిగిందని ట్వీట్ చేసింది.

**సామాన్యులకు భారీ ఊరట..**

ప్రస్తుతం దేశంలోని వివిధ రాష్ట్రాల్లో ఎన్నికల వాతావరణం నెలకొన్న నేపథ్యంలో, ఇంధన ధరల పెంపు వార్తలు వాహనదారుల్లో ఆందోళన కలిగించాయి. అయితే, కేంద్రం ఇచ్చిన ఈ క్లారిటీతో సామాన్యులకు, రవాణా రంగానికి పెద్ద ఊరట లభించినట్లయింది. భవిష్యత్తులో కూడా అంతర్జాతీయ ఒడిదుడుకుల నుంచి పౌరులను రక్షించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని పెట్రోలియం శాఖ హామీ ఇచ్చింది.

# భాష రాదు.. బాధ చెప్పుకోలేరు



**తాడ్వాయి,ఫ్లాష్ ఇండియా :** వందల మైళ్ల దూరం నుంచి, కన్నవారిని వదిలి, కేవలం పొట్ట చేతపట్టుకొని వలస వచ్చిన ఆ కూలీలకు తెలుగు భాష రాదు. తాము రోజంతా మోసే బస్తాల బరువు తెలుసు కానీ, ఆ బరువు వెనుక తమను ఎంతగా మోసం చేస్తున్నారో గ్రహించే తెలివి లేదు. ఈ నిస్సహాయతనే పెట్టుబడిగా మార్చుకున్న కొందరు అక్రమార్కులు, ఆ శ్రమ-జీవుల కన్నీటి కష్టాన్ని కమిషన్ల రూపంలో జుర్రుకుంటున్నారు. తాడ్వాయి మక్కల కొనుగోలు కేంద్రంలో వెలుగుచూసిన ఈ ఒక్క ఘటనతో జిల్లా వ్యాప్తంగా కొనుగోలు మక్కల, వడ్ల కేంద్రాలు ఏర్పాటు చేసిన వాటి పై కూడా రైతులకు అనుమానాలు రేకెత్తిస్తున్న వ్యవహారం ఇప్పుడు జిల్లావ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది.

**ఒక్కో కేంద్రం.. ఒక్కో మాయాజాలం**

హమాలీలు చేసే పని ఏ సెంటర్‌లో అయినా ఒకటే.. ఎండలో బస్తాలు మోయడం, తూకం వేయడం. కానీ జిల్లావ్యాప్తంగా ఒక్కో కొనుగోలు కేంద్రంలో ఒక్కో రకమైన ధరలు వసూలు చేస్తుండటం గమనార్హం. కొన్ని చోట్ల క్వింటాల్‌కు ఒక రేటు నిర్ణయిస్తే, మరికొన్ని చోట్ల బస్తాకు ఒక రేటు నిర్ణయించి అటు రైతుల నుంచి ముక్కుపిండి వసూలు చేస్తున్నారు. సెంటర్లో ఆరబోసిన ధాన్యాన్ని లోడ్ చేయాలని ఆత్రుతతో గత్యంతరం లేక హమాలీ డబ్బులు సెంటర్ నిర్వాహకులు, కొందరు నాయకులు, కలిసి నిర్ణయించిన రేటుకు రైతులు డబ్బులు ఇస్తున్నారు. అసలు ఈ ధరల వ్యత్యాసం వెనుక ఆంతర్యం ఏమిటి ? రైతుల నుంచి వసూలు చేస్తున్న ఈ సొమ్ములో అసలు కూలీలకు దక్కేది ఎంత ? అనేది ఇప్పుడు ప్రశ్నార్థకంగా మారింది.

**చెమట చుక్కలో తలా పిడికెడు వాటా..**

తమకు రావలసిన కూలీలో సెంటర్ ఇంచార్జీలు, కొంతమంది చోటా మోటా నాయకులు కలిసి కమిషన్ల పేరుతో తలా పిడికెడు చొప్పున కోతలు విధిస్తున్నారు. అన్యాయం జరుగుతుందని తెలిసినా.. ఎవరికి చెప్పుకోవాలో తెలియక, భాష రాక, ఇచ్చిన కాడికే తీసుకొని వారు కన్నీటిని దిగమింగుకుంటు సొంతగూటికి పైన నవ్వుతున్నారు. ఈ దోపిడీ పర్వం పై సాక్షాత్తు అధికార కాంగ్రెస్ పార్టీకి చెందిన ఒక సీనియర్ నాయకుడు వెంకట్రాంరెడ్డి మీడియా సమావేశం ఏర్పాటు చేసి గళమెత్తడం విశేషం. జిల్లాలోని మిగిలిన కేంద్రాల్లో అంతా సజావుగా సాగుతోందని అధికారులు భావిస్తున్నప్పటికీ, అన్ని సెంటర్లు లోతుగా పరిశీలిస్తే హమాలీల పొట్ట కొడుతున్న అక్రమాలు మరెన్నో బయటపడే అవకాశం ఉంది.

**బయటపడ్డది ఒక్కటే.. అంతటా ఇదే తంతేనా ?**

తాడ్వాయిలో బయటపడింది కేవలం ఒక కేంద్రం అక్రమాలే కావచ్చు, కానీ జిల్లాలోని ప్రతి గింజ వెనుక ఒక హమాలీ కష్టం, ఒక కన్నీటి బొట్టు ఉంది. కేవలం తూకాలను చూసి వెళ్లే అధికారులు, ఆ కూలీల చేతికి ఎంత అందుతుందో ఒక్కసారి ఆరా తీయాల్సిన అవసరం ఉంది. పక్క రాష్ట్రాల నుంచి వచ్చిన కూలీలు మన అతిథులు.. వారి శ్రమను దోచుకోవడం మానవత్వానికే మచ్చ. ఇకనైనా జిల్లా యంత్రాంగం స్పందించి, అన్ని కేంద్రాల్లో ఒకే రకమైన హమాలీ చార్జీలు ఉండేలా చూడాలని, దళారుల ప్రమేయం లేకుండా కఠిన చర్యలు తీసుకోవాలని జిల్లా ప్రజలు, రైతులు కోరుతున్నారు.

# తెలంగాణలో అక్షరాస్యత విప్లవం..

**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** మారుతున్న కాలానికి తగినట్లు మారితేనే మనుగడ సాధ్యమవుతుంది.. ఈ క్రమంలోనే విద్యా రంగంలోనూ పలు సంస్కరణలకు ప్రజా ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విద్యాశాఖను స్వయంగా పర్యవేక్షి-స్తున్నారు. పిల్లలంతా బడుల్లో ఉండడమే కాదు పెద్దలు సైతం అక్షరాలు నేర్చుకోవాలని.. ఆధునిక కాలపు అవసరాలకు తగినట్లు తమను తాము మల్చుకోవాలనేది రాష్ట్ర ప్రభుత్వం యోచన. అందుకే వయోజన అక్షరాస్యత పెంపుపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ కనబర-స్తోంది. అదే సమయంలో పాఠశాల విద్యా రంగంపైనా ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. సంపూర్ణ అక్షరాస్యత గల రాష్ట్రంగా తెలంగాణను మార్చాలనే లక్ష్యంతో ప్రజా ప్రభుత్వం ముందుకు వెళ్తున్నది. 45 ఏళ్ల వయసు పైబడిన వారిలో అక్షరాస్యత తక్కువగా ఉండటాన్ని ప్రభుత్వం గుర్తించింది. దీంతో చాలాకాలంగా నిర్లక్ష్యానికి గురైన వయోజనుల విద్యపై ప్రత్యేక దృష్టి సారించింది. ఎక్కడికక్కడ వయోజన విద్య తరగతులు నిర్వహించారు. దీంతో 2025--26 సంవత్సరంలో 6.31 లక్షల మంది పెద్దలు అక్షరాస్యత పరీక్షలకు హాజరయ్యారు. గత ప్రభుత్వ హయాంలో, ముఖ్యంగా 2019 నుంచి 2024 వరకు వయోజన విద్య పెంపు అంశాన్ని పూర్తిగా నిర్లక్ష్యం చేశారు. దీంతో ఆ సమయంలో వయోజన విద్య పూర్తిగా కుంటుబడింది. అందుకు విరుద్ధంగా ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే వయోజన విద్యపై ప్రత్యేక దృష్టి సారించింది. ఫలితంగానే వయోజన విద్యలో పెద్ద ఎత్తున పెరుగుదల నమోదైంది.

**పాఠశాలల్లో కొత్త మార్పులు**

తెలంగాణలోని పాఠశాలల్లో విద్యలో నాణ్యత పెంచేందుకు ప్రజా ప్రభుత్వం నూతన విధానాన్ని తీసుకొచ్చింది. అకడమిక్ ప్యానెల్ ఇన్‌స్పెక్షన్ టీమ్స్ ద్వారా పాఠశాలల్లో బోధన విధానాలను ఉన్నతీకరించింది. ఇది విద్యార్థులకు అత్యాధునిక పద్ధతులలో అభ్యసనలో మెలుకువలు నేర్పించేందుకు ఉపయోగపడింది. ముఖ్యంగా పెద్దపల్లి జిల్లాలో 61 పాఠశాలల్లో ఈ విధానం అమలు చేసి, బోధనలో ఉన్న ఇబ్బందులు, అనుకూలతలను గుర్తించారు. చాలామంది ఉపాధ్యాయులకు మంచి పరిజ్ఞానం ఉన్నప్పటికీ, తరగతుల్లో విద్యార్థుల భాగస్వామ్యం తక్కువగా ఉండడాన్ని ఈ టీమ్స్ గుర్తించాయి. దానిని సరిదిద్ది సమర్థంగా అమలు చేయడంతో మంచి ఫలితాలు తీసుకురావడం సాధ్యమైందని విద్యాశాఖ అధికారులు భావిస్తున్నారు. ప్రజా ప్రభుత్వ చేపట్టిన చర్యల ఫలితంగా తక్కువ సమయంలోనే పాఠశాల విద్యలో మంచి మార్పులు చోటుచేసుకున్నాయి. బోధనా పద్ధతుల్లో వ్యూహాత్మకత 48 శాతం నుంచి 68 శాతానికి పెరిగింది. తరగతి గదుల మెరుగైన నిర్వహణలో 42 శాతం నుంచి 65 శాతానికి, బోధనాభ్యసన సామగ్రి, వనరుల వినియోగం 35 శాతం నుంచి 58 శాతానికి పెరిగింది. ఇవన్నీ మంచి ఫలితాలు వచ్చేందుకు కారణమయ్యాయి.

**ప్రాథమిక విద్యపై ప్రత్యేక దృష్టి**

పాఠశాల విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సూచిస్తున్నారు. ఈ నేపథ్యంలో విద్యార్థులకు ప్రాథమిక దశలోనే అక్షరాలు రాయడం, అంకెలు నేర్చుకోవాలనే ఉద్దేశంతో ప్రభుత్వం ఫౌండేషనల్ లిటరసీ అండ్ న్యూమరసీ(ఎఫ్ఎల్ఎన్)పై ప్రత్యేక శ్రద్ధ పెట్టింది. దీంతో విద్యార్థుల సంఖ్య గణనీయంగా పెరిగింది. 2022-23 విద్యా సంవత్సరం నుంచి 2025-26 వరకు మంచి ఫలితాలు వచ్చాయి. తెలుగులో 9 శాతం నుంచి 35% శాతం వరకు.. ఇంగ్లిష్‌లో 4 శాతం, 29 శాతం.. ఉర్దూలో 19 శాతం నుంచి 40 శాతం వరకు అభ్యసన సామర్థ్యాలు పెరిగాయి. భాషతో పాటు అంకెలు నేర్చుకోవడం.. కూడికలు, తీసివేతలు వంటి గణిత ప్రక్రియల్లోనూ 18 శాతం నుంచి 30 శాతం ఫలితాలు అధికంగా వచ్చాయి.

**సమగ్ర శిక్షా నిధుల వినియోగంలో టాప్..**

సమగ్ర శిక్షా పథకం కింద వచ్చిన నిధులను వినియోగించడంలో తెలంగాణ దేశంలోనే మొదటి స్థానంలో నిలిచింది. 2025--26లో 84 శాతం నిధులు వినియోగించుకొని రాష్ట్రం దేశంలో మొదటి స్థానంలో ఉంది.

ప్రతి రూపాయి విద్య కోసం, విద్యార్థుల కోసం వ్యయం చేయాలనే సంకల్పంతో ప్రభుత్వం ముందుకు సాగుతోంది. విద్యారంగంలో ప్రజా ప్రభుత్వం తీసుకుంటున్న ఈ చర్యలు తెలంగాణను దేశంలో ముందు వరుసలోకి తీసుకెళ్తున్నాయి. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో ప్రభుత్వం అమలు చేస్తున్న సంస్కరణలు విద్యార్థులు, ఉపాధ్యాయులకు విద్యా వ్యవస్థ ప్రగతికి మరింత దోహదపడుతున్నాయి. విద్యా రంగంలో తెలంగాణ ఆదర్శ రాష్ట్రంగా ముందుకు సాగుతోంది.

# పలు డిపోల వద్ద ఉద్రిక్తత

## ఆర్టీసీ జేఏసీ చైర్మన్ ఈదురు వెంకన్న అరెస్టు..



**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** తమ డిమాండ్ల సాధన కోసం ఆర్టీసీ కార్మికులు చేపట్టిన సమ్మె రెండో రోజు కొనసాగుతోంది. ఇవాళ రాష్ట్రవ్యాప్తంగా ఆర్టీసీ డిపోల ఎదుట కార్మికులు ధర్నాలు చేపట్టారు. ఉదయం నుంచే డిపోల ఎదుట బైఠాయించి తమ డిమాండ్లను పరిష్కరించాలని నినాదాలు చేశారు. దీంతో పలు జిల్లాలో ఆర్టీసీ కార్మికులను పోలీసులు ఎక్కడికక్కడ అరెస్టు చేశారు. ఆర్టీసీ కార్మికులకు మద్దతు తెలిపేందుకు వెళ్తున్న జేఏసీ నేతలను సైతం పోలీసులు అడ్డుకుని అరెస్టులు చేశారు. ఈ క్రమంలో హైదరాబాద్‌లోఆర్టీసీ జేఏసీ చైర్మన్ ఈదురు వెంకన్నతో పాటు పలువురు నాయకులను అదుపులోకి తీసుకున్నారు. డిపోల నుంచి బస్సులు బయటకు కదలకుండా కార్మికులు అడ్డుకున్నారు. రెండో రోజు బస్సులు లేకపోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇదే అదునుగా ప్రైవేట్ వాహనదారులు ప్రయాణికుల వద్ద అధిక చార్జీలతో దోపిడీకి పాల్పడుతున్నారు.

**పోలీసుల తీరుపై ఆగ్రహం:**

మరోవైపు జనగామ ఆర్టీసీ డిపో దగ్గర ఆర్టీసీ కార్మికుల ధర్నాను పోలీసులు అడ్డుకున్నారు. ధర్నాకు అనుమతి లేదంటూ టెంట్లు తొలగించారు. దీంతో పోలీసుల తీరుపై ఆర్టీసీ కార్మికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ క్రమంలో అక్కడ ఉద్రిక్తత చోటు చేసుకుంది.

**ఆందోళన పంథా మారుస్తాం: ఈదురు వెంకన్న**

తమ డిమాండ్లపై ప్రభుత్వం సానుకూలంగా స్పందించకపోతే ఆందోళనను మరింత ఉధృతం చేస్తామని ఆర్టీసీ కార్మిక జేఏసీ నేతలు హెచ్చరిస్తున్నారు. మా డిమాండ్లపై ప్రభుత్వం సాగుకూలంగా స్పందించాలని జేఏసీ చైర్మన్ ఈదురు వెంకన్న అన్నారు. ప్రభుత్వం ప్రత్యామ్నాయాల వైపు ఆలోచన చేస్తే తాము ఆందోళన పంథాను మారుస్తామని హెచ్చరించారు. తాజాగా ఓ న్యూస్ చానల్ తో మాట్లాడిన ఆయన నోటీసులు ఇచ్చిన 14 రోజుల తర్వాతే సమ్మెకు దిగామన్నారు. ప్రభుత్వం అర్ధరాత్రి పిలిచినా చర్చలకు వెళ్లేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. ప్రభుత్వం చేసిన అలసత్వంతోనే సమ్మెకు దిగాల్సి వచ్చిందన్నారు.




# ప్రేమ పేరుతో చెల్లికి బెదిరింపులు

**డోర్నకల్ (కురవి),ఫ్లాష్ ఇండియా :** ఓ మైనర్ బాలిక పురుగు మందు సేవించి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన కురవిలో కలకలం రేపింది. ఎస్సై గంగ్రతి సతీష్ కథనం ప్రకారం.. బాలికకు వరుసకు అన్న అయిన కిరణ్ వివాహమై పిల్లలు ఉన్న విషయాన్ని దాచి ఇన్‌స్టాగ్రామ్ ఐడి ద్వారా మల్లారెడ్డి కాలేజీ విద్యార్థినిగా పరిచయం పెంచుకొని ప్రేమ పేరుతో మోసం చేసి, బెదిరింపులకు పాల్పడడంతో మైనర్ బాలిక ఆత్మహత్యకు పాల్పడినట్లు ఆయన తెలిపారు. గతంలో న్యాయవాదిగా పోక్సో నిందితునికి బెయిల్ ఇప్పించుటకు రూ.12 లక్షలు తీసుకున్నట్లు తెలిపారు. గోల్డ్ చైన్ స్నాచింగ్ కేసులో ప్రమేయం ఉన్నట్లు తెలియజేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సతీష్ తెలిపారు.

# గోవా మద్యం బాటిళ్ల పట్టివేత



**కృష్ణ,ఫ్లాష్ ఇండియా :** రాష్ట్ర సరిహద్దుల్లో ఉన్న కృష్ణ చెక్ పోస్ట్ వద్ద వాహనాలలో అక్రమంగా తరలిస్తున్న గోవా మద్యాన్ని గురువారం అబ్కారీ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కొంతమంది యువకులు జల్సా కోసం గోవాకి వెళ్లి తిరిగి వస్తుండగా అనుమానం ఉన్న వాహనాలు తనిఖీ చేశామన్నారు. యన్‌డీపీఎల్ మద్యం 9 బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. దీని మొత్తం పరిమాణం(08) లీటర్ల అనంతరం ప్రత్యేక నివేదిక కింద కేసు నమోదు చేసి నారాయణ పేట ఎస్‌హెచ్‌ఓకు అప్పగించినట్లు తెలిపారు. ఈ తనిఖీలో సిబ్బంది శ్రవణ్ కుమార్ సీఐ కానిస్టేబుల్ జనార్ధన్, మాన్యం తదితరులు పాల్గొన్నారు.

# బీఆర్ఎస్, కాంగ్రెస్ బొమ్మ బొరుసు లాంటి పార్టీలు



**దుబ్బాక,ఫ్లాష్ ఇండియా :** బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలు బొమ్మ బొరుసులాంటి పార్టీలని, ఆ రెండు పార్టీల బంధం వీణా-వాణిలా ఉందని మెదక్ ఎంపీ మాధవనేని రఘునందన్ రావు ఎద్దేవా చేశారు. గురువారం దుబ్బాకలోని బస్సు డిపో ముందు ఆర్టీసీ కార్మికులు తమ న్యాయబద్ధమైన సమస్యల పరిష్కారం కోసం రెండో రోజు నిర్వహిస్తున్న సమ్మెకు ఆయన మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం పోలీస్ యంత్రాంగాన్ని అడ్డుపెట్టి ఆర్టీసీ కార్మికుల సమ్మెను విచ్ఛిన్నం చేయాలని కుట్ర చేస్తున్నదని ఆరోపించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఆర్టీసీ కార్మికులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తిస్తామని జీఓ జారీ చేసి, కమిటీ ఏర్పాటు చేసి చివరకు ఆ విషయంలో చర్యలు తీసుకోకుండా అధికారంలో నుంచి దిగిపోయిందని విమర్శించారు. అదే విధంగా, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండేళ్లు గడిచినా, అప్పటి పీసీసీ అధ్యక్షుడిగా ఉన్న రేవంత్ రెడ్డి ఆర్టీసీ కార్మికులకు ఇచ్చిన హామీలను నెరవేర్చలేదని అన్నారు. సమ్మె చేస్తున్న కార్మికులను అడ్డుకునేందుకు టెంట్లు వేయకుండా, మైకులు వినియోగించకుండా, కార్మిక సంఘాల ఎన్నికలు నిర్వహించకుండా పోలీసులు వ్యవహరిస్తున్న తీరును ఆయన తప్పుపట్టారు. కేసీఆర్ పాలనలో ఎలా వ్యవహరించారో, నేడు సీఎం రేవంత్ రెడ్డి కూడా అదే విధంగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలు ఒకటేనని, వారి మధ్య బంధం బలంగా ఉందని వ్యాఖ్యానించారు. రాష్ట్రంలోని ఆర్టీసీ కార్మికులను రోడ్డుపైకి తీసుకురావడం దురదృష్టకరమని పేర్కొన్నారు. పీసీసీ అధ్యక్షునిగా రేవంత్ రెడ్డి చేసిన హామీలను గుర్తుచేసుకుని, ఆర్టీసీ కార్మికుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని, సమ్మెకు శాశ్వత ముగింపు పలకాలని, కార్మిక సంఘాల ఎన్నికలు నిర్వహించాలని భారతీయ జనతా పార్టీ తరపున డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అంబటి బాలేష్ గౌడ్, మున్సిపల్ పట్టణ అధ్యక్షుడు దోరగల్ల శ్రీకాంత్ యాదవ్, కౌన్సిలర్లు మెరుపుల సాయికుమార్ గౌడ్, కనకరాజు, మండల అధ్యక్షుడు మంద అనిల్ రెడ్డి, అక్బర్‌పేట భూంపల్లి మండల అధ్యక్షుడు దేవా సుధాకర్ రెడ్డి, సుంకోజి ప్రవీణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



# ఆర్టీసీ అప్పుల కుప్పగా మారడానికి బీఆర్ఎస్ ప్రభుత్వమే కారణం

**హిమాయత్ నగర్,ఫ్లాష్ ఇండియా :** ఆర్టీసీ సమ్మెకు మద్దతు ఇస్తూనే రాష్ట్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకొస్తామని కాంగ్రెస్ కార్మిక అనుబంధ సంస్థ ఐఎన్టీయూసీ టీజీఎస్ఆర్టీసీ స్టాఫ్ అండ్ వర్కర్స్ యూనియన్ వెల్లడించింది. ఈ మేరకు గురువారం బషీర్ బాగ్ ప్రెస్ క్లబ్ ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో యూనియన్ జనరల్ సెక్రటరీ జక్కుల మల్లేశంతో కలిసి కన్వీనర్ మొగుళ్ల రాజిరెడ్డి మాట్లాడుతూ.. గత ప్రభుత్వం 10 ఏళ్లు ఆర్టీసీ నిర్వీర్యం చేసిందని విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం ఒక్కొక్క సమస్యను పరిష్కరించుకుంటూ ముందుకు పోతుందన్నారు. గత ప్రభుత్వం కార్మికుల పీఎఫ్ బకాయిలు చెల్లించకుండా ఇబ్బందులు పెట్టిందని ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే పీఎఫ్ బకాయిలు 600 కోట్లు నిధులు విడుదల చేసిందని గుర్తు చేశారు. అలాగే డీఏలను కూడా ఇచ్చిందన్నారు. ఆర్టీసీ సంస్థ అప్పుల కుప్పగా మారడానికి గత బీఆర్ఎస్ ప్రభుత్వమే కారణమని ఆరోపించారు. మాజీ మంత్రి హరీశ్ రావు ఇప్పుడు కార్మికుల పక్షాన ఉన్నామంటూ కుట్రలు చేస్తున్నారని విమర్శించారు. బీఆర్ఎస్ హయాంలో 55 రోజులు సమ్మె చేస్తే.. ప్రభుత్వంలో విలీనం చేస్తామని నమ్మించి మోసం చేశారని మండిపడ్డారు. రెండు రోజులుగా జరుగుతున్న ఆర్టీసీ సమ్మెకు మద్దతు ఇస్తూనే రాష్ట్ర ప్రభుత్వం ఒత్తిడి తీసుకువస్తామని తెలిపారు. జేఏసీ పెట్టిన 32 డిమాండ్లలో 29 డిమాండ్ ల పట్ల ప్రభుత్వం సానుకూలంగా ఉందన్నారు. కార్మికుల పక్షాన ప్రభుత్వంతో చర్చలు సాగుతున్నాయని, రెండు రోజుల్లో సమ్మెకు పరిష్కారం లభిస్తుందని రాజిరెడ్డి ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో ఆర్డీ చంద్రశేఖర్ పాల్గొన్నారు.

# డీసీపీకే పాచిపోయిన కీమా !

**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** హైదరాబాద్ మహానగరంలో కల్తీ ఆహారం, కుళ్లిపోయిన మాంసం విక్రయాలు పరాకాష్టకు చేరుకున్నాయి. సామాన్యుల ఆరోగ్యాన్ని పక్కనబెట్టి, కాసుల కక్కుర్తితో ఏకంగా ఓ ఉన్నతాధికారికే పాచిపోయిన ఆహారాన్ని వడ్డించి రెస్టారెంట్ యాజమాన్యం బరితెగించింది. జూబ్లీహిల్స్‌లోని ఒక ప్రముఖ రెస్టారెంట్‌లో జరిగిన ఈ ఘటన ఇప్పుడు నగరంలో సంచలనం సృష్టిస్తోంది. వివరాల్లోకి వెళితే.. పోలీస్ డిప్యూటీ కమిషనర్ ముత్యం రెడ్డి ఆదివారం రాత్రి 'జొమాటో' నుంచి జూబ్లీహిల్స్‌లోని ప్రఖ్యాత 'తెలుగు మీడియం' రెస్టారెంట్ నుంచి మటన్ కీమా ఆర్డర్ చేశారు. పార్శిల్ ఇంటికి వచ్చిన తర్వాత దానిని విప్పగానే విపరీతమైన దుర్వాసన వచ్చింది. అది పూర్తిగా పాచిపోయిన కీమా అని అర్థం కావడంతో డీసీపీ వెంటనే అప్రమత్తమయ్యారు.

**రెస్టారెంట్‌పై మెరుపు దాడులు..**

ఈ ఘటనపై డీసీపీ ముత్యం రెడ్డి తక్షణమే పోలీసులు, ఫుడ్ సేఫ్టీ అధికారులకు సమాచారం అందజేశారు. కేసు నమోదు చేసిన అధికారులు వెంటనే సదరు రెస్టారెంట్‌పై దాడులు నిర్వహించారు. తనిఖీల్లో విస్తుపోయే నిజాలు బయటపడ్డాయి. హోటల్ వంటగదిలో నిల్వ ఉంచిన పాచిపోయిన మటన్ బయటపడింది.

ఆ పాచిపోయిన మాంసంతోనే కీమా తయారు చేసి కస్టమర్లకు సరఫరా చేస్తున్నట్లుగా అధికారులు నిర్ధారించారు. గడిచిన నెల రోజుల్లోనే జంట నగరాల్లోని వివిధ ప్రాంతాల్లో దాడులు నిర్వహించిన అధికారులు సుమారు 129 టన్నుల కుళ్లిపోయిన మాంసాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఇంత జరుగుతున్నా హోటల్ యాజమాన్యాల తీరులో మార్పు రావడం లేదు. కేవలం మాంసమే కాకుండా పాలు, వెన్న, మసాలాలు, నూనెలు ఇలా ప్రతి ఆహార పదార్థం కల్తీకి నిలయంగా మారడం నగరవాసులను తీవ్ర ఆందోళనకు గురిచేస్తోంది.

# హోటళ్లలో యదేచ్ఛగా టెస్టింగ్ సాల్ట్ వినియోగం

**జోగులాంబ,ఫ్లాష్ ఇండియా :** జోగులాంబ గద్వాల జిల్లాలో పలు హోటళ్లు, ఫాస్ట్ ఫుడ్ సెంటర్లలో టెస్టింగ్ సాల్ట్ (మోనోసోడియం గ్లూటామేట్ – MSG)ను యద్దేచ్ఛగా వినియోగిస్తూ ప్రజల అనారోగ్యానికి కారణమవుతున్నట్లు సమాచారం. వంటకాల రుచిని పెంచేందుకు కొందరు వ్యాపారులు అధిక మోతాదులో టెస్టింగ్ సాల్ట్ వినియోగిస్తున్నట్లు తెలుస్తోంది. ఈ పరిస్థితి వినియోగదారుల ఆరోగ్యం పై ప్రతికూల ప్రభావం చూపే అవకాశం ఉందని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. ప్రస్తుతం చౌమిన్, ఫ్రైడ్ రైస్, నూడుల్స్, మాంచూరియా, సూప్స్ వంటి వంటకాలలో టెస్టింగ్ సాల్ట్ వినియోగం జిల్లాలోని పలు రెస్టారెంట్లు, ఫాస్ట్ ఫుడ్ సెంటర్లలో విపరీతంగా పెరిగినట్లు తెలుస్తోంది. ముఖ్యంగా చిన్నపిల్లలు, యువత ఈ ఆహారాలను ఎక్కువగా తీసుకోవడం వల్ల ఆరోగ్య సమస్యలు తలెత్తే ప్రమాదం ఉందని వైద్యులు పేర్కొంటున్నారు. టెస్టింగ్ సాల్ట్‌ను అధికంగా తీసుకోవడం వల్ల తలనొప్పి, రక్తపోటు పెరగడం, గుండె సంబంధిత సమస్యలు, నిద్రలేమి, అలర్జీ వంటి సమస్యలు వచ్చే అవకాశముందని ప్రభుత్వ వైద్యురాలు డాక్టర్ భవాని తెలిపారు. ముఖ్యంగా పిల్లలు, వృద్ధులు దీనికి ఎక్కువగా ప్రభావితమయ్యే అవకాశం ఉందని ఆమె పేర్కొన్నారు. జిల్లాలో అనేక కిరాణా దుకాణాల్లో టెస్టింగ్ సాల్ట్ విరివిగా లభిస్తోంది. తక్కువ ధరకు లభించడం వల్ల కొందరు ఇంటి వంటల్లో కూడా దీన్ని వినియోగిస్తున్నట్లు తెలుస్తోంది. అయితే దీని వినియోగంపై సరైన అవగాహన లేకపోవడం వల్ల టెస్టింగ్ సాల్ట్ వంటగదిలోకి ప్రవేశించింది. జిల్లాలోని ఆహార భద్రతా శాఖ అధికారులు హోటళ్లలో వాడుతున్న టెస్టింగ్ సాల్ట్‌పై క్రమం తప్పకుండా తనిఖీలు నిర్వహించాలని ప్రజలు కోరుతున్నారు. అనుమతికి మించిన మోతాదులో టెస్టింగ్ సాల్ట్ వినియోగిస్తున్న హోటళ్లపై కఠిన చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. ప్రజల్లో టెస్టింగ్ సాల్ట్ వినియోగం వల్ల కలిగే ప్రమాదాల పై అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం అత్యవసరమని నిపుణులు సూచిస్తున్నారు. ఆరోగ్య పరిరక్షణ కోసం బయట ఆహారాన్ని పరిమితంగా తీసుకోవాలని, పిల్లలకు ఫాస్ట్ ఫుడ్ తినడం తగ్గించాలని సూచిస్తున్నారు.

**టెస్టింగ్ సాల్ట్ వాడే రెస్టారెంట్లపై కేసులు నమోదు చేస్తాం.. ఫుడ్ ఇన్‌స్పెక్టర్ కరుణాకర్**

జిల్లాలో ఎక్కడైనా రెస్టారెంట్ లేదా ఫాస్ట్ ఫుడ్ సెంటర్‌లో టెస్టింగ్ సాల్ట్ వాడుతున్నట్లు గుర్తిస్తే, వారి పై కేసులు నమోదు చేస్తామని తెలిపారు. అలాగే కిరాణా దుకాణాల్లో టెస్టింగ్ సాల్ట్ అమ్మకాలు జరుగుతున్నా చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

# ఘనంగా శ్రీ శ్రీ శ్రీ సగర భగీరథ మహర్షి జయంతి వేడుకలు



**ఎల్బీనగర్,ఫ్లాష్ ఇండియా ప్రతినిధి:**
హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో ఘనంగా శ్రీశ్రీశ్రీ సగర భగీరథ మహర్షి జయంతి వేడుకలు వేడుకల్లో పాల్గొన్న మంత్రులు పొన్నం ప్రభాకర్, వాకిటి శ్రీహరి, ఎంపీ ఈటెల రాజేందర్, బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షులు జాజుల శ్రీనివాస్ గౌడ్, సగర సంఘం నాయకులు ఉప్పరి శేఖర్, ఆస్కానీ మారుతిసాగర్ తదితరులు

**భగీరథ జయంతి వేడుకల్లో మంత్రి వాకిటి శ్రీహరి కామెంట్స్...**

ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనారిటీల సంక్షేమం కోసం పాటుపడుతున్నాం సగరులు సమస్యల పరిష్కారం కోసం ముందుంటాం కలియుగంలో కూడా భగీరథుని ఆదర్శంగా తీసుకోని ముందుకు సాగుతున్నాం శివుని తలలో ఉండే గంగను దివి నుంచి భువికి తీసుకువచ్చిన మహానీయులు భగీరథుడు భగీరథ ప్రయత్నం అంటూ నేటి సమాజం ముందుకు సాగుతుంది బసవేశ్వరుడు పనిలోనే దేవుడు ఉన్నారని చెబితే..పని సాధించేవరకు ప్రయత్నం చేయాలని భగీరథుడు చెప్పాడు. అసాధ్యాన్ని సుసాధ్యం చేయడమే నేటి యువత ప్రేరణగా తీసుకోవాలి. భగీరథున్ని దిక్సూచిగా తీసుకొని యువత ముందుకుసాగాలని పిలుపునిస్తున్నాం

# మరో ఆర్టీసీ కార్మికుడి ఆత్మహత్యాయత్నం



**నల్లగొండ,ఫ్లాష్ ఇండియా :** నల్లగొండ జిల్లా కేంద్రంలో ఆర్టీసీ కార్మికుల సమ్మె ఉద్రిక్తతకు దారి తీసింది. సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం స్పందించడం లేదని కార్మికులు ఆవేదన చెందుతున్నారు. ఇంతలోనే ఆర్టీసీ డ్రైవర్ రావుల వెంకన్న ఆవేదనతో ఆత్మహత్యాయత్నం చేసుకున్నారు. ఒంటిపై పెట్రోల్ పోసుకునే ప్రయత్నం చేశారు. వెంటనే అప్రమత్తమైన తోటి కార్మికులు పోలీసులు కార్మికుని అడ్డుకొని పెద్ద ప్రమాదం నుంచి తప్పించారు. కార్మికున్ని అక్కడి నుంచి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కార్మికుడి ఆత్మహత్యాయత్నం తెలుసుకున్న కార్మికులు బస్టాండ్ కు భారీగా చేరుకున్నారు. తమ సమస్యలను పరిష్కారం చేసుకునేంత వరకు సమ్మె కొనసాగిస్తామని, డిమాండ్లు నెరవేర్చాలని డిమాండ్ చేస్తూ సమ్మె కొనసాగించారు.

# డంపింగ్ యార్డ్ వద్దు.. వల్లకాడు వద్దు...

**హుజూరాబాద్,ఫ్లాష్ ఇండియా :** "ప్రజల ప్రాణాలతో చెలగాటమాడితే ఖబడ్దార్.. హుజూరాబాద్‌ను వల్లకాడుగా మారుస్తామంటే చూస్తూ ఊరుకోం" అంటూ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి కాంగ్రెస్ ప్రభుత్వంపై విరుచుకుపడ్డారు. హుజూరాబాద్ మండలం సిరిసపల్లి శివారులో ప్రభుత్వం మొండిగా ఏర్పాటు చేయ తలపెట్టిన 'వేస్ట్ ఎనర్జీ ప్లాంట్' (డంపింగ్ యార్డ్)కు వ్యతిరేకంగా ఎమ్మెల్యే చేపట్టిన పాదయాత్ర ప్రజా క్షేత్రంలో ఉప్పెనెల ఎగిసిపడింది.

**భక్తితో ప్రారంభం..**

పోతిరెడ్డిపేటలో పోచమ్మ దేవతకు ప్రత్యేక పూజలు నిర్వహించి కౌశిక్ రెడ్డి ఈ పాదయాత్రను ప్రారంభించారు. పోతిరెడ్డి పేటలో ప్రారంభమైన పాదయాత్ర వెంకట్రావుపల్లి, సిరిసపల్లి మీదుగా హుజురాబాద్ కు చేరుకుంది. పాదయాత్రలో అడుగు ముందుకు పడగానే.. జనసందోహం వెల్లువెత్తింది. డప్పు చప్పుళ్లు, ప్రభుత్వ వ్యతిరేక, డంపింగ్ యార్డ్ వ్యతిరేక నినాదాలతో ఆ ప్రాంతమంతా హోరెత్తింది. వందలాది మంది మహిళలు మంగళహారతులతో ఎమ్మెల్యేకు బ్రహ్మరథం పట్టారు. రైతులు, ప్రజాప్రతినిధులు, యువత కదం తొక్కడంతో పాదయాత్ర ఒక ప్రజా ఉద్యమాన్ని తలపించింది.

**20 కిలోమీటర్ల మేర వల్లకాడేనా...**

ఈ సందర్భంగా వివిధ గ్రామాల్లో ఏర్పాటు చేసిన సభల్లో ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి ఘాటుగా స్పందించారు. ఆయన మాటల్లో...ఈ డంపింగ్ యార్డ్ వస్తే పరిసరాల్లోని 20 కిలోమీటర్ల మేర గ్రామాలు కలుషితమై ప్రజలు రోగాల బారిన పడతారు. ఇది ఎనర్జీ ప్లాంట్ కాదు.. ప్రజల పాలిట 'మృత్యు ప్లాంట్'. "ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి .. నా మీద కోపం ఉంటే కేసులు పెట్టుకోండి, జైల్లో వేయండి.. కానీ నా నియోజకవర్గ ప్రజల ఆరోగ్యంతో ఆటలాడకండి" అంటూ విజ్ఞప్తి చేశారు. గత 30 రోజులుగా ప్రజలు దీక్షలు చేస్తున్న ప్రభుత్వానికి చీమ కుట్టినట్టయినా లేకపోవడం దుర్మార్గం అన్నారు.

**హెచ్చరిక.. పరిణామాలు తీవ్రంగా ఉంటాయి...**


ప్రభుత్వం ఇప్పటికైనా మొండి పంతం వీడకపోతే జరగబోయే తీవ్ర పరిణామాలకు రేవంత్ సర్కారే పూర్తి బాధ్యత వహించాల్సి ఉంటుందని కౌశిక్ రెడ్డి హెచ్చరించారు. ఈ పాదయాత్ర పోతిరెడ్డిపేట నుంచి వెంకట్రావుపల్లి, సిరిసపల్లి మీదుగా హుజూరాబాద్‌కు చేరుకుంది. దారిపొడవునా హనుమాన్ దేవాలయం, శివాలయాల్లో పూజలు నిర్వహించిన ఎమ్మెల్యేకు ప్రజలు నీరాజనాలు పలికారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్లు, సర్పంచులు, డంపింగ్ యార్డ్ వ్యతిరేక అఖిలపక్ష కమిటీ నాయకులు, పెద్ద సంఖ్యలో రైతులు, మహిళలు పాల్గొని ప్లాంట్‌ను అడ్డుకుని తీరుతామని ప్రతిన బూనారు.

# వరంగల్ విద్యాశాఖ కార్యాలయంలో తనిఖీలు



**వరంగల్,ఫ్లాష్ ఇండియా :** వరంగల్ విద్యాశాఖ కార్యాలయంలో విజిలెన్స్ అండ్ ఎన్ ఫోర్స్ మెంట్ అధికారులు తనిఖీలు చేపట్టారు. కార్యాలయం పరిధిలో జరిగే ఫైళ్లను పరిశీలిస్తున్నారు. పాఠశాలల రిజిస్ట్రేషన్, రెన్యూవల్, ఉద్యోగుల సర్వీసు ఫైళ్లతో పాటు పెండింగ్ ఫైళ్లను పరిశీలిస్తున్నారు. అన్ని విషయాలపై అధికారుల ద్వారా సమాచారాన్ని సేకరిస్తున్నారు. వరంగల్ విద్యాశాఖ అధికారి కార్యాలయంలో గురువారం విజిలెన్స్ అండ్ ఎన్ ఫోర్స్ మెంట్ అధికారుల ఆధ్వర్యంలో తనిఖీలు చేపట్టారు. విజిలెన్స్ డీఎస్పీ చిన్న మల్లయ్య ఆధ్వర్యంలో ఈ తనిఖీలు చేశారు. తమకు అందిన ఉన్నతాధికారుల ఆదేశాలకు అనుగుణంగా విజిలెన్స్ అధికారులు ఉదయమే కార్యాలయానికి చేరుకున్నారు. విద్యాశాఖ కార్యాలయంలో రోజువారి కార్యక్రమాలను పరిశీలించారు. ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల ఫైళ్లు, ఉద్యోగుల ఫైళ్లు, పెండింగ్ బిల్లులు, చెల్లింపులపై వివరాలు సేకరించారు. విద్యాశాఖ పరిధిలో జరిగే కార్యక్రమాలను పరిశీలించారు. ఆయా సర్వీసులకు అనుగుణంగా ఫైళ్లు క్లియర్ చేశారా, పెండింగ్ ఉన్నాయా అనే అంశాలను పరిశీలించారు. పూర్తి నివేదిక సిద్ధం చేస్తున్నారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు విద్యాశాఖ కార్యాలయంలో తనిఖీలు చేపట్టామని డీఎస్పీ మల్లయ్య తెలిపారు. వివరాలను నివేదిక రూపంలో ఉన్నతాధికారులకు అందిస్తామని తెలిపారు.

# గద్వాల మున్సిపాలిటీలో హై టెన్షన్..



**గద్వాల,ఫ్లాష్ ఇండియా :** జోగులాంబ గద్వాల జిల్లా కేంద్రంలోని మున్సిపల్ కార్యాలయం వేదికగా రాజకీయ రచ్చ మొదలైంది. మున్సిపల్ కో-ఆప్షన్ సభ్యుల ఎన్నిక నామినేషన్ల పర్వంలో అధికార యంత్రాంగం తీరుపై బీఆర్ఎస్ కౌన్సిలర్లు భగ్గుమన్నారు. నామినేషన్లు స్వీకరించాల్సిన అధికారులే కనిపించకపోవడంతో ఆగ్రహించిన కౌన్సిలర్లు నేరుగా మున్సిపల్ కమిషనర్ చాంబర్‌ను ముట్టడించి నిరసనకు దిగారు.

**అసలేం జరిగిందంటే..**

గద్వాల మున్సిపల్ కో-ఆప్షన్ ఎన్నికలకు సంబంధించి ఈరోజు నామినేషన్ల దాఖలుకు చివరి గడువు. దీంతో బీఆర్ఎస్ పార్టీ తరపున పోటీ చేసే సభ్యులను వెంటబెట్టుకొని కౌన్సిలర్లు మున్సిపాలిటీకి చేరుకున్నారు. తీరా అక్కడికి వెళ్లేసరికి నామినేషన్లు స్వీకరించేందుకు అధికారులు ఎవరూ అందుబాటులో లేకపోవడం ఉద్రిక్తతకు దారితీసింది.

**నిరసన వెనుక అసలు కారణం..**

మున్సిపల్ కమిషనర్ తన చాంబర్‌లో లేకపోవడం, సంబంధిత సిబ్బంది కూడా పత్తా లేకపోవడంతో బీఆర్ఎస్ కౌన్సిలర్లు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. కావాలనే తమ సభ్యుల నామినేషన్లను అడ్డుకునేందుకు కుట్ర జరుగుతోందని ఆరోపిస్తూ కమిషనర్ చాంబర్ లోపలే బైఠాయించి నిరసన చేపట్టారు. "సమయం ముగిసిపోతున్న అధికారులు ఎందుకు రావడం లేదు?" అంటూ అధికారుల తీరుపై మండిపడ్డారు. చివరి నిమిషం వరకు అధికారుల కోసం నిరీక్షించిన ఫలితం లేకపోవడంతో మున్సిపల్ కార్యాలయ ఆవరణలో ఉద్రిక్త వాతావరణం నెలకొంది. ఈ పరిణామం గద్వాల రాజకీయాల్లో చర్చనీయాంశంగా మారింది.




# ప్రేమ పేరుతో మోసం.. బాలుడి పై పోక్సో కేసు

**వనస్థలిపురం,ఫ్లాష్ ఇండియా :** ప్రేమ పేరుతో మోసం చేసిన మైనర్ బాలుడి పై పోక్సో కేసు నమోదు అయింది. ఈ ఘటన వనస్థలిపురం పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ రవిబాబు తెలిపిన వివరాల ప్రకారం.. నల్లగొండ జిల్లాకు చెందిన మైనర్ బాలుడు వనస్థలిపురం నివసిస్తున్న బీహార్ కి చెందిన ఓ బాలికను ప్రేమతో వంచించి మోసం చేసినట్టు ఫిర్యాదు అందింది. ఈ ఘటన పై కేసు నమోదు చేసిన పోలీసులు నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. గురువారం కోర్టులో హాజరు పరిచారు. అనంతరం జువైనల్ హోంకి తరలించారు. కేసు దర్యాప్తు కొనసాగుతోందని సీఐ తెలిపారు.

# భట్టు విజయలక్ష్మి కుటుంబాన్ని పరామర్శించిన మంత్రి



**పాల్వంచ,ఫ్లాష్ ఇండియా :** కొత్తగూడెం పట్టణ పాలక సంస్థ పరిధిలోని 34వ విభాగ కార్పొరేటర్ భట్టు విజయలక్ష్మి, భట్టు లక్ష్మణ్ నాయక్‌ల కుమారుడు అఖిల్ నందన్ ఇటీవల జరిగిన రహదారి ప్రమాదంలో మరణించడం తీవ్ర విషాదాన్ని కలిగించింది. ఈ నేపథ్యంలో గురువారం రాష్ట్ర ఆదాయ, గృహ నిర్మాణ శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి కరకవాగులోని వారి నివాసానికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ప్రమాదానికి సంబంధించిన వివరాలు అడిగి తెలుసుకున్న మంత్రి, మృతుడు అఖిల్ నందన్ చిత్రపటానికి పూలమాల అర్పించి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేసి ధైర్యంగా ఉండాలని సూచించారు. ఈ సందర్భంగా జిల్లా కాంగ్రెస్ అధ్యక్షురాలు తోట దేవి ప్రసన్న, రాష్ట్ర మార్క్‌ఫెడ్ మాజీ డైరెక్టర్, జిల్లా సహకార మార్కెటింగ్ సంఘం మాజీ అధ్యక్షుడు కొత్వాల శ్రీనివాసరావు, డిప్యూటీ మేయర్ సిరిపురపు లలిత కుమారి, పలువురు కార్పొరేటర్లు, మాజీ మండల పరిషత్ భూసంఘ సభ్యులు యర్రంశెట్టి ముత్తయ్య, బరిపటి వాసుదేవరావు, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కోండం వెంకన్న గౌడ్, కాంగ్రెస్ నాయకులు మహీపతి రామలింగం, పి నరహరి, వై వెంకటేశ్వర్లు, చింతా నాగరాజు, ఉండేటి శాంతి వర్ధన్, ధర్మసోత్ ఉపేందర్, అశోక్, ఉండేటి ఏసుపాదం తదితరులు పాల్గొన్నారు.





# రోహిత్, ధోనీ ఆడతారా?

ఐపీఎల్ 2026లో భాగంగా ఈరోజు ముంబై ఇండియన్స్, చెన్నై సూపర్ కింగ్స్ మధ్య మ్యాచ్ జరగనుంది. వాంఖడే మైదానంలో ఈరోజు రాత్రి 7.30కు మ్యాచ్ ఆరంభం కానుంది. ఈ కీలక మ్యాచ్‌లో దిగ్గజాలు ఎంఎస్ ధోనీ, రోహిత్ శర్మలు ఆడుతారో లేదో అన్న అనిశ్చితి నెలకొంది. అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురు చూస్తున్న ఈ మ్యాచ్‌కు ముందు ఇద్దరు స్టార్ ప్లేయర్ల అందుబాటుపై ఓ కీలక అప్‌డేట్ బయటకు వచ్చింది.ముంబై ఇండియన్స్ మీడియా మేనేజర్ మాట్లాడుతూ.. రోహిత్ శర్మ ఆడతాడా లేదా అనే విషయంపై తుది నిర్ణయం ఇంకా తీసుకోలేదని చెప్పాడు. టాస్‌కు ముందు నిర్ణయం తీసుకుంటామని వెల్లడించారు. రోహిత్ ఇప్పటికే మ్యాచ్ ఫిట్‌నెస్ సాధించాడని తెలుస్తోంది. మరోసారి అతడి ఫిట్‌నెస్ పరిస్థితిని అంచనా వేసిన తర్వాతే ఈ నిర్ణయం తీసుకోనున్నారు. బెంగళూరుతో జరిగిన మ్యాచ్‌లో రోహిత్ గాయపడిన పడిన విషయం తెలిసిందే. ఈ సీజన్‌లో రోహిత్ 78, 35, 5, 19 పరుగులు చేశాడు.ఎంఎస్ ధోనీ ఆడే విషయంపై ఇంకా స్పష్టత లేదు. సీఎస్‌కే బౌలింగ్ కోచ్ ఎరిక్ సిమన్స్ మాట్లాడుతూ.. ధోనీ స్వయంగా, టీమ్ మెడికల్ సిబ్బంది కలిసి ఈరోజు తుది నిర్ణయం తీసుకుంటారని తెలిపారు. ధోనీ పూర్తిగా ఫిట్‌గా ఉంటేనే మైదానంలోకి దిగుతాడని ఆయన పేర్కొన్నారు. ఈ సీజన్‌లో ధోనీ ఇంకా ఒక్క మ్యాచ్ కూడా ఆడని విషయం తెలిసిందే. రోహిత్, ధోనీ ఇద్దరూ ఈరోజు మ్యాచ్‌లో ఆడతారా లేదా అన్నది టాస్ సమయానికే క్లారిటీ వచ్చే అవకాశం ఉంది. ఇద్దరు లెజెండ్స్ మైదానంలోకి దిగుతారని అభిమానులు ఆశిస్తున్నారు.

# మొన్ననే ఎంట్రీ ఇచ్చి..





ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్)లో ప్రతి జట్టుకు సొంత మైదానం ఉంటుందన్న విషయం తెలిసిందే. ప్రతి టీమ్ లీగ్ దశలో 7 మ్యాచ్‌లను హోమ్ గ్రౌండ్‌లో ఆడుతుంది. సాధారణంగా హోమ్ గ్రౌండ్ అంటే ఏ జట్టుకైనా అదనపు బలం. అందుకే హోమ్ అవేలో పరాజయాలు చవిచూసినా.. హోమ్ గ్రౌండ్‌లో రెచ్చి పోతుంటాయి. అయితే లక్నో సూపర్ జెయింట్స్‌కు మాత్రం సొంత మైదానం బలహీనతగా మారింది. వరుస పరాజయాలు చవిచూస్తున్న లక్నో.. ఓ చెత్త రికార్డును ఖాతాలో వేసుకుంది.హోమ్ గ్రౌండ్‌లో అత్యధికసార్లు వరుస పరాజయాలు చవిచూసిన జట్టుగా లక్నో సూపర్ జెయింట్స్ రికార్డులో నిలిచింది. 2025-26 సీజన్‌లో లక్నో 7 వరుస పరాజయాలను ఎదుర్కొంది. మిగతా జట్లు కూడా సొంత మైదానాల్లో వరుస ఓటములు ఎదురుకొన్నా.. చాలా ఏళ్లుగా టోర్నీలో కొనసాగుతున్నాయి. 202లో ఐపీఎల్‌లో ఎంట్రీ ఇచ్చిన లక్నో.. అప్పుడే ఈ చెత్త రికార్డు ఖాతాలో వేసుకోవడం విశేషం. ఈ జాబితాలో అగ్రస్థానంలో ఢిల్లీ క్యాపిటల్స్ నిలిచింది. 2013 నుంచి 2015 మధ్య ఢిల్లీ వరుసగా 9 మ్యాచ్‌లు ఓడింది. ఇది ఇప్పటికీ అత్యధిక వరుస హోమ్ పరాజయాల రికార్డుగా ఉంది.రెండో స్థానంలో మాజీ టీమ్ డెక్కన్ ఛార్జర్స్ ఉంది. హైదరాబాద్‌లో 2008-2011 మధ్య 8 మ్యాచ్‌లు వరుసగా ఓడింది. ఇదే డీసీ 2011-12 మధ్య మరోసారి 7 వరుస పరాజయాలు నమోదు చేసింది. ఐపీఎల్ మాజీ జట్టు పూణే వారియర్స్ ఇండియా 2012-13 మధ్య పుణేలో 7 మ్యాచ్‌లు వరుసగా ఓడింది. తాజాగా లక్నో కూడా ఈ జాబితాలో చేరింది. 2025-26 మధ్య లక్నోలో వరుసగా 7 మ్యాచ్‌లు ఓడుతూ చెత్త రికార్డు నమోదు చేసింది. ఈ వరుస పరాజయాలు జట్టుకు ఆందోళన కలిగించే అంశంగా మారింది. ఈ స్టాట్స్ చూస్తే.. హోమ్ గ్రౌండ్ అనేది ఎప్పుడూ అడ్వాంటేజ్‌గా ఉండకపోవచ్చు. సరైన ఫామ్ లేకపోతే, పరిస్థితులు కలిసిరాకపోతే..మైదానం ఏదైనా ఓడాల్సి వస్తుంది.



# మెయిడెన్ ఓవర్.. ఆపై వికెట్

రాజస్థాన్ రాయల్స్‌కు దొరికిన సంచలన ఆటగాడు వైభవ్ సూర్యవంశీ. ఐపీఎల్‌లో అరంగేట్రంలోనే అద్భుత రికార్డులు సొంతం చేసుకున్నాడు. ఆరెంజ్ క్యాప్‌ను సైతం దక్కించుకున్నాడు. ఇక ఈ 15 ఏళ్ల కుర్రాడిని ఆపడం ఎవరి తరం కాదని అందరూ అభిప్రాయపడ్డారు. కట్‌చేస్తే నిన్నటి మ్యాచ్‌లో లక్నో సూపర్ జెయింట్స్ పేసర్ మొహ్సిన్ ఖాన్ చుక్కలు చూపించాడు. బుధవారం ఏకానా స్టేడియంలో జరిగిన పోరులో మొహ్సిన్ తన స్పెల్‌తో వైభవ్‌ను కట్టడి చేసేశాడు. ఈ సీజన్‌లో వైభవ్‌పై మెయిడెన్ ఓవర్ వేసిన తొలి బౌలర్‌గా మొహ్సిన్ రికార్డు సృష్టించాడు. కేవలం మెయిడెన్ వేయడమే కాకుండా ఆ ఓవర్ ఆఖరి బంతికి వైభవ్‌ను పెవిలియన్‌కు పంపి డబుల్ ధమాకా ఇచ్చాడు. నిజానికి ఈ ఐపీఎల్ సీజన్ మొత్తంలో ఇప్పటివరకు నమోదైన రెండు మెయిడెన్ ఓవర్లు మొహ్సిన్ ఖాతాలోనే ఉండటం విశేషం.గతంలో ఢిల్లీ క్యాపిటల్స్ బ్యాటర్ నితీష్ రాణాను సైతం మొహ్సిన్ ఇలాగే పరుగులు చేయకుండా అడ్డుకున్నాడు. మొహ్సిన్ విసిరిన గుడ్ లెంగ్త్ డెలివరీని లాంగ్-ఆన్ మీదుగా బాదడానికి వైభవ్ ప్రయత్నించగా, బంతి బ్యాట్ లోపలి అంచుకు తగిలి గాల్లోకి లేచింది. కవర్స్ వద్ద ఉన్న దిగ్వేష్ రాఠీ వెనక్కి పరిగెత్తుతూ అద్భుతమైన క్యాచ్ పట్టడంతో వైభవ్ ఇన్నింగ్స్ ముగిసింది. మరోవైపు మొహ్సిన్ ఖాన్ మళ్లీ ఫామ్‌లోకి వచ్చినట్లు కనిపిస్తున్నాడు. దీంతో లక్నోకు ఈ బౌలర్ వల్ల కలిసొచ్చే అంశం ఉంది. 2022లో అరంగేట్రం చేసినప్పుడు 9 మ్యాచ్‌ల్లో 14 వికెట్లతో చెలరేగిన మొహ్సిన్, ఆ తర్వాత గాయాల బారిన పడి తీవ్రంగా ఇబ్బంది పడ్డాడు. భుజం సర్జరీ, వెన్ను, కాలి గాయాల వల్ల గత సీజన్ మొత్తానికి దూరమయ్యాడు. 2024లో పునరాగమనం చేసినా మునుపటి పదును కనిపించలేదు. కానీ, ఈ సీజన్‌లో వైభవ్ వంటి ఫామ్‌లో ఉన్న బ్యాటర్లను సైతం వణికించి తాను మళ్లీ ఫామ్‌లోకి వచ్చానని మొహ్సిన్ నిరూపించుకున్నాడు.

# కసితీరా పగ తీర్చుకున్న దక్షిణాఫ్రికా..





భారత్ మహిళల జట్టుపై దక్షిణాఫ్రికా మహిళల జట్టు ఐదు మ్యాచ్‌ల టీ20 సిరీస్‌లో 3-0తో విజయం సాధించి సిరీస్ ను కైవసం చేసుకుంది. మూడో టీ20లో భారత్‌ను 9 వికెట్ల తేడాతో ఓడించి సిరీస్ ను సొంతం చేసుకుంది. అంతకుముందు జరిగిన మొదటి రెండు మ్యాచ్ ల్లోనూ వరుసగా 6 వికెట్లు, 8 వికెట్ల తేడాతో విజయం సాధించిన దక్షిణాఫ్రికా జట్టు, మూడు మ్యాచ్ ల్లోనూ ఛేజ్ చేస్తూ టీమిండియాపై ఆధిపత్యం కొనసాగించింది.మూడో టీ20లో ముందుగా బ్యాటింగ్ చేసిన భారత్ జట్టు 20 ఓవర్లలో భారీ స్కోర్ నమోదు చేసింది. షెఫాలి వర్మ 64 పరుగులు, హర్మన్‌ప్రీత్ కౌర్ 66 పరుగులతో రాణించడంతో భారత్ 193 పరుగుల లక్ష్యాన్ని నిర్దేశించింది. అయితే ఈ లక్ష్యాన్ని దక్షిణాఫ్రికా జట్టు ఎలాంటి ఒత్తిడికి లోనుకాకుండా సులభంగా ఛేజ్ చేసింది. ఈ విజయానికి ప్రధాన కారకురాలు దక్షిణాఫ్రికా కెప్టెన్ లారా వుల్ఫార్ట్. ఛేజింగ్ ఆరంభం నుంచే దూకుడుగా ఆడిన ఆమె భారత బౌలర్లపై ఆధిపత్యం ప్రదర్శిస్తూ.. కేవలం 47 బంతుల్లోనే శతకం సాధించి తన టీ20 అంతర్జాతీయ కెరీర్‌లో అత్యంత వేగవంతమైన సెంచరీ నమోదు చేసింది. మొత్తంగా 53 బంతుల్లో 14 ఫోర్లు, 5 సిక్సర్లతో 115 పరుగులు చేసి జట్టుకు విజయం అందించింది.లారా వుల్ఫార్ట్ ఈ సిరీస్‌లో వరుసగా 51, 54, 115 పరుగులు చేసి మొత్తం 220 పరుగులు సాధించింది. 73.33 సగటుతో సిరీస్‌లో టాప్ స్కోరర్‌గా నిలిచింది. ఈ మ్యాచ్‌లో శతకం సాధించడం ద్వారా లారా వుల్ఫార్ట్ మరో అరుదైన ఘనతను కూడా సాధించింది. మహిళల అంతర్జాతీయ క్రికెట్‌లో అత్యధికంగా 17 శతకాలు సాధించిన రికార్డును స్మృతి మంధాన, మెగ్ లానింగ్ తో సమం చేసింది. ఇప్పటివరకు ఆమె టెస్ట్‌లో 1, వన్డేల్లో 13, టీ20ల్లో 3 శతకాలు నమోదు చేసింది.

# బిజినెస్



# కొంప ముంచిన క్రూడ్ ఆయిల్..


దేశీయ స్టాక్ మార్కెట్లు వరుసగా రెండో రోజున కూడా భారీ నష్టాలతో తమ ప్రయాణాన్ని ప్రారంభించాయి. ప్రధానంగా ఇరాన్ అమెరికా మధ్య యుద్ధ విరమణ చర్చలపై అలుముకున్న గందరగోళంతో క్రూడ్ ఆయిల్ రేట్లు భారీగా పెరగటం అతిపెద్ద కారణం అని మార్కెట్ వర్గాలు చెబుతున్నాయి. ఈ క్రమంలో గత కొన్ని సెషన్ల నుంచి విదేశీ ఇన్వెస్టర్లు మన భారత స్టాక్ మార్కెట్లలో పెట్టుబడులను పెంచుతూ డబ్బు కుమ్మరిస్తున్నప్పటికీ ఇవాళ ఇంట్రాడేలో కీలక సూచీలు నష్టాల్లో తమ ప్రయాణాన్ని కొనసాగిస్తున్నాయి. ఉదయం 9.56 గంటల సమయంలో బెంచ్ మార్క్ సూచీ సెన్సెక్స్ 437 పాయింట్లు నష్టంతో ట్రేడవుతుండగా మరో కీలక సూచీ నిఫ్టీ కూడా 88 పాయింట్లు కోల్పోయి ముందుకు సాగుతోంది. ఇదే క్రమంలో నిఫ్టీ బ్యాంక్ సూచీ 289 పాయింట్లు కోల్పోగా.. నిఫ్టీ మిడ్ క్యాప్ సూచీ మాత్రమే స్వల్పంగా 16 పాయింట్ల లాభంతో ముందుకు సాగుతోంది. ప్రస్తుత పరిస్థితులలతో స్టాక్ మార్కెట్లతో పాటు కరెన్సీ మార్కెట్లు కూడా ఒత్తిడిలోనే కొనసాగుతున్నాయి. రూపాయి మారకపు విలువ 20 పైసలు తగ్గి 94 స్థాయిలకు చేరింది. క్రూడ్ ధరలు బ్యారెల్ 104 డాలర్లకు చేరుకోవటమే ఈ పతనానికి కారణంగా తెలుస్తోంది. దీనికి తోడు ఆయియా మార్కెట్లు మట్నత్తం నష్టాల్లో ట్రేడింగ్ కొనసాగించటంతో ఆ ప్రతికూల సెంటిమెంట్ దేశీయ ఇన్వెస్టర్లను కూడా కుదిపేస్తోందని నిపుణులు చెబుతున్నారు. గత రాత్రి అమెరికా మార్కెట్లు కూడా నష్టాల్లో క్లోజ్ కావటం గమనార్హం. వీటికి తోడు దేశీయంగా కంపెనీలు తమ నాల్గవ త్రై-మాసిక ఆర్థిక ఫలితాలను ప్రకటిస్తుండటం కూడా ఇన్వెస్టర్ల పెట్టుబడి నిర్ణయాలను కొంత దెబ్బతీస్తోందని తెలుస్తోంది.




# జాయింట్ వెంచర్ ఏర్పాటు

దేశీయ బీమా రంగంలో కీలక పరిణామం చోటుచేసుకుంది. జియో ఫైనాన్షియల్ సర్వీసెస్, అలియాంజ్ గ్రూప్ సంయుక్తంగా 50:50 నిష్పత్తిలో కొత్త జాయింట్ వెంచర్‌ను ఏర్పాటు చేశాయి. దీనికి సంబంధించి బుధవారం ఇరు సంస్థలు ఒప్పందంపై సంతకాలు చేశాయి. ఈ భాగస్వామ్యాన్ని 2025, జూలైలోనే ప్రకటించగా, ఇప్పుడు అధికారికంగా అమల్లోకి వచ్చింది. సంబంధిత నియంత్రణ సంస్థల అనుమతులు వచ్చిన తర్వాత ఈ కొత్త సంస్థ కార్యకలాపాలు ప్రారంభం కానున్నాయి. ఈ జాయింట్ వెంచర్ ద్వారా జియో ఫైనాన్షియల్ సర్వీసెస్ విస్తృత డిజిటల్ నెట్‌వర్క్, పంపిణీ సామర్థ్యాన్ని, గ్లోబల్ బీమా నైపుణ్యం ఉన్న అలియాంజ్ కలిపి వ్యక్తులు, చిన్న వ్యాపారాలు, పెద్ద సంస్థలకు అందుబాటులో ఉండే బీమా ఉత్పత్తులను అందించనున్నారు. ముఖ్యంగా హెల్త్, జనరల్ ఇన్సూరెన్స్ రంగాల్లో కొత్త పరిష్కారాలు తీసుకురావాలని కంపెనీలు భావిస్తున్నాయి. ప్రధానంగా ఈ భాగస్వామ్యం ద్వారా '2047 నాటికి అందరికీ బీమా' అనే కేంద్ర ప్రభుత్వ లక్ష్యాన్ని సాధిస్తామని కంపెనీ తెలిపాయి. దేశంలో పెరుగుతున్న మధ్యతరగతి, యువత కారణంగా బీమా అవసరం వేగంగా పెరుగుతోంది. అందుకోసం దేశంలోని ప్రతి భారతీయుడికి ఆర్థిక సేవలను అందుబాటులోకి తీసుకురావాలని లక్ష్యంగా ఉన్నామని కంపెనీ పేర్కొన్నాయి.

# తిరోగమనంలో పసిడి ధరలు



భారత్‌లో ఈ వారం బంగారం స్పాట్ ధర తిరోగమనంలో పయనిస్తోంది. భౌగోళిక రాజకీయ అనిశ్చితులు, డాలర్ బలపడటం వెరసి బంగారం ధర తగ్గేలా చేస్తున్నాయి. గుడ్ రిటర్న్స్ వెబ్‌సైట్ ప్రకారం, హైదరాబాద్ బులియన్ మార్కెట్‌లో నేడు (ఏప్రిల్ 23) ఉదయం 6.30 గంటల సమయంలో 24 క్యారెట్ల 10 గ్రాముల పసిడి ధర రూ.1,54,740గా ఉంది. 22 క్యారెట్ల 10 గ్రాముల ఆర్నమెంటల్ బంగారం ధర రూ.1,41,840ల వద్ద కొనసాగుతోంది. ఈ వారం హైదరాబాద్‌లో వెండి ధర ఇప్పటివరకూ ఓ మోస్తరు స్థాయిలో మాత్రమే తగ్గింది. ప్రస్తుతం కిలో వెండి రూ.2,74,900 వద్ద కొనసాగుతోంది.ఇక చెన్నైలో ప్రస్తుతం 24 క్యారెట్ల 10 గ్రాముల పసిడి ధర గరిష్ఠంగా రూ.1,55,450 వద్ద కొనసాగుతోంది. ఢిల్లీలో రూ.1,54,890గా, ముంబై, కోల్‌కతా నగరాల్లో రూ.1,54,740గా ఉంది. చెన్నైలో ఆర్నమెంటల్ పసిడి ధర రూ.1,42,490గా ఉంది. డిల్లీలో రూ.1,41,990ల వద్ద కొనసాగుతోంది. ముంబై, కోల్‌కతా నగరాల్లో రూ.1,41,840ల వద్ద తచ్చాడుతోంది. భారత్‌లో ఈ వారం ఇప్పటివరకూ వెండి స్పాట్ ధర సగటున రూ.10 వేల మేర తగ్గింది. వివిధ నగరాల్లో కిలో వెండి ధర రూ.2.64 లక్షల నుంచి రూ.2.74 లక్షల మధ్య ఉంది.




# తెలుగు రాష్ట్రాల్లో పెట్రోల్, డీజిల్ ధరలు

రెండు తెలుగు రాష్ట్రాల్లో ప్రధాన నగరాల్లో ఈ రోజు (ఏప్రిల్ 23) పెట్రోల్, డీజిల్ ధరలు ఎలా ఉన్నాయో ఇప్పుడు తెలుసుకుందాం. తెలంగాణలో హైదరాబాద్‌లో ఈ రోజు (గురువారం) పెట్రోల్ ధర లీటర్‌కు రూ.107.46, డీజిల్ ధర రూ.95.70గా ఉంది. ఈ ధరలు హైదరాబాద్‌లో నిన్నటి పోలిస్తే డీజిల్ ధరలో కాస్త మార్పు నమోదైంది. ఇక, వరంగల్‌లో లీటర్ పెట్రోల్ ధర రూ.107.12 కాగా, లీటర్ డీజిల్ ధర రూ.95.37గా ఉంది. అలాగే, ఏపీలో ప్రధాన నగరాల విశాఖపట్నంలో లీటర్ పెట్రోల్ ధర రూ.108.51, లీటర్ డీజిల్ ధర రూ.96.22గా ఉంది.

విజయవాడలో లీటర్ పెట్రోల్ ధర రూ.109.79, లీటర్ డీజిల్ ధర రూ.97.61గా ఉంది. దాదాపు రెండు తెలుగు రాష్ట్రాల్లో పెట్రోల్, డీజిల్ ధరలు ఇవే ఉన్నాయి.



# భారత్‌కు టెస్లా హ్యూమనాయిడ్ రోబోట్

అమెరికాకు చెందిన ఈవీ దిగ్గజం టెస్లా భారత్‌కు సంబంధించి తన దీర్ఘకాల ప్రణాళికలను మరింత స్పష్టంగా తెలియజేసింది. సంస్థ హ్యూమనాయిడ్ రోబోట్ ఆప్టిమస్‌ను సరైన సమయంలో భారత మార్కెట్‌లోకి తీసుకురావాలని చూస్తున్నట్లు ఆ సంస్థ సీనియర్ అధికారి ఒకరు బుధవారం తెలిపారు. టెస్లా ఏపీఏసీ చీఫ్ ఇసాబెల్ ఫాన్ మాట్లాడుతూ.. హ్యూమనాయిడ్ రోబోట్‌తో పాటు టెస్లా ఇంటిగ్రేటెడ్ ఎనర్జీ సొల్యూషన్ వ్యాపారాన్ని కూడా భవిష్యత్తులో భారత్‌లోకి తీసుకొచ్చే అవకాశాన్ని పరిశీలిస్తున్నామన్నారు. ఈ ఏడాది చివర్లో అమెరికాలో దీని భారీ ఉత్పత్తి ప్రారంభమవుతుంది. భవిష్యత్తులో ఈ హ్యూమనాయిడ్ రోబోట్లు రోజువారీ జీవితంలో కీలక పాత్ర పోషిస్తాయని, ముఖ్యంగా ప్రమాదకర పనులు, ఇంట్లో సాయం అందించడం, ప్రాథమిక వైద్య సహాయం వంటి విభాగాల్లో ఉపయోగపడతాయని టెస్లా భావిస్తోంది. ఇక, ఇంధన రంగానికి సంబంధించి టెస్లా భారత్‌ను ముఖ్యమైన మార్కెట్‌గా చూస్తోంది. సౌరశక్తి, పవర్ స్టోరేజ్, ఎనర్జీ మేనేజ్‌మెంట్ వంటి పరిష్కారాలను అందించే సంస్థగా టెస్లా ఇప్పటికే ప్రపంచవ్యాప్తంగా పనిచేస్తోంది. వాణిజ్య అవసరాల కోసం మెగాప్యాక్ స్టోరేజ్, గృహ అవసరాల కోసం పవర్‌వాల్ వంటి ఉత్పత్తులను సరైన సమయంలో భారత్‌లోకి తీసుకొచ్చే అవకాశాలు ఉన్నాయని సంస్థ పేర్కొంది.



# ‘రాకా’ నుంచి దీపికా పదుకొణె ఔట్..

అయితే, గత కొన్ని రోజులుగా ఈ ప్రాజెక్ట్ గురించి సోషల్ మీడియాలో రకరకాల వార్తలు చక్కర్లు కొడుతున్నాయి. దీపికా పదుకొణె తాను రెండోసారి తల్లి కాబోతున్నట్లు ప్రకటించడంతో, ‘రాకా’ సినిమా నుంచి ఆమె తప్పుకుందని పెద్ద ఎత్తున ప్రచారం జరిగింది. ఆమె గర్భవతి కావడంతో యాక్షన్ సీక్వెన్స్‌లు చేయడం కష్టమని, అందుకే షూటింగ్ ఆగిపోయిందని, మేకర్స్ వేరే హీరోయిన్ కోసం వెతుకుతున్నారని వార్తలు వచ్చాయి. దీనికి తోడు సినిమాలో ఆమె పాత్ర నిడివిని కూడా తగ్గించబోతున్నారనే పుకార్లు ఫ్యాన్స్‌ను అయోమ-యంలో పడేశాయి. ఈ పుకార్లపై ‘రాకా’ చిత్ర బృందం తాజాగా స్పందించింది. ఇవన్నీ కేవలం అబద్ధపు వార్తలే అని తేల్చి చెప్పింది.దీపికా పదుకొణె ఈ సినిమా నుంచి తప్పుకోలేదని, ఆమెనే హీరోయిన్‌గా కొనసాగుతుందని స్పష్టం చేశారు. వేరే ఎవరినీ తీసుకునే ఉద్దేశం లేదని క్లారిటీ ఇచ్చారు. షూటింగ్ ఎక్కడా ఆగలేదని, ముందుగా ప్లాన్ చేసిన షెడ్యూల్స్ ప్రకారమే పక్కాగా సాగుతోందని వెల్లడించారు. సినిమాలో దీపికా పాత్ర చాలా కీలకమని, ఆమె పాత్రను తగ్గించారనే వార్తల్లో అస్సలు నిజం లేదని మేకర్స్ విజ్ఞప్తి చేశా-రు. సన్ పిక్చర్స్ బ్యానర్‌పై అత్యంత ప్రతిష్టాత్మకంగా రూపొందుతున్న ఈ ఫాంటసీ ఎంటర్‌టైనర్‌లో దీపికా కొన్ని క్రేజీ యాక్షన్ సన్నివేశాల్లో కూడా కనిపించనుంది. ప్రస్తుతం ఆమె పరిస్థితి దృష్ట్యా, వైద్యుల సూచనల మేరకు అన్ని జాగ్రత్తలు తీసుకుంటూ ఆ సీక్వెన్స్‌లను ప్లాన్ చే స్తున్నట్లు సమాచారం. ఏదేమైనా, అల్లు అర్జున్ – అట్లీ – దీపికా పదుకొణెల క్రేజీ కాంబో చెక్కుచెదరకుండా ఉందని తెలియడంతో బన్నీ ఫ్యాన్స్ ఫుల్ ఖుషీ అవుతున్నారు.




# సౌత్ నిర్మాతల సంచలన నిర్ణయం..

టాలీవుడ్, కోలీవుడ్ సినిమాల డిజిటల్ విడుదలపై గత కొంతకాలంగా నెలకొన్న ఉత్కంఠకు తెరపడింది. థియేటర్లలో విడుదలైన ఎన్ని రోజులకు సినిమా ఓటీటీలోకి రావాలనే అంశంపై దక్షిణాది సినీ నిర్మాతల అసోసియేషన్ కీలక సమావేశం నిర్వహించింది. ఈ భేటీలో నిర్మాతలు తీసుకున్న నిర్ణయం ఇప్పుడు ఎగ్జిబిటర్లను ఆందోళనకు గురిచేస్తోంది.సినిమా థియేటర్లలో విడుదలైన తర్వాత కనీసం 8 వారాల వరకు ఓటీటీ స్ట్రీమింగ్ చేయకూడదని మల్టీప్లెక్స్ అసోసియేషన్లు డిమాండ్ చేస్తున్నాయి. అలా చేస్తేనే ప్రేక్షకుల థియేటర్లకు వస్తారని వారి వాదన. అయితే తెలుగు, తమిళ నిర్మాతలు మాత్రం దీనికి ససేమిరా అన్నట్లు తెలుస్తోంది. సిరిమా బడ్జెట్లు పెరిగిపోతున్న తరుణంలో, ఓటీటీ డీల్స్ ద్వారా వచ్చే ఆదాయం తమకు భారంగా మాతుందని, అందుకే 4 వారాల గ్యాప్ అయిన ఉండాలని వారు ఖారాకండిగా చెప్పేశారట. చిన్న, మీడియం రేంజ్ సినిమాలకు 4 వారాల తర్వాత ఓటీటీ ఆదాయం చాలా ముఖ్యం. దీని బట్టి చూస్తే సౌత్ ఇండియాలో స్టార్ హీరోల సినిమాలకు మినహా, మిగిలిన చిత్రాలన్నింటికీ ఈ 4 వారాల ఫార్ములానే వర్తించేలా కనిపిస్తోంది. అగ్రిమెంట్లలో నిర్మాతలు ఈ క్లాజ్‌ను కచ్చితంగా పెడుతున్నారట. దీనివల్ల భవిష్యత్తులో సౌత్ సినిమాల డిజిటల్ బిజినెస్ మరింత వేగవంతం కానుంది. అయితే, బాలీవుడ్ లో మాత్రం ఇప్పటికీ 8 వారాల నిబంధనను కఠినంగా అమలు చేసే ప్రయత్నాలు జరుగుతున్నాయి.

# నెగిటివ్ రోల్స్ లో డింపుల్?

టాలీవుడ్ ఇండస్ట్రీలో చాలామంది హీరోయిన్లు ఉన్నప్పటికీ కొంతమంది మాత్రమే పాపులర్ అవుతూ ఉంటారు. అలాంటి వారిలో డింపుల్ హయాతి ఒకరు. విజయవాడలో పుట్టిన ఈ అందాల తార, హైదరాబాద్ లో సెటిల్ అయ్యారు. 2017 లో గల్ఫ్ సినిమాతో తెలుగు ప్రేక్షకులకు పరిచయమైన డింపుల్ హయాతి, గద్దల కొండ గణేష్ సినిమాలో ఐటెం సాంగ్ కూడా చేశారు. ఆ తర్వాత రవితేజ నటించిన ఖిలాడి సినిమాలో మెరిసి అందరినీ ఆకట్టుకున్నారు. ఆ తర్వాత రామబాణం, భర్త మహాశయులకు విజ్ఞప్తి లాంటి సినిమాలు చేసి అందరినీ అలరించారు డింపుల్ హయాతి. అయితే ఇక పైన నెగిటివ్ రోల్స్ చేసేందుకు ఈ అందాల తార సిద్ధమవుతున్నట్లు టాక్ నడుస్తోంది.హీరోయిన్ గా ఎన్నో సినిమాలు చేసిన డింపుల్ హయాతి, ఇప్పుడు కొత్త రూట్ ఎంచుకున్నట్లు టాక్ నడుస్తోంది. పెద్ద ప్రాజెక్టులలో నెగిటివ్ రోల్స్ చేసేందుకు ఆమె సిద్ధమవుతున్నారట. కె ఎస్ రవీంద్ర దర్శకత్వంలో మెగాస్టార్ చిరంజీవి ఓ సినిమా చేస్తున్న సంగతి తెలిసిందే. అయితే ఇందులో డింపుల్ హయాతి విలన్ పాత్రలో కనిపించబోతున్నట్లు టాక్ నడుస్తోంది. ఈ మేరకు ఇప్పటికే డింపుల్, చిత్ర బృందం మధ్య సంప్రదింపులు కూడా పూర్తయ్యాయట. గతంలో గోపీచంద్ మలినేని-నందమూరి బాలయ్య కాంబినేషన్ లో వచ్చిన సినిమాలో మొదటగా డింపుల్ హయాతిని నెగిటివ్ రోల్ కోసం తీసుకుని, ఆ తర్వాత వద్దనుకున్నారట. కానీ ఇప్పుడు మాత్రం ఆమె నెగిటివ్ రోల్ చేసేందుకు సిద్ధమైనట్లు తెలుస్తోంది. దీనిపై అధికారిక ప్రకటన కూడా రానుందని టాక్ నడుస్తోంది.





సూపర్ స్టార్ రజనీకాంత్ తదుపరి చిత్రం ‘థలైవర్ 173’ దర్శకుడి విషయంలో గత కొద్ది రోజులుగా ఇండస్ట్రీలో నెలకొన్న సస్పె-న్స్‌కు ఎట్టకేలకు తెరపడింది. ఈ ప్రతిష్టాత్మక ప్రాజెక్ట్‌ను పట్టాలెక్కించే బాధ్యతను ‘డాన్’ ఫేమ్ సిబి చక్రవర్తి దక్కించుకున్నట్లు సమాచారం. ఇప్పటికే ఈ సినిమాకు సంబంధించి చర్చలు పూర్తయ్యాయని, త్వరలోనే దీనిపై అధికారిక ప్రకటన వెలువడనుందని కోలీవుడ్ వర్గాల్లో గట్టిగా వినిపిస్తోంది. కమల్ హాసన్ తన ‘రాజ్ కమల్ ఫిల్మ్స్ ఇంటర్నేషనల్’

# సస్పెన్స్ వీడింది..

బ్యానర్‌పై ఈ భారీ యాక్షన్ ఎంటర్టైనర్‌ను నిర్మించబోతున్నారు.ముందుగా ఈ సినిమాకు సుందర్ సి దర్శకత్వం వహిస్తారని ప్రకటన చేసారు కానీ అనుకోని కారణాల వలన సుందర్ ఈ ప్రాజెక్ట్ నుండి తప్పుకున్నారు. ఆ తర్వాత సిబి చక్రవర్తి పేరుతో మరొక ప్రకటన చేసారు. ఇటీవల సీబీ ఈ సినిమా నుండి తప్పుకున్నాడని వార్తలు వచ్చాయి. సీబీ స్తానంలో అశ్వత్ మారిముత్తు పేరు వినిపించింది. కానీ చివరికి సిబి చక్రవర్తి చెప్పిన కథకే రజనీ గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు తెలుస్తోంది. ప్రస్తుతం రజనీకాంత్ ‘జైలర్ 2’ షూటింగ్ పూర్తి చేసుకున్న వెంటనే, ఈ క్రేజీ ప్రాజెక్ట్ సెట్స్ పైకి వెళ్లే అవకాశం ఉంది. ఈ సినిమాలో రజనీకాంత్ సరికొత్త స్టైలిష్ లుక్‌లో కనిపిస్తారని, సిబి చక్రవర్తి తనదైన మార్క్ ఎంటర్టైన్మెంట్‌తో స్క్రిప్ట్ సిద్ధం చేశారని టాక్. మరో ఆసక్తికరమైన విషయం ఏమిటంటే.. రజనీకాంత్ ప్రాజెక్ట్ ముగిసిన వెంటనే సిబి చక్రవర్తి తెలుగు చిత్ర పరిశ్రమలోకి అడుగుపెట్టబోతున్నారు. నేచురల్ స్టార్ నాని హీరోగా సిబి ఒక భారీ చిత్రాన్ని ప్లాన్ చేస్తున్నట్లు సమాచారం




# ఆదర్శ కుటుంబం టీమ్ నుంచి...

విక్టరీ వెంకటేష్ మరియు మాటల మాంత్రికుడు త్రివిక్రమ్ శ్రీనివాస్ కాంబినేష-న్‌లో రాబోతున్న ప్రతిష్టాత్మక చిత్రం ‘ఆదర్శ కుటుంబం’. ఈ సినిమా అనౌన్స్ చేసినప్పటి నుంచి దగ్గుబాటి అభిమానుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. అయితే తాజాగా ఈ చిత్రం నుంచి ఒక ఆసక్తికరమైన న్యూస్ సోషల్ మీడియాలో వైరల్ గా మారింది. ఈ సినిమాకు సంగీత దర్శకుడిగా మొదట అనుకున్న హర్షవర్ధన్ ర మేశ్వర్ ఈ ప్రాజెక్ట్ నుంచి తప్పుకున్నారు. మరి క్రియేటివ్ డిఫరెన్స్ వలన బయటకు వచ్చారా లేదా డేట్స్ సర్దుబాటు కాకపోవడం వల్లే ఆయన ఈ టీమ్ నుంచి వైదొలిగార అనేది క్లారిటీగా తెలియరాలేదు.హర్షవర్ధన్ తప్పుకోవడంతో ఆ బాధ్యతను త్రివిక్రమ్ ఆస్థాన స్టార్ మ్యూజిక్ డైరెక్టర్ ఎస్.ఎస్. తమన్ రంగంలోకి దిగారు. త్రివిక్రమ్ సినిమాలకు తమన్ అందించే సంగీతం ఎంతటి సంచలనం సృష్టిస్తుందో ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. ‘అల వైకుంఠపురములో’, ‘గుంటూరు కారం’ అరవింద సమేత వీరరాఘవ వంటి సినిమాల తర్వాత వీరిద్దరి కాంబోలో మరో మ్యాజిక్ రిపీట్ అవుతుందని మేకర్స్ భావిస్తున్నారు. తాజాగా తమన్‌తో కలిసి త్రివిక్రమ్ మ్యూజిక్ సిట్టింగ్స్ కూడా ప్రారంభించినట్లు తెలుస్తోంది.

చాలా కాలం తర్వాత వెంకటేష్ ఒక కంప్లీట్ ఫ్యామిలీ ఎంటర్టైనర్‌తో రాబోతుండటందానికి త్రివిక్రమ్ దర్శకత్వం వహిస్తుండటంతో సినిమాపై ట్రేడ్ వర్గాల్లో పాజిటివ్ వైబ్స్ కనిపిస్తున్నాయి. హారిక అండ్ హాసిని క్రియేషన్స్ నిర్మిస్తున్న ఈ చిత్రం మే లేదా జూన్ కల్లా టోటల్ షూట్ ఫినిష్ కానుందని సమాచారం. తమన్ ఎంట్రీతో ఈ సినిమా ఆడియో మరియు బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ నెక్స్ట్ లెవల్‌లో ఉంటుందని ఫ్యాన్స్ ఆశిస్తున్నారు.




టాలీవుడ్ మోస్ట్ బ్యూటిఫుల్ కపుల్ వరుణ్ తేజ్ -- లావణ్య త్రిపాఠిల ప్రేమకథ ఇప్పుడు మరోసారి సోషల్ మీడియాలో హాట్ టాపిక్ అయింది. వీరిద్దరూ ఏడేళ్ల పాటు అత్యంత రహస్యంగా ప్రేమించుకున్నారనే విషయాన్ని వరుణ్ సోదరి, నటి నిహారిక కొణిదెల తాజాగా ఎన్టీవీ పాడ్‌కాస్ట్‌లో వెల్లడించారు. తన అన్నయ్య ప్రేమ వ్యవహారం తెలిసి తను కూడా షాక్ అయ్యానని ఆమె పేర్కొన్నారు.ఈ సందర్భంగా నిహారిక మాట్లాడుతూ.. “అన్నయ్య (వరుణ్), లావణ్య వదిన ఏడేళ్లుగా ప్రేమలో ఉన్నారు. కానీ వారి ప్రేమ నాలుగో సంవత్సరంలో ఉన్నప్పుడు నాకు తెలిసింది. నిజానికి అన్నయ్యకు ఇండస్ట్రీలో ఎక్కువ మంది స్నేహితులు లేరు. నాకు తెలిసిన అన్నకు నితిన్ అన్న ఒక్కడే ఫ్రెండ్ అనుకుంటా ఇండస్ట్రీ నుంచి. అలాంటిది అన్నయ్య బర్త్ డే పార్టీలో వదినను చూశాక

## నాలుగేళ్ల వరకు ఎవరికీ తెలీదు..

నాకు అర్థమైంది. అప్పటి నుంచి నేను, లావణ్య వదిన మంచి స్నేహితులమయ్యాం. వదిన చాలా ఫ్రెండ్లీగా ఉంటుంది. మా కుటుంబంతో ఆమె పర్‌ఫెక్ట్‌గా సెట్ అయిపోయింది” అని నిహారిక వివరించారు.వరుణ్ తేజ్, లావణ్య త్రిపాఠి మొదటిసారి 2017లో వచ్చిన ‘మిస్టర్’ సినిమా కోసం కలిసి పనిచేశారు. ఆ సినిమా షూటింగ్ సమయంలోనే వీరి మధ్య స్నేహం మొదలై, అది కాస్తా ప్రేమగా మారింది. అప్పటి నుంచి వీరిద్దరూ డేటింగ్‌లో ఉన్నారంటూ మీడియాలో ఎన్ని వార్తలు వచ్చినా, మెగా ఫ్యామిలీ ఎప్పుడూ అధికారికంగా స్పందించలేదు. చివరకు 2023లో ఇటలీలోని టస్కనీలో వీరి వివాహం అత్యంత వైభవంగా జరిగింది. 2023లో పెళ్లి చేసుకున్న ఈ జంటకు, 2025లో ఒక మగబిడ్డ జన్మించాడు. ఆ బాబుకు ‘వాయువ్ తేజ్ కొణిదెల’ అని పేరు పెట్టారు. మెగా వారసుడి రాకతో అటు మెగా ఫ్యామిలీలో, ఇటు అభిమానుల్లో సందడి నెలకొంది.

# నటి రన్యా రావుకు ఊరట



భారీ బంగారం స్మగ్లింగ్ కేసులో అరెస్టయిన సినీ నటి రన్యా రావుకు ఎట్టకేలకు బెయిల్ మంజూరైంది. గత ఏడాది కాలంగా బెంగళూ-రులోని పరప్పణ అగ్రహారం జైలులో ఉంటున్న ఆమె, నేడు విడుదల కానున్నారు. సుమారు రూ.102 కోట్ల విలువైన బంగారం స్మగ్లింగ్ కేసులో రన్యారావు నిందితురాలిగా ఉన్నారు. ఈ భారీ కుంభకోణంలో ఆమె ప్రమేయం ఉందన్న ఆరోపణలతో గతంలో అధికారులు ఆమెను అదుపులోకి తీసుకున్నారు. అప్పటినుండి ఈ కేసు విచారణ కొనసాగుతోంది. నిజానికి, రన్యారావుకు 2025 మే నెలలోనే ఈ కేసులో బెయిల్ లభించింది. అయితే, విదేశీ మారకద్రవ్య పరిరక్షణ, స్మగ్లింగ్ కార్యకలాపాల నిరోధక చట్టం కింద ఆమెపై చర్యలు ఉండటంతో బెయిల్ వచ్చినా ఆమె విడుదల కాలేదు. గత దాదాపు ఏడాది కాలంగా ఈ చట్టం కారణంగానే ఆమె జైలులోనే ఉండాల్సి వచ్చింది. తాజాగా ‘కోఫెపోసా’ చట్టం పరిధిలోని నిబంధనల నుండి కూడా ఆమెకు ఊరట లభించడంతో, విడుదల మార్గం సుగమమైంది. నేడు జైలు నుంచి ఆమె బయటకు రానున్నారు. ఈ పరిణామం కన్నడ సినీ పరిశ్రమలో చర్చనీయాంశంగా మారింది.




# మెక్సికోలో రాజమౌళి మేజిక్ షురూ..

ప్రపంచ సినిమా వేదికపై ఇప్పుడు అందరి కళ్లు దర్శకధీరుడు రాజమౌళి వైపు ఉన్నాయి. ఆయన డ్రీమ్ ప్రాజెక్ట్, సూపర్ స్టార్ మహేశ్ బాబు కథానాయకుడిగా నటిస్తున్న ‘వారణాసి’ బాక్సాఫీస్ వద్ద ఎన్ని రికార్డులు సృష్టిస్తుందో అని అందరూ ఆసక్తిగా చూస్తున్నారు. ఈ క్రమంలో, ఈ సినిమా తన మొదటి అంతర్జాతీయ అడుగును మెక్సికోలో వేయ-ంబోతోంది.మెక్సికో సిటీలో జరుగుతున్న జజశూ వీశ 2026 వేదికపై ఏప్రిల్ 24న (రేపు) ‘వారణాసి’ టీమ్ ఒక స్పెషల్ ప్యానె-ల్‌ను నిర్వహించబోతోంది. థండర్ స్టేజ్ పై జరగబోయే ఈ ఈవెంట్‌లో “వారణాసి టు ద వరల్డ్” అనే పేరుతో ఒక ఎక్స్‌క్లూజివ్ గ్లింప్స్‌ను ప్రదర్శించనున్నారు. రాజమౌళి కుమారుడు, నిర్మాత ఎస్.ఎస్. కార్తికేయ ఈ కార్యక్రమంలో పాల్గొని గ్లోబల్ ఆడియన్స్‌తో ముచ్చటించనున్నారు.

షూటింగ్ పనుల్లో బిజీగా ఉన్న రాజమౌళి, ఈ ఈవెంట్ కోసం ఒక ప్రత్యేకమైన వీడియో మెసేజ్‌ను పంపారు.

ఇందులో సినిమాకు సంబంధించిన ఇప్పటివరకు ఎవరూ చూడని కొన్ని ఆసక్తికరమైన విషయాలను, తన విజన్‌ను ఆయన పంచుకోబోతున్నారు. ఇప్పటికే ఈ సినిమా షూటింగ్ అంటార్కిటికా వంటి అరుదైన ప్రదేశాల్లో జరగడం, విజువల్ ఎఫెక్ట్స్ కోసం భారీ బడ్జెట్ కేటాయించడం వంటి వార్తలు సినిమాపై అంచనాలను ఆకాశానికి చేర్చాయి.

Edited, Printed, Published & Owned by **KOMARAJU SRINIVASULU** and Printed at **Ramu Graphics**, Shop No:5,Near Clock Tower Church Compound, Nalgonda District (T.S.), Published From: KOMARAJU SRINIVASULU, Village: Anthaiah Gudem, Post: Duppalapally, Mandal: Thipparthy-508247, Dist. Nalgonda, (T.S) **Editor: KOMARAJU SRINIVASULU. Cell: 7730032999, E-mail: flashindiadaily@gmail.com, www.flashindianews.com, RNI No. APTEL/2010/33229**